


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 సంచిక :104 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం గురువారం 19 డిసెంబర్ 2024 వెల : 5/-రూ॥
VOLUME :11 ISSUE :104 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM THU 19 DECEMBER 2024 PRICE : 5/- RS
Simultaneously Published form Visakhapatnam, Kakinada, Ongole Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Prakasam, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur

## నూతన వధూవరులకు వైయస్ జగన్ ఆశీస్సులు

- కర్నూలు పర్యటనలో జగన్..
- వైసీపీ నేత సురేంద్ర రెడ్డి కుమార్తె రిసెప్షన్ కు హాజరైన జగన్
- నూతన వధూవరులను ఆశీర్వదించిన వైసీపీ అధినేత
- కర్నూలు నుంచి తాడేపల్లికి వెళ్లనున్న జగన్

పెన్ పవర్ డెస్క్:వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ ఈ మధ్యాహ్నం కర్నూలులో పర్యటించారు. కర్నూలులోని జీఆర్సీ కన్వెన్షన్ సెంటర్ లో జరిగిన వైసీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నెకల్ సురేంద్ర రెడ్డి కుమార్తె వివాహ రిసెప్షన్ కు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులు డాక్టర్ చతుర, డాక్టర్ నిఖిల్ లను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కన్వెన్షన్ సెంటర్ వద్దకు పెద్ద సంఖ్యలో వైసీపీ అభిమానులు చేరుకున్నారు. అందరికీ అభివాదం చేస్తూ ఆయన ముందుకు సాగారు. బెంగళూరులో ఉన్న జగన్ ప్రత్యేక హెలికాప్టర్ లో కర్నూలుకు చేరుకున్నారు. కర్నూలు నుంచి ఆయన తాడేపల్లికి వెళ్తారు. తాడేపల్లిలో కీలక వైసీపీ నేతలతో ఆయన భేటీ అవుతారు.



## జల్ జీవన్ మిషన్ లో గత వైసీపీ ప్రభుత్వం రూ. 4 వేల కోట్లు దుర్వినియోగం చేసింది

- విజయవాడలో జల్ జీవన్ మిషన్ పై వర్క్ షాప్
- జల్ జీవన్ మిషన్ ను బలోపేతం చేస్తామన్న పవన్
- ప్రతి ఒక్కరికీ పరిశుభ్రమైన నీటిని అందించడమే మిషన్ లక్ష్యమని వ్యాఖ్య



పెన్ పవర్ డెస్క్:గత వైసీపీ ప్రభుత్వంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. జల్ జీవన్ మిషన్ లో గత ప్రభుత్వం రూ. 4 వేల కోట్లు దుర్వినియోగం చేసిందని విమర్శించారు. విజయ వాడలో గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య విభాగం ఆధ్వర్యంలో జల్ జీవన్ మిషన్ అమలుపై రాష్ట్ర స్థాయి వర్క్ షాప్ ను నిర్వహించారు.

వివరాలు 2లో..

## అసెంబ్లీల గడువును లోక్ సభతో ముడిపెట్టడం సరికాదు



జమిలి ఎన్నికల బిల్లులను పార్లమెంటులో ప్రవేశ పెట్టడంపై ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల విమర్శలు గుప్పించారు. భారత రాజ్యాంగంపై బీజేపీ దాడి కొనసాగుతూనే ఉందని మండిపడ్డారు.

వివరాలు 2లో..

## పరిపాలనా సౌలభ్యం కోసమే మూడు భాషల ఫార్ములా



దేశంలో ప్రాంతీయ భాషలను ప్రోత్సహించేందుకు మోదీ ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. కేంద్రంలోకి బీజేపీ అధికారంలోకి వచ్చాకే 21 భాషలకు స్థానం దక్కిందన్నారు. భాషలు.. మన సంస్కృతి, వారసత్వం, మన

వివరాలు 2లో..

## ఆధ్యాత్మిక నగరిలో అకృత్యాలకు పాల్పడుతున్నారు

- తిరుపతి పవిత్రతను మంటగలుపుతున్నారు
- కూటమి ప్రభుత్వ అండతోనే ఈ దారుణాలు
- దుష్ట సంస్కృతికి బీజం వేస్తున్న చంద్రబాబు పాలన
- వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ఆగ్రహం
- తిరుచానూరు సమీపంలో పబ్ తరహా ఈవెంట్ పై చర్యలు తీసుకోవాలి
- మద్యం, మాదకద్రవ్యాల వినియోగం అత్యంత దారుణం
- ఇటువంటి ఘటనలు పునరావృత్తం కాకుండా నిఘా పెంచాలి
- పవిత్ర నగరంలో ఏరులై పారుతున్న మద్యం
- వేళలను పాటించకపోయినా పట్టించుకోని అధికార యంత్రాంగం
- చంద్రబాబు కళ్ళుమూసుకోవడం వల్లే ఈ అకృత్యాలు
- సనాతన ధర్మ ప్రతినిధి పవన్ కళ్యాణ్ దీనిపై స్పందించాలి
- భూమన కరుణాకర్ రెడ్డి డిమాండ్



తిరుపతి: గతంలో ఎన్నడూ లేని విధంగా తిరుపతి పవిత్రతను మంటగలిపేలా కూటమి ప్రభుత్వంలో అకృత్యాలు జరుగుతున్నాయని టిటిడి మాజీ చైర్మన్, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి భూమక కరుణాకర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తిరుచానూరు సమీపంలో పబ్ ను తలపించేలా నిర్వహించిన ఈవెంట్ లో మద్యం, మాదకద్రవ్యాల వినియోగం జరిగిందనే వార్తలు కలిచివేస్తున్నాయని అన్నారు. దేవదేవుడు కొలువైన తిరుపతిలో కూటమి ప్రభుత్వ అసమర్థ పాలన వల్లే ఇటువంటి దుష్టసంస్కృతికి బీజం పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతిలోని క్యాంప్ కార్యాలయంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి బుధవారం మీడియాతో మాట్లాడారు.

### అధికార పార్టీ అండతోనే పబ్ తరహా ఈవెంట్

గొప్ప ఆధ్యాత్మిక చరిత్ర ఉన్న తిరుమల తిరుపతిలో పబ్ తరహా ఈవెంట్ల నిర్వహణ వెనుక అధికారపార్టీ అండదండలు ఉండటం ఆందోళనకరం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ నగరంలో మద్యం విచ్చలవిడిగా ప్రవహిస్తోంది. మద్యం దుకాణాలను ఉదయం ఏడుగంటలకు తెరుస్తూ, రాత్రి పది గంటలు దాటిన తరువాత కూడా కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం నిర్ధేశించిన సమయాలను కూడా పాటించకుండా మద్యం దుకాణాలు, రెస్టారెంట్లను నిర్వహిస్తున్నా పోలీసులు, ఎక్సైజ్ అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు. చివరికి తిరుపతిలో మత్తు పదార్ధాలు, మాదక ద్రవ్యాలు, అమ్మాయిలతో నృత్యాలు, డీజే పేరుతో పాశ్చాత్యసంగీతాలతో తిరుపతి ఔచిత్యాన్నే ప్రశ్నించేలా ఘటనలు ప్రారంభమయ్యాయి అంటే దానికి కూటమి ప్రభుత్వమే బాధ్యత వహించాలి.

### ధర్మాన్ని కాపాడేందుకు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉద్యమం

వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో పాశ్చాత్య సంస్కృతిలో భాగంగా నూతన సంవత్సరం అర్ధరాత్రి జరిపే హంగామాను కూడా తిరుపతిలో జరగకుండా చర్యలు తీసుకున్నాం. చంద్రబాబు సీఎంగా అధికారం చేపట్టిన తరువాత ఆయన ఆదేశాలతోనే తిరుపతి పవిత్రతకు భంగం వాటిల్లే కార్యక్రమాలు జరుగుతుంటే, ఈ నగరాన్ని ఇక ఆ భగవంతుడే కాపాడాలి. సనాతన ధర్మంను కాపాడేందుకు అవతరించిన పీఠాధిపతి పవన్ కళ్యాణ్ ఈ ఘటనపై స్పందించాలి. డిప్యూటీ సీఎం హోదాలో తిరుపతిలో ధర్మానికి

వివరాలు 2లో..

## జగన్ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను నిర్వీర్యం చేసింది

- సాగునీటి సంఘాల ఎన్నికలపై వైసీపీ నేతల విమర్శలు
- వైసీపీ నేతల ఆరోపణలు అర్ధరహితమన్న ఆనం
- సాగునీటి సంఘాల ఎన్నికలు జరిపే ధైర్యం వైసీపీకి లేకపోయిందని విమర్శ



పెన్ పవర్ డెస్క్:సాగునీటి సంఘాల ఎన్నికలపై వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలపై ఏపీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలు అర్ధరహితమని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వానికి రైతులపై చిత్తశుద్ధి లేదని

వివరాలు 2లో..

## విజయ్ మాల్యా ఆస్తులు అమ్మి 14 వేల కోట్లు బ్యాంకులకు జమ

- లోక్ సభలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటన
- నీరవ్ మోదీ నుంచి వెయ్యి కోట్లు వసూలు చేశామన్న కేంద్ర మంత్రి
- మిగతా ఎగవేతదారుల నుంచి మరో 7 వేల కోట్లు రాబట్టామని వెల్లడి



బ్యాంకు రుణాలను ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయిన ఆర్థిక నేరస్థుల నుంచి ఈ ఏడాది రూ.22 వేల కోట్లు రాబట్టామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్ సభలో వెల్లడించారు. పరారీలో ఉన్న వ్యాపారవేత్త విజయ్ మాల్యాకు దేశంలో ఉన్న ఆస్తులను వేలం వేసి రూ.14 వేల కోట్లు బ్యాంకుల్లో జమ చేసినట్లు వివరించారు.

వివరాలు 2లో..

## జోగి రమేశ్ తో పరిచయం లేదు.. పేర్ని నానికి శిక్ష తప్పదు

- విగ్రహావిష్కరణ కార్యక్రమానికి జోగి రమేశ్ వస్తున్నట్టు తనకు సమాచారం లేదన్న కొనకళ్ల
- పార్టీకి ద్రోహం చేసే పని చేయనని వ్యాఖ్య
- పేదల బియ్యాన్ని దోచుకున్న వ్యక్తి పేర్ని నాని అని విమర్శ

వివరాలు 2లో..



ఏలూరు జిల్లా నూజివీడులో సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ కార్యక్రమానికి వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్ హాజరు కావడం టీడీపీ శ్రేణుల్లో కలకలం రేపింది. ఈ కార్యక్రమంలో మంత్రి పార్థసారథి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్యే గౌతు శిరీషలతో పాటు వేదికను పంచుకున్నారు. అంతేకాదు టీడీపీ నేతలతో కలిసి వాహనంపై

## ఆగ్నేయాసియాలోనే అతిపెద్ద కర్మాగారం ఏపీలో ఏర్పాటు చేయనున్న డైకిన్

- వెయ్యి కోట్లతో శ్రీసిటీలో కంప్రెసర్ యూనిట్ ఏర్పాటుకు నిర్ణయం
- తైవాన్ కు చెందిన రెచి కంపెనీ భాగస్వామ్యంతో ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటన
- మధ్యతరగతి ప్రజలకు చౌక ధరకే ఏసీలు అందిస్తామని వెల్లడి

ఆంధ్రప్రదేశ్ లో వెయ్యి కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు జపాన్ కు చెందిన ప్రముఖ కంపెనీ డైకిన్ ముందుకొచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరంలోనే ఈ ప్రతిపాదనను కార్యరూపంలోకి తీసుకొస్తామని ప్రకటించింది. తైవాన్ కు చెందిన

వివరాలు 2లో..




## లగచర్ల కేసులో పట్నం నరేందర్ రెడ్డికి బెయిల్

- మరో 24 మంది నిందితులకు కూడా బెయిల్
- సొంత పూచీకత్తు సమర్పించాలని ఆదేశించిన నాంపల్లి కోర్టు
- ఏ-2 నిందితుడు సురేశ్‌కు బెయిల్ నిరాకరణ



వికారాబాద్ జిల్లా లగచర్ల ఘటనలో అరెస్టైన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత పట్నం నరేందర్ రెడ్డికి బెయిల్ మంజూరైంది.

వివరాలు 2లో..

## 28న చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను ప్రారంభించనున్న వైష్ణవ్, కిషన్ రెడ్డి



రూ.430 కోట్ల వ్యయంతో నిర్మించిన చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను ఈ నెల 28న కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, మరో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కలిసి ప్రారంభించనున్నారు. ఈ స్టేషన్‌లో ఆరు ఎస్కలేటర్లు, ఏడు లిఫ్ట్‌లు, ఆరు బుకింగ్ కౌంటర్లు, మహిళలకు, పురుషులకు వేర్వేరు వెయిటింగ్ హాల్స్, హైక్లాస్ వెయిటింగ్ ఏరియా, గ్రౌండ్ ఫ్లోర్‌లో ఎగ్జిక్యూటివ్ లాంజ్ నిర్మించారు. ఈ టెర్మినల్ మొదటి అంతస్తులో కెఫ్-టేరియా, రెస్టారెంట్, రెస్ట్ రూం తదితర సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ప్రయాణికులకు ఉచిత వైఫై సదుపాయం

వివరాలు 2లో..

- టెర్మినల్‌లో ఆరు ఎస్కలేటర్లు, ఏడు లిఫ్ట్‌లు, ఆరు బుకింగ్ కౌంటర్లు
- మహిళలకు, పురుషులకు వేర్వేరు వెయిటింగ్ హాల్స్
- ప్రయాణికులకు ఉచిత వైఫై సదుపాయం

## ఎడిటర్ వ్యూ

# అసెంబ్లీ ఎన్నికల్లో ఏం జరుగుతోంది...

భారతీయ జనతా పార్టీ కేంద్రంలో వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది. కానీ దేశ రాజధాని ఢిల్లీలో మాత్రం మూడు దశాబ్దాలుగా అధికారం ఆ పార్టీకి అందని ద్రాక్షగా మిగిలిపోయింది. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ కలిసి పోటీ చేసినా సరే క్లీన్ స్వీప్ చేసిన కమలదళం అసెంబ్లీ ఎన్నికలు వచ్చేసరికి చతికిలపడుతోంది. చివరిసారిగా 1993లో గెలుపొందిన ఆ పార్టీ, మళ్లీ ఇప్పటి వరకు అధికారం చేజిక్కించుకోలేకపోయింది.మరో రెండు నెలల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఈసారి ఎలాగైనా గెలిచి తీరాలన్న పట్టుదలతో కమలదళం ఉంది. బీజేపీకి సైద్ధాంతిక మాతృసంస్థ 'రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కూడా రంగంలోకి దిగి బీజేపీ గెలుపు కోసం వ్యూహాలు అమలు చేస్తోంది. వరుసగా రెండు పర్యాయాలు గెలిచి అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ (ను ఈ సారి ఎలాగైనా నిలువరించాలి ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో పార్టీ ఓటుబ్యాంకును కాపాడుకోవడంతో పాటు సామాజిక సమీకరణాలు, భావోద్వేగ అంశాలను తెరపైకి తెస్తోంది.మరోవైపు బీజేపీ, దాని అనుబంధ సంఘాలు, సంఘ్ పరివార్ ఢిల్లీలోని ప్రతి ఇంటినీ చుట్టేసే ప్రయత్నాలు చేస్తున్నాయి. తాజాగా జరిగిన 4 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో హర్యానా, మహారాష్ట్రలో అనూహ్య విజయం సాధించిన కమలదళం ఇప్పుడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లోనూ గెలుపొంది దశాబ్దాలుగా అందకుండా పోతున్న అధికార పీఠాన్ని కైవసం చేసుకోవాలని చూస్తోంది. ఎన్నికల తేదీలు ఇంకా ప్రకటించక ముందే అభ్యర్థుల ఎంపికకు సంబంధించిన ప్రాథమిక కసరత్తు ఇప్పటికే పూర్తిచేసింది. త్వరలోనే మొత్తం 70 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించేందుకు ఏర్పాట్లు చేసుకుంటోంది.ఏ పార్టీకైనా తమ సొంత బలానికి తోడు అభ్యర్థుల బలం కూడా తోడైతేనే విజయం వరిస్తుంది. అందుకే అన్ని రాజకీయ పార్టీలు బలమైన అభ్యర్థుల కోసం గాలం వేస్తుంటాయి. ఈ క్రమంలోనే పార్టీ ఫిరాయింపులు జరుగుతున్నాయి. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల విషయంలో భారతీయ జనతా పార్టీ అభ్యర్థుల ఎంపికపై తీవ్ర కసరత్తు చేసింది. క్షేత్రస్థాయిలో బలమైన ముద్ర, ఓటర్లలో ఆదరణ కలిగిన నేతలకు టికెట్ ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలిసింది. అలాగే వరుసగా 2 పర్యాయాలు ఓడిపోయిన నేతలకు ఈసారి టికెట్ ఇవ్వడం లేదు. మరోవైపు మీనాక్షి లేఖి, పర్వేశ్ వర్మ, రమేశ్ బిధూరి వంటి నగరవ్యాప్త ప్రభావం కలిగిన సీనియర్ నేతలను ఆమ్ ఆద్మీ పార్టీ (౦౦ఖ)కి వ్యతిరేకంగా ఎన్నికల వాతావరణాన్ని తయారుచేయగలరని అధినాయకత్వం భావిస్తోంది. ఎన్నికల ప్రచారంలో వారికి కీలక బాధ్యతలు అప్పగించే అవకాశాలున్నాయి. వారితో పాటు ఆమ్ ఆద్మీ పార్టీని వీడి బీజేపీలో చేరిన రాష్ట్ర మాజీ మంత్రి కైలాష్ గెహ్లాట్‌కు జాట్ సామాజికవర్గంలో గట్టి పట్టుంది. ఆయనను నజఫ్‌గఢ్ నుంచి బరిలోకి దించే అవకాశాలున్నాయి. మాజీ ముఖ్యమంత్రి మదన్‌లాల్ ఖురానా కుమారుడు హరీష్ ఖురానాను మోతీనగర్ నుంచి పోటీ చేయించవచ్చు.మొత్తం 70 అసెంబ్లీ స్థానాల్లో యువ నాయకత్వాన్ని ప్రోత్సహించడంతో పాటు కొత్త ముఖాలను పరిచయం చేయడం కోసం సగం స్థానాలను కొత్తవారికి కేటాయించనున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అంటే కనీసం 35 స్థానాల్లో కొత్త అభ్యర్థులు బరిలోకి దిగే అవకాశాలున్నాయి. హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో "చావో రేవో" అన్నట్టుగా శ్రమించిన కమలదళం.. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలను అంతకంటే సీరియస్‌గా తీసుకుని పోరాడాలని చూస్తోంది.ఢిల్లీలో భారతీయ జనతా పార్టీకి అసెంబ్లీ ఎన్నికల్లో 30 శాతాన్ని మించిన ఓటుబ్యాంకు ప్రతిసారీ ఉంటోంది. నగరంలోని వ్యాపారవర్గాలు బీజేపీకి ఎల్లవేళలా మద్దతుగా నిలుస్తున్నారు. వారితో పాటు విద్యాధిక వర్గాలు, కొన్ని సామాజికవర్గాలు బీజేపీకి బలమైన ఓటుబ్యాంకుగా నిలిచాయి. అయితే ప్రత్యర్థి ఆమ్ ఆద్మీ పార్టీ ఏకంగా 50 శాతాన్ని మించి ఓటుబ్యాంకు కైవసం చేసుకుంటున్నప్పుడు ఈ బలం సరిపోదు. అందుకే ఈసారి ఓటుబ్యాంకును విస్తరించుకోవడంపై కమలనాథులు దృష్టి పెట్టారు. తమ ఓటుబ్యాంకు చేజారకుండా కాపాడుకోవడం ఒకెత్తయితే.. కొత్త ఓటుబ్యాంకును సృష్టించుకోవడం మరో ఎత్తు. కొత్త ఓటుబ్యాంకు తయారు చేసుకోవాలి అంటే ప్రత్యర్థి ఓటుబ్యాంకును చెదరగొట్టి తమవైపు ఆకట్టుకోవాలి.ఢిల్లీలోని మురికివాడల్లో నివసించే పేద, నిరుపేద ఓటర్లు ఆమ్ ఆద్మీ పార్టీ (కు బలమైన ఓటు బ్యాంకుగా ఉన్నారు. ఈ క్రమంలో ఢిల్లీలోని 1,194 బస్తీలు, మురికివాడల్లో రాత్రి పూట పార్టీ నేతలు గడిపేలా కార్యక్రమాలు రూపొందించారు. ఇప్పటికే పలువురు నేతలు బస్తీ నిద్రలు చేస్తున్నారు. తద్వారా బస్తీ ప్రజల సమస్యలు తెలుసుకుని, వారికి భరోసా కల్పించవచ్చని భావిస్తున్నారు. ఉచిత పథకాలకు ఆకర్షితులై ఆమ్ ఆద్మీ పార్టీకి ఓటేస్తున్నవారిలో ఇలాంటి బస్తీ ఓటర్లే ఎక్కువ సంఖ్యలో ఉన్నారని పార్టీ నాయకత్వం గ్రహించింది. అందుకే బస్తీ ఓటర్లను లక్ష్యంగా చేసుకుని వివిధ రకాల ప్రచార కార్యక్రమాలను రూపొందించుకుంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వారికి వివరించి చెప్పడంతో పాటు వారి అవసరాలకు తగ్గ హామీలను మేనిఫెస్టోలో చేర్చేందుకు ప్రయత్నిస్తోంది.ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కోసం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ హర్యానా, మహారాష్ట్రలో మాదిరిగా తెరవెనుక అనేక వ్యూహాలను అమలు చేస్తోంది. ఆరెస్సెస్ జాయింట్ జనరల్ సెక్రటరీ అరుణ్ కుమార్ ఢిల్లీలోనే మకాం పెట్టి అనేక సమావేశాలు నిర్వహించారు. బీజేపీ ? ఆరెస్సెస్ మధ్య మెరుగైన సమన్వయం కోసం ప్రయత్నిస్తున్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ స్థాయికి తగ్గ నేత ప్రస్తుతం ఢిల్లీ బీజేపీలో లేరని ఆరెస్సెస్‌కు కూడా తెలుసు. అయితే వరుసగా పదేళ్లు అధికారంలో ఉన్న ఆప్ సర్కారుపై ప్రజల్లో ఏర్పడ్డ వ్యతిరేకతను కేజ్రీవాల్‌పై అస్త్రంగా మలచుకోవాలని చూస్తోంది.ప్రజలకు పరిమిత యూనిట్ల వరకు ఉచిత కరెంట్, ఉచిత నల్లా నీరు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి ప్రజాకర్షక ఉచిత పథకాలతో ఓటర్లను ఆకట్టుకుంటూ రెండు పర్యాయాలు అధికారం సాధించిన ఆమ్ ఆద్మీ పార్టీ, రోడ్లు, మురుగునీటి నిర్వహణ, తాగునీటి సరఫరా విషయంలో విమర్శలు ఎదుర్కొంటోంది. ఢిల్లీ మద్యం పాలసీ అక్రమాల కేసు ద్వారా కేజ్రీవాల్‌పై ఇంతకాలం ఉన్న 'నీతి–నిజాయితీ' ముద్ర కూడా చెరిగిపోయింది.కాంగ్రెస్ పార్టీ సైతం పునర్ వైభవం కోసం శ్రమిస్తోంది. ఢిల్లీలో ఆప్ ఎదుగుదల కాంగ్రెస్ పార్టీనే తీవ్రంగా దెబ్బతీసింది. ఆ పార్టీ ఓటుబ్యాంకు పూర్తిగా చెల్లాచెదురైపోయింది. ఈ సారి కాంగ్రెస్ పార్టీ ఆప్‌తో కలిసి పోటీ చేయడం లేదు. తద్వారా మైనారిటీలు, మరికొన్ని వర్గాల ఓట్లను కాంగ్రెస్ చీల్చడం కూడా బీజేపీకి కలిసొచ్చే అవకాశం ఉంది. వీటన్నింటినీ సద్వినియోగం చేసుకుంటే అధికారం చేజిక్కించుకోవడం కష్టమేమమీ కాదని కమలదళం అంచనా వేస్తోంది.

# అసెంబ్లీల గడువును లోక్ సభతో ముడిపెట్టడం సరికాదు

- మొదటి పేజీ తరువాయి

అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి తూట్లు పొడిచి... బీజేపీ రాజ్యాంగాన్ని అమల్లోకి తీసుకురావాలనుకుంటున్నారని దుయ్యబట్టారు. పార్లమెంటులో పూర్తి మెజార్టీ లేకపోయినా రాజ్యాంగ వ్యతిరేకంగా బిల్లులను ప్రవేశపెట్టడం... బీజేపీ నిరంకుశ విధానానికి నిదర్శనమని షర్మిల అన్నారు. అసెంబ్లీల గడువును లోక్ సభతో ముడిపెట్టడం సమంజసం కాదని చెప్పారు.

సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్న జమిలి బిల్లును కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తోందని షర్మిల అన్నారు. రాజ్యాంగ సవరణకు కావాల్సిన మూడింట రెండొంతుల మెజార్టీ బీజేపీకి లేదనే విషయం లోక్ సభలో ఓటింగ్ తో తేలిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం కూలిపోతే... రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఎందుకు కూలిపోవాలని... ఇందులో ఏమైనా అర్థం ఉందా? అని ప్రశ్నించారు. లోక్ సభలో ఓటింగ్ వ్యవహారం బీజేపీకే బెడిసికొట్టిందని చెప్పారు. రాజ్యాంగానికి తూట్లు పొడిచే జమిలి బిల్లును కాంగ్రెస్ సమర్థించదని స్పష్టం చేశారు.

# జోగి రమేశ్ తో పరిచయం లేదు.. పేర్ని నానికి శిక్ష తప్పదు

- మొదటి పేజీ తరువాయి

ఊరేగారు. దీంతో, ఈ ముగ్గురు టీడీపీ నేతలపై పార్టీ కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు ఇంటిపై దాడి చేసిన వ్యక్తితో కలిసి వేదికను పంచుకోవడం ఏమిటని ఏకిపారేస్తున్నారు. వీరిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని హైకమాండ్ ను డిమాండ్ చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో కొనకళ్ల నారాయణ స్పందిస్తూ... జోగి రమేశ్ తో కలిసి కార్యక్రమంలో పాల్గొనడంపై చంద్రబాబును కలిసి వివరిస్తానని చెప్పారు. పార్టీ శ్రేణులు అపార్థం చేసుకోవద్దని కోరారు. పార్టీకి ద్రోహం చేసే పని తాను ఎప్పుడూ చేయనని... ఇది ఉద్దేశపూర్వకంగా జరగలేదని, అనుకోకుండా జరిగిందని చెప్పారు. విగ్రహావిష్కరణ కార్యక్రమానికి కమిటీ ఆహ్వానం మేరకే తాను వెళ్లానని... జోగి రమేశ్ తో తనకు ఎలాంటి పరిచయాలు లేవని తెలిపారు. జోగి రమేశ్ వస్తున్నట్టు తనకు సమాచారం లేదని చెప్పారు.

విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని వివాదం చేయకూడదనే ఉద్దేశంతోనే జోగి రమేశ్ వచ్చినప్పటికీ కార్యక్రమంలో పాల్గొనాల్సి వచ్చిందని తెలిపారు. రేషన్ బియ్యం మాయం అయిన కేసులో మాజీ మంత్రి పేర్ని నాని శిక్ష అనుభవించక తప్పదని నారాయణ చెప్పారు. పేదలకు అందాల్సిన బియ్యాన్ని దోచుకుతున్న వ్యక్తి పేర్ని నాని అని విమర్శించారు. పక్కదారి పట్టిన బియ్యానికి డబ్బులు కట్టినంత మాత్రాన కేసు నుంచి బయటపడలేరని చెప్పారు.

# విజయ్ మాల్యా ఆస్తులు అమ్మి 14 వేల కోట్లు బ్యాంకులకు జమ

- మొదటి పేజీ తరువాయి

అదేవిధంగా గుజరాత్ కు చెందిన వజ్రాల వ్యాపారి, బ్యాంకు రుణాల ఎగవేతదారు నీరవ్ మోదీ ఆస్తులు అమ్మి వెయ్యి కోట్లు వసూలు చేశామన్నారు.మిగతా ఎగవేతదారుల నుంచి ఏడు వేల కోట్లు వసూలు చేసి మొత్తంగా రూ.22,280 కోట్లు వివిధ బ్యాంకులకు జమ చేశామని చెప్పారు. ఇందుకోసం ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), బ్యాంకులు సంయుక్తంగా ముంబైలోని స్పెషల్ కోర్టును ఆశ్రయించాయని తెలిపారు. ఎగవేతదారులకు సంబంధించి ఈడీ అటాచ్ చేసిన ఆస్తులను స్పెషల్ కోర్టు ఆదేశాలతో బ్యాంకులు, ఈడీ అధికారులు విక్రయించారని వివరించారు.

మరో వజ్రాల వ్యాపారి మెహుల్ చోక్సీకి చెందిన రూ.2,566 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ అటాచ్ చేసిందని, ఈ ఆస్తులను కూడా వేలం వేసేందుకు స్పెషల్ కోర్టు అనుమతిచ్చిందని నిర్మలా సీతారామన్ చెప్పారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు నుంచి తీసుకున్న సుమారు 13 వేల కోట్లకు పైగా రుణాలను చోక్సీ చెల్లించలేదని తెలిపారు. దీంతో ఈడీ జప్తు చేసిన ఆస్తులను వేలం వేసి పంజాబ్ నేషనల్ బ్యాంకుతో పాటు ఇతర రుణదాతలకు చెల్లించాలని ముంబై స్పెషల్ కోర్టు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. పీఎంఎల్ఏ చట్టం ఆధారంగా రుణాల ఎగవేతదారుల నుంచి సొమ్ము రాబడుతున్నట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

# పరిపాలనా సౌలభ్యం కోసమే మూడు భాషల ఫార్ములా

- మొదటి పేజీ తరువాయి

జ్ఞాన సంపదకు నిలయాలన్నారు.

ఇవాళ ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ..' ప్రపంచవ్యాప్తంగా ఇంత వైవిధ్యత ఉన్న దేశం మరొకటి లేదు. 121 భాషలు, మన దేశంలో ఉన్నాయి. మన రాజ్యాంగంలో 14 అధికార భాషలుండేవి. ఇప్పుడు మోదీ ప్రభుత్వం వచ్చాకా 21 భాషలకు పెంచారు. పాలనాపరమైన సౌలభ్యం కోసం మూడు భాషల ఫార్ములాను రూపొందించారు.

ఈ ఫార్ములా వినియోగంలో ప్రజలు ఇష్టంగా లేని కారణంగా మార్పులు తీసుకురావాలనే డిమాండ్ పెరిగింది. ఇందులో భాగంగానే ప్రధాని మోదీ 2020లో ఎన్ఈపీ202 నూతన జాతీయ విద్యావిధానం ద్వారా కనీసం రెండు ప్రాంతీయ భాషలను విద్యార్థులు నేర్చుకునేలా ప్రోత్సాహాన్ని అందించారు. మొదట్లో దీన్ని విమర్శించిన వారు కూడా ఇప్పుడు సమర్థిస్తున్నారు. ప్రతి భారతీయుడు తన మాతృభాషలో మాట్లాడాలి, మాతృభాషను ప్రోత్సహిస్తూ... ఇతర భాషలను గౌరవించాలని ' కిషన్‌రెడ్డి అన్నారు.

# లగచర్ల కేసులో పట్నం నరేందర్ రెడ్డికి బెయిల్

- మొదటి పేజీ తరువాయి

లగచర్ల కేసులో నరేందర్ రెడ్డి ఏ1 నిందితుడిగా ఉన్నారు. పట్నం నరేందర్ రెడ్డికి నాంపల్లి కోర్టు ఈ రోజు బెయిల్ మంజూరు చేసింది. అతనితో పాటు ఇదే కేసులో నిందితులుగా ఉన్న 24 మందికి కూడా కోర్టు బెయిల్ ఇచ్చింది. పట్నం నరేందర్ రెడ్డి రూ.50 వేల పూచీకత్తును సమర్పించాలని కోర్టు ఆదేశించింది. మిగతా రైతులు రూ.20 వేల వ్యక్తిగత పూచీకత్తును సమర్పించాలని తెలిపింది. ఈ కేసులో ఏ–2 నిందితుడిగా ఉన్న సురేశ్‌కు మాత్రం నాంపల్లి కోర్టు బెయిల్‌ను నిరాకరించింది.

# జల్ జీవన్ మిషన్ లో గత వైసీపీ ప్రభుత్వం రూ. 4 వేల కోట్లు దుర్వినియోగం చేసింది

- మొదటి పేజీ తరువాయి

ఈ వర్క్ షాప్ లో పవన్ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. జల్ జీవన్ మిషన్ ను మరింత బలోపేతం చేస్తామని పవన్ తెలిపారు. నీటి సమస్యతో అనేక మంది ఇబ్బంది పడుతున్నారని... ఈ సమస్య పరిష్కారాన్ని తొలి ప్రాధాన్యతగా తీసుకోవాలని చెప్పారు. జనవరి నెలాఖరుకు డీపీఆర్ తీసుకుని జల్ శక్తి మంత్రికి ప్రతిపాదన పంపిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరికీ నిరంతరం పరిశుభ్రమైన నీటిని అందించాలనే ఆకాంక్షతో జల్ జీవన్ మిషన్ ప్రారంభమయిందని చెప్పారు. ప్రతి మనిషికి రోజుకు సగటున 55 లీటర్ల పరిశుభ్రమైన నీరు ఇవ్వాలనేది ప్రధాని మోదీ కల అని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ. 70 వేల కోట్లు మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరినట్టు చెప్పారు.

# ఆధ్యాత్మిక నగరిలో అకృత్యాలకు పాల్పడుతున్నారు

- మొదటి పేజీ తరువాయి

జరుగుతున్న విఘాతంపై ఆయన తన దండంను బయటకు తీసి, కారకులపై చర్యలు తీసుకుంటాని ఆశిస్తున్నాం. తిరుపతి పవిత్రత కోసం ప్రజలతో కలిసి వైయస్ఆర్ సిపి ఉద్యమాన్ని చేపట్టేందుకు సిద్ధంగా ఉంది.

# 28న చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను ప్రారంభించనున్న వైష్ణవ్, కిషన్ రెడ్డి

- మొదటి పేజీ తరువాయి

ఉంటుంది. చర్లపల్లి టెర్మినల్ ప్రారంభమయ్యాక భాగ్యనగరానికి చెందిన పలు రైళ్లు ఇక్కడి నుంచే ప్రారంభం కానున్నాయి. దీంతో సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ వంటి రైల్వే స్టేషన్లపై ఒత్తిడి తగ్గుతుంది.

# జగన్ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను నిర్వీర్యం చేసింది

- మొదటి పేజీ తరువాయి

దుయ్యబట్టారు. సాగునీటి ప్రాజెక్టులను జగన్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు.

గత ప్రభుత్వానికి సాగునీటి సంఘాల ఎన్నికలు జరిపే ధైర్యం లేకపోయిందని చెప్పారు. సోమశిల ప్రాజెక్టు దెబ్బతినడానికి వైసీపీ ప్రభుత్వమే కారణమని అన్నారు. అన్నమయ్య ప్రాజెక్టు గేట్ల నిర్వహణకు ఒక్క పైసా కూడా ఇవ్వలేదని విమర్శించారు. సరైన నిర్వహణ లేకే ప్రాజెక్టు తెగిపోయిందని దుయ్యబట్టారు.

# ఆగ్నేయాసియాలోనే అతిపెద్ద కర్మాగారం ఏపీలో ఏర్పాటు చేయనున్న డైకిన్

- మొదటి పేజీ తరువాయి

రెచి ప్రెసిషన్ కంపెనీ భాగస్వామ్యంతో శ్రీసిటీలో కంప్రెసర్ల తయారీ యూనిట్ ను నెలకొల్పనున్నట్లు వెల్లడించింది. దాదాపు 75 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న ఈ యూనిట్ ఆగ్నేయాసియాలోనే అతిపెద్ద యూనిట్ గా అవతరిస్తుందని పేర్కొంది. ఇన్వర్టర్, నాన్ ఇన్వర్టర్ ఏసీలలో వినియోగించే రోటరీ కంప్రెసర్లను ఇక్కడ తయారుచేసి విదేశాలకు ఎగుమతి చేయనున్నట్లు తెలిపింది.

రెచి ప్రెసిషన్ భాగస్వామ్యంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టులో మెజారిటీ వాటాదారుగా డైకిన్ ఉంటుంది. శ్రీసిటీలో ఏర్పాటు చేయబోయే యూనిట్ తో కలిపి భారత్ లో మొత్తం మూడు యూనిట్లు నెలకొల్పినట్లు అవుతుందని డైకిన్ కంపెనీ వివరించింది. ప్రస్తుతం ఉన్న రెండు యూనిట్లతో కలిపి ఏటా 2 మిలియన్ కంప్రెసర్లను తయారుచేస్తున్నామని, 2030 నాటికి ఉత్పత్తి సామర్థ్యాన్ని 5 మిలియన్లకు చేర్చాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు తెలిపింది. ఈ ఒప్పందంతో దేశీయంగా మధ్యతరగతి ప్రజలకు చౌక ధరకే ఏసీలను అందించడం సాధ్యమవుతుందని, భారత మార్కెట్లో ఏసీ విక్రయాల్లో టాపర్ గా నిలవాలన్నదే తమ లక్ష్యమని డైకిన్ కంపెనీ ఓ ప్రకటనలో పేర్కొంది.

# రాత్రి నిద్రకు ముందు ఈ లక్షణాలుంటే... అధిక కొలెస్ట్రాల్ కావొచ్చు!

మారిన ఆహార అలవాట్లు, అధిక కొవ్వులు ఉండే ఫ్యాటీ ఫుడ్, జంక్ ఫుడ్ తింటుండటంతో చాలా మందిలో అధిక కొలెస్ట్రాల్ సమస్య తలెత్తుతోంది. ఇది ఊబకాయానికి, గుండె జబ్బులకు దారి తీస్తోంది. అయితే చాలా మంది తమలో కొలెస్ట్రాల్ స్థాయులు ఎక్కువగా ఉంటున్నట్టు గుర్తించలేరు. ఏదైనా తీవ్రమైన ఆరోగ్య సమస్య తలెత్తి, పరిస్థితి ఇబ్బందికరంగా మారిన తర్వాత గుర్తించడంతో ఫలితం లేకుండా పోతోంది. అయితే రాత్రి 10 గంటల తర్వాత కనిపించే కొన్ని లక్షణాల ద్వారా కొలెస్ట్రాల్ సమస్యను గుర్తించవచ్చని నిపుణులు చెబుతున్నారు.

**ఛాతీలో నొప్పి...**

రక్తంలో అధిక కొలెస్ట్రాల్ ఉన్నవారిలో రాత్రి పడుకున్నాక ఛాతీలో నొప్పిగా అనిపిస్తుంటుందని నిపుణులు చెబుతున్నారు. గుండెకు రక్తాన్ని సరఫరా చేసే నాళాల్లో కొలెస్ట్రాల్ అడ్డుపడటం వల్ల రక్త సరఫరా తగ్గిపోయి ఇబ్బంది ఏర్పడుతుందని వివరిస్తున్నారు. ఛాతీలో పట్టేసినట్టు ఉండటం, నొప్పిగా అనిపించడం, ఏదో బరువు పెట్టినట్టుగా ఉండటం దీని లక్షణాలు అని చెబుతున్నారు. ఒక్కోసారి ఇది గుండెపోటుకు దారితీయవచ్చని... అందువల్ల ఇబ్బంది ఎక్కువగా ఉంటే వెంటనే ఆస్పత్రికి వెళ్లాలని సూచిస్తున్నారు.

**శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది అనిపించడం...**

గుండె రక్తనాళాల్లో కొలెస్ట్రాల్ అడ్డంకుల వల్ల గుండె శరీరానికి రక్తాన్ని సరిగా సరఫరా చేయలేకపోతుంది. దీనివల్ల శరీర కణాలకు సరిగా ఆక్సిజన్ అందదు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిగా అనిపిస్తుంది. ముఖ్యంగా పడుకుని ఉన్నప్పుడు తరచూ శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది అనిపించడం, లేచి కూర్చుని శ్వాస పీల్చుకోవడం వంటివి జరుగుతుంటే... వీలైనంత త్వరగా వైద్యులను సంప్రదించాలని నిపుణులు సూచిస్తున్నారు.

**రాత్రిపూట అలసట, తీవ్ర నీరసం...**

ఇది కూడా 'కొలెస్ట్రాల్'అడ్డంకులతో గుండె రక్తాన్ని సరఫరా చేయడానికి ఎక్కువ పనిచేయాల్సి రావడం వల్ల వచ్చే సమస్య. శరీర కణాలకు ఆక్సిజన్, పోషకాలు సరిగా అందక... శరీరం నీరసించిపోతుంది. ముఖ్యంగా రాత్రి నిద్రపోయిన సమయంలో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంది. రోజంతా పెద్దగా కష్టపడకపోయినా కూడా రాత్రి నీరసంగా ఉంటుంటే... కచ్చితంగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

**తల తిప్పుతున్నట్టుగా, నొప్పిగా ఉండటం...**

మెదడుకు రక్తాన్ని సరఫరా చేసే సూక్ష్మ నాళికలలో కొలెస్ట్రాల్ అడ్డుపడటం వల్ల ఈ సమస్య వస్తుంది. మెదడుకు రక్తం సరిగా సరఫరా కాకపోవడంతో.. తలతిప్పుతున్నట్టుగా, నొప్పిగా ఉంటుంది. ఒకవేళ దీనితోపాటు ఛాతీలో నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది అనిపించడం వంటి లక్షణాలు కూడా ఉంటే... వెంటనే వైద్యులను సంప్రదించాలని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# జీ.వీ.ఎం.సీ.లో పట్టణ ప్రణాళిక



● విభాగం పై ప్రతి శుక్రవారం ఫిర్యాదులు స్వీకరణ.
● జీ.వీ.ఎం.సీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్

**విశాఖ దక్షిణం,పెన్ పవర్, డిసెంబర్ 18** : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధిలో ప్రతి శుక్రవారం పట్టణ ప్రణాళిక విభాగం కు సంబంధించి ప్రజల నుండి ఫిర్యాదులను, వినతులను స్వీకరించడం జరుగుతుందని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ బుధవారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిస్టాత్మాకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జివిఎంసి లో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్పటికీ పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి అధికంగా ప్రజల నుండి ఫిర్యాదులు/వినతులు వస్తున్నాయని కమీషనరు తెలిపారు. కావున పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి ఫిర్యా దులను, వినతులను ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుండి పట్టణ ప్రణాళిక అధికారులు ప్రత్యేకంగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో స్వీకరిస్తారని కమీషనరు తెలిపారు. కావున ప్రజలు ఈ అవకాశాన్ని సద్వి నియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# మారుమూల గ్రామాలలో కలెక్టర్ పర్యటన.





● ఉప ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా ముందస్తు చర్యలు.

**అనంతగిరి, పెన్ పవర్,డిసెంబర్ 18** : ఉప ముఖ్యమంత్రి కొణిదెల, పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు అనంతగిరి మండలం పినకోట పంచాయితీ శివారు గ్రామాలలో అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ పినకోట పంచాయతీ గుమ్మంతి, రాచకీలం గ్రామాలను బుధవారం ఆయన పర్యటించారు. ఇటీవల ఓ కార్యక్రమంలో ఆవేదన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డోలిమోతలు నివారణకు ప్రతి గిరిజన గ్రామానికి కనెక్టివిటీ ఉండేలా రహదారి సౌకర్యం ఏర్పాటు చేయడం ప్రతి గ్రామానికి తాగునీటి సౌకర్యాన్ని కల్పించడమే లక్ష్యంగా ఈ పర్యటన సాగనుందని ఈనెల20, 21 వ తారీఖున అరుకు అనంతగిరి పాడేరు గిరిజన ప్రాంతాలలో పర్యటన భాగంగా సమస్యలపై ఉప ముఖ్యమంత్రి ప్రత్యేకంగా సమీక్ష నిర్వహిస్తారని తెలుస్తుంది. అందులో భాగంగా గుమ్మంతి గ్రామం నుంచి రాచకీలం గ్రామం వరకు మూడు కిలోమీటర్లు బీటి రోడ్డు శంకుస్థాపన చేస్తారని పంచాయతీ సర్పంచ్ గణేష్ తెలిపారు. పర్యటనలో గ్రామస్తులతో స్వయంగా కలెక్టర్ సమస్యలపై అరా తీశారు. గ్రామస్తులు కలెక్టర్ కి చింతపాక వై జంక్షన్, పెదబూరిగా, చిందులపాడు, కట్టబోడి, కుట్టెం గూడ గ్రామాలకు బీటి రోడ్డు సౌకర్యం కల్పించాలని అలాగే రేగులపాలెం, తముటు గ్రామాలకు కూడా రహదారి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు మండల స్థాయి అధికారులు మాజీ ఎంపీటీసీ రామన్న దొర, వార్డు సభ్యులు రవితేజ, జమ్ములు రమేష్ కొండబాబు మచిరాజు గ్రామస్తులు పాల్గొన్నారు.

# బాగుజోలలో ఉపాధి హామీ పనులు పరిశీలించిన కలెక్టర్







**కురుపాం /బాగుజోల (మక్కువ), పెన్ పవర్, డిసెంబరు 18** : మక్కువ మండలం బాగుజోలలో బుధవారం ఉపాధి హామీ పనులను జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ పరిశీలించారు. గిరిజన గ్రామాల్లో రహదారుల నిర్మాణం, ఉపాధి హామీ పనులు చేపట్టుటకు అవకాశాలను ఆయన పరిశీలించారు. రహదారులు అనుసంధానం లేని గ్రామాలు జాబితా తయారు చేసి సమర్పించాలని సంబంధిత ఇంజినీర్లను ఆదేశించారు. ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలని, అవసరమగు పనులు గుర్తించి పనులు సిద్ధంగా ఉంచాలని ఆయన ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని గిరిజన గ్రామాలకు రహదారులతో అనుసంధానం చేసి డోలీ మోతలు లేకుండా చేయాలని లక్ష్యంగా ఉందని ఆయన చెప్పారు.

ఈ కార్యక్రమంలో పోలీస్ సూపరింటెండెంట్ ఎస్ వి మాధవ రెడ్డి, జిల్లా రెవిన్యూ అధికారి కె హేమలత, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వై సత్యం నాయుడు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రామ చంద్ర రావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి వి.ఎస్.నగేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.





# బిడ్డ ఆచూకీ కొరకు తల్లిదండ్రుల ఆవేదన

● బిడ్డ ఆచూకీ కనిపెట్టాలని కన్నీటితో వేడుకుంటున్న తల్లిదండ్రులు

**స్టాఫ్ రిపోర్టర్ పాడేరు, గూడెం కొత్త వీధి,పెన్ పవర్,డిసెంబర్ 18:**తమ కుమారుని ఆచూకీ లభిస్తే తమకు తెలియచేయాలని పాత పాడేరు గ్రామంలో నివాసముంటున్న వంతల సత్యనారాయణ, వంతల రేణుక దంపతులు కన్నీటితో వేడుకుంటున్నారు. వారి కుమారుడు వంతల మనోజ్ తేజ్(14) కొయ్యూరు ఏపీఆర్ స్కూల్ లో పదవ తరగతి చదువుతున్నాడు. ఆ విద్యార్థి శుక్రవారం నుండి స్కూల్లో కనిపించకపోవడంతో వారి తల్లిదండ్రులకు స్కూల్ యాజమాన్యం విద్యార్థి అదృశ్యంపై తల్లితండ్రులకు తెలియజేశారు. స్కూల్ యాజమాన్యం ఒకవైపు, విద్యార్థి యొక్క తల్లితండ్రులు ఒకవైపు విద్యార్థి ఆచూకీ కొరకు గాలిస్తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థి యొక్క తల్లితండ్రులు మీడియాతో మాట్లాడారు. తమ కుమారుడిని అల్లారుముద్దుగా పెంచుకుంటున్నామని,బిడ్డ లేకపోతే మేము బ్రతకలేమని, మా బిడ్డ ఎక్కడ ఉన్నా దయచేసి సమాచారం అందించాలని కన్నీటి పర్యాంతరమవుతూ వేడుకుంటున్నారు. బిడ్డ లేకపోతే మేము లేమని దుఃఖ సాగరం తో విజ్ఞప్తి చేస్తున్నారు. పోలీసు వారు, పాఠశాల యాజమాన్యం బిడ్డ ఆచూకీ కొరకు ప్రయత్నం చేస్తున్నారని, ఇప్పటికి బిడ్డ ఆచూకీ లభించకపోవడంతో భయభ్రాంతులకు గురవుతున్నామని అన్నారు. ఇప్పటికీ ఏడు రోజులు అయిందని అయినా మా బిడ్డ దొరకలేదని, అల్లూరి జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ మా యందు దయ తలిచి మా బిడ్డ ఆచూకీ కొరకు ప్రత్యేక దృష్టి పెట్టాలని దుఃఖిస్తూ వేడుకున్నారు. బిడ్డ ఆచూకీ లభిస్తే 9440904241,9494376644 ఫోన్ నెంబర్లకు ఫోన్ చేయాలని వేడుకుంటున్నారు.

# స్థానికంగానే అర్జీలు పరిష్కరించాలి

ప్రతి సోమవారం మండల స్థాయిలో పి.జి.ఆర్.ఎస్

**కురుపాం / పార్వతీపురం, పెన్ పవర్, డిసెంబరు 18 :** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో (పి.జి.ఆర్.ఎస్) అందిన అర్జీలు స్థానికంగానే పరిష్కారం కావాలని జిల్లా కలెక్టర్ ఏ . శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలు, గృహ నిర్మాణాలు, ధాన్యం కొనుగోలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం మండల స్థాయిలో పి.జి.ఆర్.ఎస్ విధిగా నిర్వహించాలన్నారు. మండల స్థాయిలో పక్కాగా నిర్వహించాలని, సమస్యలు అచ్చటనే పరిష్కారం కావాలని ఆయన ఆదేశించారు. ప్రజల నుండి వస్తున్న అర్జీలను అశ్రద్ధ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రజా పంపిణీ క్రింద వస్తున్న సరుకులు కూడా సక్రమంగా పంపిణీ చేయని డీలర్లపై చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. అక్రమాలకు పాల్పడిన డీలర్లను తొలగించాలని ఆయన ఆదేశించారు. మండల స్థాయిలో జరిగే సదరం శిబిరాల వివరాలు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని, సంచులు కొరత లేకుండా చూడాలని ఆయన చెప్పారు.

గృహ నిర్మాణంలో పనితీరు ఆధారంగా అధికారులకు గ్రేడ్ లు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జియ్యమ్మవలన మండలంలో పిఎం జన్ మాన్ ప్రగతిలో వేగం లేకపోవడం పట్ల జిల్లా కలెక్టర్ ప్రశ్నించారు. గృహ లే అవుట్ లు వద్ద అవసరం మేరకు బ్రిక్ యూనిట్లు మంజూరు చేయాలని ఆయన సూచించారు. క్షేత్ర స్థాయిలో సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించాలని ఆయన స్పష్టం చేశారు. ప్రతి నెల కనీసం ఐదు వందల ఇల్లు పూర్తి కావాలని ఆయన అన్నారు. పిఎం జన్ మాన్ ఇళ్లు త్వరగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. భామిని అర్హత కలిగి ఉంది గతంలో ఇల్లు మంజూరు కానివారు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పిఎంఏవై) 2.0 క్రింద దరఖాస్తు చేయవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు. గ్రామ సచివాలయంలో అన్ని ధ్రువీకరణ పత్రాలతో డిసెంబరు నెలాఖరు నాటికి దరఖాస్తులు సమర్పించాలని ఆయన చెప్పారు. రెవిన్యూ సదస్సులలో కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా జారీ చేయవచ్చని, ఈ అవకాశాన్ని తహసీల్దార్లు వినియోగించుకుని అవసరమైన వారికి జారీకి శ్రద్ధ వహించాలని ఆయన ఆదేశించారు.






ఓటర్లను నమోదు చేయాలి

అర్హులైన యువతను, ఓటర్లను నమోదు చేయాలని ఆయన ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోబిక ధాన్యం కొనుగోలు వివరాలు తెలిపారు.

ఈ సమావేశంలో డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వై సత్యం నాయుడు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రామ చంద్ర రావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి వి.ఎస్.నగేష్ బాబు, జిల్లా పశు సంవర్ధక అధికారి ఎస్ మన్మథ రావు, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తమర్భ కొండలరావు, జిల్లా విద్యా శాఖ అధికారి ఎన్ తిరుపతి నాయుడు, జిల్లా వ్యవసాయ అధికారి కె. రాబర్ట్ పాల్, జిల్లా సర్వే సెటిల్మెంట్ అధికారి పి లక్ష్మణ రావు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీనివాస రావు, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి ఎం.డి.గయాజుద్దీన్, జిల్లా బిసి సంక్షేమ సాధికారిత అధికారి ఎస్.కృష్ణ, ఆర్ అండ్ బి ఇంజనీరింగ్ అధికారి సుబ్బారావు, గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ అధికారి ఏ మణి రాజ్, డిప్యూటీ డి.ఎం.హెచ్. ఓ డా టి జగన్మోహన రావు, తదితరులు పాల్గొన్నారు.

# పిఎంఏవై 2.0 క్రింద ఇళ్ళ మంజూరుకు దరఖాస్తులు చేయవచ్చు

**కురుపాం / పార్వతీపురం, పెన్ పవర్, డిశంబర్ 18 :** ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పిఎంఏవై) పథకం క్రింద అర్హతగలవారు దరఖాస్తులు సమర్పించవచ్చని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. గృహ నిర్మాణాలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్హత కలిగి గతంలో ఇళ్ళు మంజూరు కానివారికి ఇళ్ళు మంజూరు చేయడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. అర్హతగల వారు గ్రామ సచివాలయం వద్ద ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేయాలని ఆయన సూచించారు. ఈ పథకంలో నమోదు చేసుకోవడానికి
భార్య, భర్తల సంతకము చేసిన ఆధార్ కార్డులు నకలు, రేషన్ కార్డ్ జిరాక్స్ కాపీలు,
బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్ మొదటి పేజి జిరాక్స్ కాపీ,
స్థలము అనుబంధ పత్రం లేదా స్థలము రిజిస్టర్ డాక్యుమెంట్, ఈ.సి, ఆదాయ ధ్రువపత్రం, కుల దృవీకరణ పత్రం, ప్రస్తుత ఇంటి స్థలం కెమెరా ఫోటో, తదితర డాక్యుమెంట్స్ అన్నిటిని జత చేయాలని వివరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోబిక, గృహ నిర్మాణ సంస్థ ఇన్ ఛార్జ్ కార్యనిర్వాహక ఇంజనీర్ వంశీ, డిఇ సోమేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.




# జిల్లాలో కాఫీ క్లస్టర్ ఏర్పాటుకు చర్యలు



**కురుపాం / పార్వతీపురం, పెన్ పవర్, డిసెంబరు 18 :** జిల్లాలో కాఫీ క్లస్టర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. పాచిపెంట మండలం శతాబి వద్ద కాఫీ క్లస్టర్ ఏర్పాటుకు అవకాశాలు ఉన్నాయని ఆయన చెప్పారు. ప్రాథమిక రంగాల శాఖల ప్రగతిపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పొలం గట్లపై ఆదాయం సమకూరే అంతర పంటలు వేయాలని, వాటిపై రైతులకు అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు. కూరగాయల విత్తనాలను రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉంచాలని, స్వయం సహాయక సంఘాల సభ్యులు ద్వారా చేపట్టాలని ఆయన ఆదేశించారు. జనవరి నుండి రైతు అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆయన అన్నారు. డ్రోన్ వినియోగంలో ముందంజలో ఉండాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. మహిళలు డ్రోన్ పైలట్ లుగా రావాలని, ప్రతి మండలంలో డ్రోన్ దిది లను గుర్తించాలని ఆయన పేర్కొన్నారు. ఉద్యానవన పంటలులో 15 శాతం వృద్ధి ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఆయిల్ పామ్ వంటి క్లస్టర్ లను ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. నిమ్మగడ్డి పెంపకం వలన రైతులకు ఆదాయం వస్తుందని ఆయన వివరించారు. రైతులకు ఆయా క్షేత్రాలను చూపించాలని, ప్రతి నెల నిమ్మగడ్డి పెంపకందారుల సంఖ్య పెంచాలని ఆయన అన్నారు. పశు కిసాన్ క్రెడిట్ కార్డులకు (పి.కె.సి.సి) రుణాలు మంజూరు చేయాలని ఆయన ఆదేశించారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో కేజ్ కల్చర్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. మత్స్య ఉత్పాదక సంస్థ (ఎఫ్ పి ఓ) ద్వారా మత్స్య ఆహార యూనిట్లు ఏర్పాటుకు యోచించాలని ఆయన అన్నారు. నగర వనం, నగర వాటిక అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా అటవీ అధికారిని ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లా అటవీ అధికారి జి.ఏ.పి. ప్రసూన, జిల్లా వ్యవసాయ అధికారి కె. రాబర్ట్ పాల్, జిల్లా పశుసంవర్ధక అధికారి ఎస్ మన్మథ రావు, పి హెచ్ ఓ మణి భూషణ్, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వై సత్యం నాయుడు, జిల్లా సహకార అధికారి పి శ్రీరామ మూర్తి, జిల్లా మత్స్య శాఖ అధికారి వి. తిరుపతయ్య, జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి వి రాధాక్రిష్ణ, లీడ్ బ్యాంక్ మేనేజర్ జె ఎల్ ఎన్ మూర్తి, జిల్లా ప్రణాళిక అధికారి పి. వీర రాజు, ప్రకృతి వ్యవసాయం డిపిఎం షణ్ముఖ రాజు తదితరులు పాల్గొన్నారు.

## పాలకొండ మినీ జాబ్ మేళాకు 18 మంది ఎంపిక

- జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె. సాయి కృష్ణ చైతన్య




**కురుపాం / పార్వతీపురం, పెన్ పవర్, డిసెంబర్ 18 :** పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మినీ జాబ్ మేళాకు 18 మంది ఎంపికైనట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె. సాయికృష్ణ చైతన్య తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన జారీచేశారు.
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా పాలకొండ అసెంబ్లీ నియోజకవర్గం సంబంధించి పాలకొండలోని స్థానిక గవర్న మెంట్ డిగ్రీ కాలేజీ ఆవరణలో జాబ్ మేళా నిర్వహించటం జరిగిందన్నారు. ఈ మినీ జాబ్ మేళకి మెడి ప్లస్ ఫార్మీ, ఎయిర్ టెల్ పేమెంట్ బ్యాంక్, భారత్ పే కంపెనీ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ రోజు జరిగిన ఈ జాబు డ్రైవ్ కు 56 మంది ఇంటర్వ్యూలకు హాజరుకాగా అందులో 18 మంది ఎంపిక కావడం జరిగింది అనీ జిల్లా నైపుణ్యాబృద్ధి అధికారి కె. సాయి కృష్ణ చైతన్య గారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్లేస్మెంట్ అధికారి ఎన్. మనోజ్ కుమార్ హాజరయ్యారు.

## కొండిబ పంచాయితీలో "మీ భూమి- మీ హక్కు"

- భూమి "పత్రాలు" మార్చేందుకు మ్యుటేషన్ తప్పనిసరి!
- 43 అర్జీలు స్వీకరణ.




**అనంతగిరి, పెన్ పవర్,డిసెంబర్ 18 :** మండలంలోని కొండిబ పంచాయితీలో బుధవారం పలుచోట్ల రెవిన్యూ సదస్సు నిర్వహించారు కొండిబ గ్రామ సచివాలయం,సాడ గ్రామ రచ్చబండలో నిర్వహించిన రెవెన్యూ సదస్సు లో జిల్లా హార్టికల్చర్ అధికారి శంకర్రావు, రోడ్లు విస్తరణ సర్వేయర్ రామ్మూర్తి ప్రత్యేక అధికారులుగా హాజరయ్యారు. అనంతరం డి హెచ్ ఓ మాట్లాడుతూ భూ యజమాని మరణాంతరం భూమి పత్రాలను భార్య లేదా వారసుల పేరిట మార్చాలంటే మ్యుటేషన్ ద్వారా సాధ్యమని పట్టాదారులు చనిపోయిన తర్వాత వారి భార్యకు లేదా వారసుల పేరిట భూమి పత్రాలను మార్చేందుకు మ్యూటేషన్ తప్పనిసరి అన్నారు. మ్యుటేషన్ చేసేందుకు మరణించిన భూ యజమాని మరణ ధృవపత్రం,కుటుంబ సభ్యుల ధ్రువపత్రాలు తప్పక అవసరమవుతాయని అన్నారు. రెవెన్యూ సదస్సులలో మ్యూటేషన్,వెబ్లాండ్ నమోదు,వంటి భూ సమస్యలపై రైతుల ద్వారా 43 అర్జీలు స్వీకరించి వెంటనే ఆన్లైన్ చేసి 45 రోజుల్లోగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దీంతో రైతులు ప్రభుత్వం అందించే రైతు భరోసా, ఈ క్రాప్ పంట రుణాలు పొందేందుకు అవకాశం ఉందని తెలిపారు. పట్టాదారులు వారి సొంత భూములలోనే సాగు చేసుకోవాలని పక్కవారి భూములను ఆక్రమించరాదని అలా చేస్తే ల్యాండ్ గ్రాబింగ్ చట్టం ప్రకారం 14 సంవత్సరాల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తెలియజేశారు.ప్రభుత్వ భూములను ఆక్రమణ చేయరాదన్నారు.రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రెవెన్యూ గ్రామంలో రైతుల నుండి భూ సమస్యలపై అర్జీలు స్వీకరించి అక్కడికక్కడే ఆన్లైన్ చేయించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ మాణిక్యం,ఆర్ఐ పంచాడి జగ్గయ్యమ్మ, వీఆర్వో శాంతి కుమారి, పంచాయతీ కార్యదర్శి శైలజ,కూటమి ప్రభుత్వ కార్యకర్తలు జగన్ బాబు, దయానిధి,రాజు, సచివాలయం సర్వేయర్ కృష్ణ, గ్రామ సచివాలయ సిబ్బంది,గ్రామస్తులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సఫాయి కర్మచారిలకు పునరావాసం కల్పించాలి






**కురుపాం / పార్వతీపురం, పెన్ పవర్, డిసెంబరు 18 :** సఫాయి కర్మచారి (పారిశుధ్య కార్మికులు) లకు పునరావాసం కల్పించాలని జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యులు డా.పి.పి. వావా అన్నారు. సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యులు వావా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సఫాయి కర్మచారిలకు విధిగా పునరావాసం కల్పించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలను వారికి అమలు చేయాలని, బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని ఆయన ఆదేశించారు. బ్యాంకు రుణాలకు ష్యూరిటీలు అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో పశువులు, కోళ్ల తదితర పెంపకం యూనిట్ల మంజూరు చేయవచ్చని, సేవా రంగంలోనూ అనేక అవకాశాలను కల్పించవచ్చని ఆయన చెప్పారు. జాతీయ సఫాయి కర్మచారి ఆర్థిక అభివృద్ధి సంస్థ ద్వారా రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. సఫారీ కర్మచారి కుటుంబ సభ్యులకు వివిధ రంగాల్లో శిక్షణ కార్యక్రమాలను కూడా నిర్వహించడం జరుగుతుందని ఆయన చెప్పారు. సఫారీ కర్మచారి విధివశాత్తు మరణించినప్పుడు తక్షణం కుటుంబ సభ్యులకు ఉద్యోగాన్ని కల్పించాలని ఆయన అన్నారు. ఎట్టి జాప్యం ఉండరాదని ఆయన స్పష్టం చేశారు. కార్మికులకు అవసరమగు దుస్తులు, బూట్లు, చేతి గ్లోవ్స్, నూనె తదితర సామాగ్రిని విధిగా అందజేయాలని ఆయన అన్నారు హెపటైటిస్ – బి వాక్సిన్ వేయించాలని, నిర్దేశిత సమయంలో వైద్య శిబిరాలను నిర్వహించి వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆయన పేర్కొన్నారు. కార్మికులకు అందవలసిన ప్రతి ప్రయోజనాన్ని విధిగా అందించాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. కార్మికులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని ఆయన అన్నారు. పారిశుధ్య కార్మికుల ఆదాయాలకు అతీతంగా ప్రభుత్వం ఇళ్ళు మంజూరు చేయాలని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులతో ముఖాముఖి మాట్లాడి వారికి అందుతున్న ప్రయోజనాలు, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.
అంతకముందు జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యులు డా.పి.పి. వావాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాన్ని అందించారు. జిల్లా పరిస్థితిని వివరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోబిక,
అదనపు ఎస్పీ డా. ఓ.దిలీప్ కిరణ్, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి ఎం.డి.గయాజుద్దీన్, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తమర్భ కొండలరావు, జిల్లా విద్యా శాఖ అధికారి ఎన్ తిరుపతి నాయుడు, లీడ్ బ్యాంక్ మేనేజర్ జె ఎల్ ఎన్ మూర్తి, జిల్లా కార్మిక శాఖ అధికారి కె. రామ కృష్ణా రావు, డివిజనల్ అభివృద్ధి అధికారి రమేష్ రామన్, మున్సిపల్ కమిషనర్లు శ్రీనివాస రాజు, ఎస్ సర్వేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల కు ప్రహరీ మంజూరు చేయాలని ఎమ్మెల్యే కు వినతి..



**కురుపాం : పెన్ పవర్, (డిసెంబరు-18).** మండలంలోని ధర్మ లక్ష్మీపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల కు చుట్టూ ప్రహరీ మంజూరు చేయాలని ఆ గ్రామానికి చెందిన పెద్దలు బుధవారం కురుపాం ఎమ్మెల్యే తోయక జగదేశ్వరిని జి.ఎల్.పురంలోని తన నివాసంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడు తూ ప్రహరీ గోడ లేక పోవటంతో వలన విష సర్పాలు ప్రవేశిస్తున్నాయని తెలిపారు. సమస్య సత్వర పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని కోరారు.

## విధి నిర్వహణలో ఉత్తమసేవల తోనే గుర్తింపు సాధ్యం..

చిన్నమేరంగి సర్కిల్ ఇన్స్పెక్టర్ టి.వి.తిరుపతిరావు...



**కురుపాం /జియ్యమ్మవలస :పెన్ పవర్, డిసెంబర్ - 18.**
విధి నిర్వహణలో ఉత్తమ సేవలు తోనే గుర్తింపు సాధ్యం అవుతుందనీ జియ్యమ్మవలస మండలం చిన్నమేరంగి సర్కిల్ ఇన్స్పెక్టర్ టి.వి. తిరుపతి రావు అన్నారు. బుధవారం ఉత్తమ సేవల ను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందచేసిన డి. జి.పి కమండేషన్ డిస్క్ 22 బ్రాంజ్ మెడల్ సర్టిఫికేట్ ను జిల్లా ఎస్పీ మాధవరెడ్డి చేతుల మీదగా సర్కిల్ ఇన్స్పెక్టర్ తిరుపతిరావు కు అంద చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ విధినిర్వహణలో విశేష ప్రతభను గుర్తించి మెడల్ అందించటం జరిగిందన్నారు. అవార్డ్ గ్రహీత సర్కిల్ ఇన్స్పెక్టర్ తిరుపతిరావు మాట్లాడు తు ఈ మెడల్ పొందటం ఎంతో సంతోషంగా ఉందని, మరింత భాధ్యత పెరిగిందన్నారు.

# జాప్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



- ప్రెస్ క్లబ్ అధ్యక్షుడుగా గొర్లి రాజు
- ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడుగా జెట్టి శంకర్



**నర్సీపట్నం, పెన్ పవర్ ( డిశెంబర్ 18) :** జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్ ) నర్సీపట్నం ప్రెస్ క్లబ్ వనభోజన కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఉత్తరవాహని నదీ తీరాన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. నర్సీపట్నం డివిజన్లో అన్ని మండలాల నుంచి జర్నలిస్టులు హాజరయ్యారు. ఎన్నికల అధికారిగా జాప్ రాష్ట్ర కార్యదర్శి ఎలమంచిలి వేణు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షుడుగా లంక శివకుమార్, అధ్యక్షుడిగా గొర్లి రాజు, ప్రధాన కార్యదర్శిగా రుత్తల శ్రీనివాసరావు (మాకవరపాలెం), కోశాధికారిగా గొంతిన వరహాలుబాబు (గొలుగొండ), ఉపాధ్యక్షులుగా కోసూరి రమేష్ (మాకవరపాలెం), సహాయ కార్యదర్శిగా ఎల్.వి. రమణ, ఎలక్ట్రానిక్ మీడియా గౌరవ అధ్యక్షుడిగా జక్కు అప్పలస్వామినాయుడు, అధ్యక్షుడిగా జెట్టి శంకర్ (టీవి5) , ప్రధాన కార్యదర్శిగా పోలుపర్తి శ్రీనివాసరావు (నాతవరం), కోశాధికారిగా కడిమిశెట్టి తాతాజీ (ఎన్టీవి), ఉపాధ్యక్షుడిగా బీజా రామ్ కుమార్, సహాయ కార్యదర్శిగా కుంచా జగదీష్ (మహా టీవి) మరియు కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన నర్సీపట్నం ప్రెస్ క్లబ్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా కార్యవర్గ సభ్యులను పూలదండలతో సత్కరించారు. భవిష్యత్తులో జాప్ యూనియన్ రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రెస్ క్లబ్ లో జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో జాప్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎలమంచిలి వేణు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోసూరి రామకృష్ణ, పూర్వపు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పులిగా మురళి, పూర్వపు ప్రెస్ క్లబ్ గౌరవాధ్యక్షులు మార్తి అప్పలరాజు తదితరులు కీలకంగా వ్యవహరించారు.

# రెవెన్యూ సదస్సులను రైతుల సద్వినియోగం చేసుకోవాలి








- గిఫ్ట్ డీడ్ ద్వారా సాగు భూమిని బహుమతిగా ఇవ్వొచ్చు

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, డిసెంబర్ 18:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం దామనపల్లి పంచాయతీ కేంద్రంలో సచివాలయం వద్ద దామనపల్లి సర్పంచ్ కుందేరి రామకృష్ణ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పట్టాదారులకు ఉన్న భూమిలో కొంత భూమిని తమ పిల్లలకు కుటుంబ సభ్యులకు ఇవ్వాలనుకుంటే గిఫ్ట్ డిడ్ (బహుమాన ఒప్పంద పత్రం) పద్ధతి ద్వారా ఇవ్వవచ్చని తహసిల్దార్ టి.రామకృష్ణ అన్నారు. బుధవారం మండలంలో దామనపల్లి పంచాయతీ గ్రామ సచివాలయంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. పట్టాదారులు తమకున్న భూమిలో కొంత భూమిని వారసులకు గాని కుటుంబ సభ్యులకు గానీ రాసి ఇవ్వాలనుకుంటే గిఫ్ట్ డీడ్ పద్ధతి ద్వారా సాగు భూములను బహుమతిగా ఇచ్చుకునే అవకాశం ఉన్నదని తెలిపారు. రెవెన్యూ సదస్సులో భూ సమస్యలపై రైతులకు ఉన్న సందేహాలను ఆయన నివృత్తి చేశారు. రెవెన్యూ గ్రామాలలో ఎక్కువగా మ్యూటేషన్,వెబ్లాండ్ నమోదు వంటి సమస్యలు తమ దృష్టికి వస్తున్నాయని తెలిపారు. భూ సమస్యలపై రైతులు ఇచ్చిన అర్జీలను పిజిఆర్ఎస్ పోర్టల్ లో ఆన్లైన్ చేసి పరిష్కారం చేస్తున్నామన్నారు. దామనపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న రెవెన్యూ గ్రామాల పట్టాదారులు రెవెన్యూ సదస్సుకు వచ్చి భూ సమస్యలపై అర్జీలు అధికారులకు అందించారు. రైతుల ద్వారా తీసుకున్న అర్జీలను అక్కడికక్కడే ఆన్లైన్ చేసి పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసిల్దార్ దుమంతి సత్యనారాయణ, ఆర్ ఐ మహదేవ్, సర్పంచ్ కుందరి రామకృష్ణ, మాజీ ఎంపీపీ సాగిన బాలరాజు,మండల సర్వేయర్ శ్రీను, వీఆర్వో రామారావు,సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీలను ఏబిసిడిలుగా వర్గీకరించాలి

**విశాఖ దక్షిణం పెన్ పవర్ డిసెంబర్ 18:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నియమించిన షెడ్యూల్ కులాల, ఉప వర్గీకరణ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా కి, వినతి పత్రం అందజేసి ఎస్సీ ల వర్గీకరణ ను అనుసరించి రిజర్వేషన్ లను ఏ, బి, సి,డి లుగా వర్గీకరించాలని కోరారు. విశాఖ జిల్లా కలెక్టరు కార్యాలయం లో ఆయనకు వినతి పత్రం అందచేసారు. అనకాపల్లి జిల్లా ఎం ఈ ఎఫ్ ప్రధాన కార్యదర్శి మార్తా శ్రీనివాసరావు, తదితరులు అందించారు. మహాజన సోషలిస్ట్ పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు ఏలుసూరి ఘాటీలు మాదిగ, అనకాపల్లి జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు ఎలక మల్లి బాబు, మహాజన సోషలిస్టు పార్టీ చోడవరం నియోజకవర్గం ఇంచార్జ్ మంచేటి రాజబాబు రెల్లి హుక్కుల రాష్ట్ర నాయకులు, వరప్రసాద్ మాజీ ఎంపీటీసీ. అప్పలరాజు పాల్గొన్నారు.



## రూ. 3.23 లక్షల చెక్కును సీ.ఎం.సహాయ నిధి నుంచి అందించిన గంటా



**భీమిలి, పెన్ పవర్, డిసెంబర్ 18 :**కిడ్నీ వ్యాధి తో బాధపడుతున్న మహిళకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 3.23 లక్షల చెక్కును భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బుధవారం అందజేశారు. భీమిలి ప్రాంతానికి చెందిన దల్లి పాపునాయు డు ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నా రు. అతని భార్య దల్లి లక్ష్మి (55) కిడ్నీ వ్యాధి బారిన పడ్డారు. వైద్యానికి పెద్ద ఎత్తున డబ్బులు ఖర్చవుతుండడంతో పాపు నాయుడు ఎమ్మెల్యే గంటా కార్యాలయం ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. ప్రభు త్వం నుంచి విడుదలైన రూ. 3.23 లక్షల చెక్కు ను బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే అందించా రు. తన ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని సహా యం అందించినందుకు ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరా వులకు పాపునాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

## చింతపల్లి ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం :-

- ఎంపీపీ కోరాబు అనూషదేవి
- జడ్పిటిసి
- పోతురాజుబాల య్య
- ఎంపీడీవో శ్రీనివాసరావు :-





**చింతపల్లి పెన్ పవర్, డిసెంబర్ 18:** చింతపల్లి మండలం సమావేశ మందిరంలో, మండల పరిధి అధికారులు, 17,18 వ తేదీలలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు 2వ బ్యాచ్ నకు సస్టైనబుల్ డవలఫమెంట్ గోల్స్ (స్థిరమైన అభివృద్ధి లక్షయాలు గురుంచి ) రెండవరోజు శిక్షణా కార్యక్రమాలు ముగింపు జరిగినవి మరియు మైనర్ బాలికల వివాహము విషయమై ప్రతిజ్ఞ చేయడం జరిగినది ఈ కార్యక్రమము

పంచాయతీ సర్పంచులు, ఎంపిటీసీలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు

# రాష్ట్ర డిజిపి నుండి ప్రశంసలు






- విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, మరియు ఇతర పోలీసు అధికారులు
- ముగిసిన జాతీయ లోక్ అదాలత్లో అత్యధిక కేసులను పరిష్కరించుటలో ప్రతిభ కనబర్చిన జిల్లా పోలీసుశాఖ
- జాతీయ లోక్ అదాలత్లో 5345 కేసులను పరి ష్కరించి రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచిన జిల్లా పోలీసులు

**విజయనగరం క్రైమ్ బ్యూరో, పెన్ పవర్ డిసెంబర్ 18 :**డిసెంబరు 14న జిల్లాలో ముగిసిన జాతీయ లోక్ అదాలత్ లో రాష్ట్రంలోనే అత్యధిక కేసులను పరిష్కరించిన జిల్లాగా విజయనగరం పోలీసుశాఖ ద్వితియ స్థానం సాధించిందని జి ల్లా ఎస్పీ వకుల్ జిందల్ డిసెంబరు 18 న తెలి పారు. లోక్ అదాలత్లో 5345 కేసులను పరిష్క రించుటలో క్రియాశీలకంగా పని చేసిన జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మరియు భోగాపురం రూరల్ సిఐ జి.రామకృష్ణ, డి.సి.ఆర్బి ఎస్.ఐ కే. రాజేష్, నెల్లిమర్ల హెడ్ కానిస్టేబులు కే.స న్యాసి నాయుడు, 2వ పట్టణ కానిస్టేబులు ఐ.శ్రీనివాస రావు లను రాష్ట్ర డి.జి.పి సి.హెచ్. ద్వారకా తిరుమలరావు డిసెంబరు18 న తన కార్యాల యంలో ప్రత్యేకంగా అభినందించి, ప్రశంసా పత్రాలను, ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేసారని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిం దల్ మాట్లాడుతూ - జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషనుల్లో నమోదై, లోక్ అదాలత్లో పరిష్కారానికి అర్హత కలిగిన కేసులను ముందు గా గుర్తించి, ఆయా కేసుల్లో ఫిర్యాదిదారులు మరియు కక్షిదారుల మధ్య సమన్వయం సాధిం చేందుకు క్షేత్ర స్థాయిలో చక్కని ప్రణాళితో పని చేసామన్నారు. న్యాయస్థానాల విలువైన సమ యాన్ని ఆదా చేయడంతోపాటు, స్వల్ప వివా దాలు, క్షణికావేశంపై నమోదైన కేసుల్లో ఇరు వర్గాలను డిసెంబరు 14న నిర్వహించిన జాతీ య లోక్ అదాలత్ నందు ప్రవేశ పెట్టడంతో, న్యాయస్థానం ముందు హాజరై, ఇరువర్గాలు రాజీ పడినట్లుగా వెల్లడించడంతో 5345 కేసు లను పరిష్కరించామన్నారు. వివిధ పోలీసు స్టేషనుల్లో ఎఫ్.ఐ.ఆర్.లుగా నమోదైన 1192 కేసులతో సహా, 4153 ఎన్ఫోర్సుమెంటు కేసుల ను మొత్తం 5345 కేసుల పరిష్కరించిన ట్లుగా జిల్లా ఎస్పీ తెలిపారు. భవిష్యత్తులో కూ డా ఇదే స్ఫూర్తితో పోలీసు అధికారులు, సిబ్బంది పని చేయాలని, జిల్లాను అన్ని రంగాల్లోను ప్రధమ స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని అధికా రులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ పిలుపునిచ్చారు.రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ మెగా లోక్ అదాలత్లో 17,138 కేసులు డిస్పోజ్ కాగా, వాటిలో విజయనగరం జిల్లా పోలీసులు 5345 కేసులను డిస్పోజ్ చేసి, రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచారని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ప్రధమ స్థానంలో కర్నూలు జిల్లా, తృతీయ స్థానంలో కృష్ణా జిల్లాలు నిలిచాయి.

ఈ కార్యక్రమంలో సి.ఐ.డి అధిషనల్ డి.జి. డా. రవిశంకర్ అయ్యాన్నార్, లా అండ్ ఆర్డర్ ఐజి సీహెచ్.శ్రీకాంత్, ఈగల్ ఐ.జి ఆకె రవికృష్ణ, రైల్వే మరియు స్పోర్ట్స్ ఐజిపి కే.వి.మోహన రావు పలువురు ఉన్నతాధికారులు, ఇతర జిల్లా ల ఎస్పీలు, ఇతర పోసు అధికారులు పాల్గొ న్నారు.




# ఎస్సీ ఉప కులాల వర్గీకరణ





**ఏకసభ్య కమిషన్ జిల్లా పర్యటన**

**ప్రజాభిప్రాయం సేకరించిన షెడ్యూల్ కులాల ఉప-వర్గీకరణ**

**ఏక సభ్య కమిషన్ చైర్మన్ విశ్రాంత ఐ.ఏ.ఎస్ రాజీవ్ రంజన్ మిశ్రా**

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం డిసెం బర్ 18 :** షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణపై ప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమిషన్ బుధవారం జిల్లాలో పర్యటించింది. విశ్రాంత ఐఎఎస్ రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏక సభ్య కమిషన్ శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, కాకి నాడ జిల్లాల పర్యటనలో భాగంగా బుధవారం ఉదయం విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో ఎస్సీ ఉప కులాల వర్గీకరణకు సంబంధించిన అంశంపై ఆయా షెడ్యూలు కులాల ప్రతినిధు లు, ప్రజలు, ఉద్యోగ సంఘాలు, కుల సంఘాల నాయకుల నుంచి ఏక సభ్య కమీషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా వినతులు, సూచనలను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తో కలసి స్వీకరించారు. 168 వినతులు, మెమోరాండం లను వివిధ షెడ్యూల్డ్ ఉప కులాల ప్రతినిధుల నుంచి సేకరించారు. ఈ సందర్భంగా పలు కుల సంఘాలు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మా ట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ, కులాల పునర్విభ జనపై వచ్చిన ఫిర్యాదులు, విజ్ఞప్తులను పూర్తి గా చర్చించి తదుపరి చర్యల నిమిత్తం కమిషన్ ప్రభుత్వానికి అందజేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి భవా ని శంకర్, డిజేబుల్ వెల్ఫేర్ సహాయ సంచాల కులు జె.మాధవి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్య పద్మతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.





## దామాషా పద్ధతిలో ఎస్సీ వర్గీకరణ జరగాలి



**విశాఖ ఉత్తరం, పెన్ పవర్ డిసెంబర్ 18:**ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ కులాల ఉపవర్గీకరణ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజాన్ మిశ్రా విశాఖపట్నం విచ్చేసిన సందర్భంగా ఆయనను కొప్పుల వెంకట రావు నాయకత్వంలో విశాల విశాఖ మాదిగ వెల్ఫేరు అసోసియేషన్ నాయకులు ఎస్. సి.రిజర్వేషన్ వర్గీకరణ కమీషన్ ను కలిసి ఆంధ్రప్రదేశ్ లో ఎస్. సి. వర్గీకరణ ఆవశ్యకత గురించి మరియు రిజర్వేషన్లు అమలు లో గత 75 సంవత్సరాలు గా మాదిగ మరియు రెల్లి ఉపకులాల కు చెందిన వారి కి ఎంతటి అన్యాయం జరిగిందో తెలుపుతూ ఒక నోట్ ను అలాగే మెమోరాండం కమిషన్ కు సమర్పించారు. చైర్మన్ కూడా నాయకులను స్వాగతిస్తూనే సానుకూలంగా స్పందించారు...ఈ కార్యక్రమంలో కొప్పుల వెంకట రావు గొటివాడ నర్సింగరావు, విశాల విశాఖ మాదిగ వెల్ఫేరు అసోసియేషన్ అధ్యక్షులు,సంఘం కార్యవర్గ సభ్యులు గుమ్మడి హనుమంతరావు, జోరీగల గణేష్ ,సి హెచ్ ఆషాకిరణ్ , వంగలపూడి శ్రీనివాస్ రావు, ఓదూరు చిన్నా, ఓదూరు శివయ్య, బంగారు కనకరాజు, కొప్పుల బాలకృష్ణ , పెద్దాడ చలపతి తదితరులు పాల్గొన్నారు.

## షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణ పై సమీక్ష

- షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణ ప్రాతినిధ్యం పై జిల్లా అధికారులతో సమీక్ష
- షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ ఏక సభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాలి






**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం, డిసెంబర్ 18 :** షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ సమాచారం పూర్తి స్థాయిలో అధికారుల వద్ద ఉండాలని షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ ఏక సభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించిన షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ ఏక సభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా, ఐ.ఏ.ఎస్. (రిటైర్డ్) విశాఖ జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో షెడ్యూల్ కులముల వర్గీకరణ పై ప్రజలు, ఉద్యోగులు, వివిధ కుల సంఘ నాయ కుల నుండి అభిప్రాయాలు, వినతులు స్వీకరణ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తో కలసి షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణపై అభిప్రాయాలు, సూచ నలు స్వీకరించారు.ముందుగా జిల్లా కలెక్టర్ జిల్లాలో ఉన్న కులాల వారీగా గణాంకాలు వివ రించారు. విద్యాశాఖ, జిల్లా పరిషత్, డిస్ట్రిక్ట్ పంచాయతీ ఆఫీస్, వైద్య ఆరోగ్యశాఖ, డి.ఆర్డి ఏ, ఏ.పీ ఈ.పీ.డీ.సీ.ఎల్, ఆర్టీసీ, డ్వామా, ఎస్సీ కార్పొ రేషన్, ట్రైబల్ వెల్ఫేర్, సాంఘిక సంక్షేమ శాఖ, ఎక్సైజ్ శాఖ, మార్కెటింగ్ శాఖ, గృహ నిర్మాణ శాఖ కార్యాలయాల్లో షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణపై సంబంధిత వివరాలను ఏక సభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు అధి కారులు వివరించారు.

ఈ సమీక్షా సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి భవాని శంకర్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఆధార్ నమోదు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి-ఎంపీడీవో ఎస్ కె వి ప్రసాద్.



**కొయ్యూరు,పెన్ పవర్ డిసెంబర్18:**మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలను ఆయా గ్రామాల ఆదివాసిలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఎస్ కె వి ప్రసాద్ కోరారు.బుదవారం మండలంలోని అంతాడ, డౌనూరు , కొయ్యూరు, పంచాయితీల్లో నున్న పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన తాత్కాలిక ఆధార్ కేంద్రాలను సందర్శించి తనిఖీ చేసినట్టు ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ- ఐదేళ్ళ లోపు చిన్నారులకు ఆధార్ నమోదు, ఇతరులకు ఆధార్ నవీకరణ లను దిద్దుబాటు చేసుకోవచ్చు నన్నారు. నేరుగా మీ గ్రామాల్లోనే ప్రత్యేకంగా కల్పించిన ఈ సదవకాశాన్ని ప్రతిపిల్లల తల్లిదండ్రులు ముందుకు వచ్చి ఈ ఆధార్ నమోదు చేసుకోవాలని ఎంపీడీవో ప్రసాద్ కోరారు. బుధవారం ఆధార్ నమోదులో. 92 మందికి బయోమెట్రిక్ , కొత్త ఆధార్, డేటా ఎంట్రీ సేవలు అందించినట్లు ఎంపీడీవో తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆయా సచివాలయ కార్యదర్శులు, అంతాడ డిజిటల్ అసిస్టెంట్ కె ప్రసాద్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## జాప్ యూనియన్ నర్సీపట్నం ప్రెస్ క్లబ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసరావు.......



**నాతవరం పెన్ పవర్ (డిసెంబర్ 18):** జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ (జాప్) యూనియన్ నర్సీపట్నం ప్రెస్ క్లబ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శిగా పోలుపర్తి శ్రీనివాసరావు ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. బుధవారం నర్సీపట్నం బలిఘట్టం ఉత్తర వాహిని దగ్గర జాప్ కుటుంబ సభ్యులు వన భోజన కార్యక్రమం నిర్వహించారు. ఉత్తర వాహిని నది తీరాన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది.నూతనంగా ఎన్నికైన పోలుపర్తి శ్రీనివాసరావుకు జాప్ యూనియన్ కుటుంబ సభ్యులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## అల్పపీడనం కారణంగా రైతుల కోతలు, నూర్పులు వాయిదా వేసుకోవాలి.

వైస్ ఎంపీపీ గోపినాయక శారద.



**చింతపల్లి పెన్ పవర్ డిసెంబర్ 18:-** మండలంలోని రైతులందరూ అల్పపీడనం కారణంగా రాగల రోజుల్లో ఒక్కమోస్తారు వర్షాలు కురుస్తాయని వైస్ ఎంపీపీ గోపినాయక శారద తెలిపారు.రైతులు వరి పంట కోతలను,ధాన్యంనూర్పులను వాయిదా వేసుకోవాలని సూచించారు. కోసిన ధాన్యాన్ని తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించి జాగ్రత్త చేసుకోవాలని తెలిపారు. అత్యవసరమైన పరిస్థితిలో కోతల కొయ్యవలసి వస్తే కోసిన పంటను సురక్షిత ప్రాంతాలకు చేర్చుకోవాలని అన్నారు. వర్షం కారణంగా తడిసిన వరి పనులపై లీటరు నీటికి 50 గ్రాముల ఉప్పును కలిపి పిచికారి చేయాలని సూచించారు. ఉప్పు ద్రవణంతో కంకులను ముంచి ఆరబెట్టాలని అన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వారి రైతులు కోత కోసి ఉంటే కల్లాలను టార్పోలిన్ పట్టాలతో కప్పి భద్రపరుచుకోవాలని, ధాన్యం ఇళ్లకు తరలించుకోవాలని చెప్పారు.

## మన్యం,అల్లూరి జిల్లాలో పర్యటనకు వస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్తవీధి,పెన్ పవర్,డిసెంబర్ 18:**ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పంచాయతీరాజ్ శాఖ మాత్యులు, జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ గిరిజనుల సమస్యలు తెలుసుకునేందుకు నేరుగా వారి వద్దకే రానున్నారని అరకు పార్లమెంట్,పాడేరు అసెంబ్లీ జనసేన పార్టీ ఇంచార్జ్ డాక్టర్ వంపూరు గంగులయ్య తెలిపారు.రెండు రోజులపాటు ఆదివాసీల సమస్యలు తెలుసుకునేందుకు గిరిజన ప్రాంతాల్లో పర్యటించనున్నారు. ఈనెల 20, 21వ తేదీల్లో మన్యం పార్వతీపురం జిల్లా సాలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులోను ఆయన పర్యటించనున్నారని తెలిపారు.ఈ సందర్భంగా అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. స్వాతంత్రం వచ్చి 75 ఏళ్ల గడుస్తున్న ఇప్పటికీ గిరిజన ప్రాంతాల్లో డోలి మోతలు కొనసాగుతూ ఉండటంపై ఆయన ఇటీవల ఓ కార్యక్రమంలో ఆవేదన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డోలిమోతలు నివారణకు ప్రతి గిరిజన గ్రామానికి కనెక్టివిటీ ఉండేలా రహదారి సౌకర్యం ఏర్పాటు చేయడం. ప్రతి గ్రామానికి తాగునీటి సౌకర్యాన్ని కల్పించడమే లక్ష్యంగా ఈ పర్యటన సాగనుంది అని డాక్టర్ వంపూరు గంగులయ్య మీడియాకు తెలిపారు.

## వెనుకబడిన తరగతుల వర్గీకరణ పై వినతి పత్రం



**గాజువాక:పెన్ పవర్ డిసెంబర్ 18:** బాబు జగ్జీవన్ రావ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖపట్నం ఎస్సీ ఏబిసిడిల వర్గీకరణ ఏక సభ్య కమిటీ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా విశ్రాంత ఐ.ఎ.ఎస్ పెదగంట్యాడ, మరియు గాజువాక ప్రాంతం మాదిగ సోదరీ ఎమ్మార్పీఎస్, ఎం ఈ ఎఫ్ నాయకులు సంఘం లెటర్ హెడ్ పై కమిషన్ చైర్ పర్సన్ కి ఏబిసిడి వర్గీకరణకు వినతిపత్రం అందజేశారు. మాదిగ ,రెల్లి ఉప కులాలు సభ్యులు అత్యధికంగా పాల్గొన్నారు .సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం గౌరవించి ఏబిసిడి వర్గీకరణ చేయాలని కమిషన్ చైర్మన్ ని కలిసి వినతిపత్రం అందజేయడం జరిగింది సంఘం నాయకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మార్పుడి పరదేశి, గంట్యాడ గోవిందరాజు, డాక్టర్ రాజారావు, దేవుపల్లి సంపూర్ణం, ములకలపల్లి వెంకటేష్, కనితి సురేష్, టేకేటి వెంకటరమణ, గంట్యాడ పైడి రాజు, కాకినాడ పరదేశి, కాకినాడ సింహాచలం, ములకలపల్లి వంశీ , ఎలబెల్లి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు

# వాలంటీర్లు పై ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రేమ , అధికారంలోకి వచ్చిన తర్వాత ఏమైంది:

- ఎన్నికలకు ముందు ఒక మాట, గెలిచాక మరో మాట
- జిల్లా గౌరవ అధ్యక్షులు, బోనంగి చిన్నయ్య పడాల్



**చింతపల్లి :పెన్ పవర్ డిసెంబర్ 18:-** చింతపల్లి లో ఈరోజు వాలంటీర్ల సమావేశము లో

ఎన్నికల ప్రచారంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వాలంటీర్ల మీదచూపించిన ప్రేమఅధికారం వచ్చిన తర్వాత ఏమైందని, ఏడు నెలల నుంచి కొద్దిపాటి జీతం కూడా లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు.ఎదుర్కొంటున్నారని, వాలంటీర్ల సంఘం అల్లూరిజిల్లాగౌరవఅధ్యక్షులు, బోనంగి చిన్నయ్య పడాల్ కూటమిప్రభుత్వంపైనఆవేదన చెందారు,చింతపల్లిజికేవిది కొయ్యూరుమండలాలప్రాంతీయ సమావేశం, వాలంటీర్ల సంఘం చింతపల్లి మండల అధ్యక్షులు, వేములపూడి పరమేశ్వరరావు అధ్యక్షతన జరిగింది, జిల్లా వాలంటీర్ల సంఘం అధ్యక్షకార్యదర్శులు, ప్రసాదుకొండబాబుపర్యవేక్షణ చేయగా, ముఖ్యఅతిథిగా పాల్గొన్న చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, ప్రతిపక్షంగా ఉన్నప్పుడు. ఎన్నికల ప్రచార సభల్లో వాలంటీర్లకు, 5000 జీతం చాలదు మా ప్రభుత్వం అధికారంలోకి వస్తే 10,000 జీతంతో వాలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని ఆనాడు చంద్రబాబు నాయుడు అనలేదా అని అన్నారు, ఇప్పుడు అధికారంలో వచ్చిన తర్వాత కనీసం స్పందించలేదని, ఏడు నెలలు వేతనాలు లేక వాలంటీర్లు ఆర్థిక భారంతో రాష్ట్రంలో రెండు లక్షల అరవై వేల మంది కుటుంబాలతో రోడ్డున పడ్డారని మండిపడ్డారు, ఇప్పుడు కూటమి ప్రభుత్వంఎన్నికలకు మూడు నెలలకు ముందుజగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం రెన్యువల్ చేయలేదని బిడ్డ పుట్టకుండానే పేరు ఎలా పెడతామని ఎదురుదాడి చేస్తుందని, అలాంటప్పుడు ఎన్నికల కోడ్ ఉన్నందున రెన్యువల్ చేయలేదని విషయం చంద్రబాబు నాయుడుకు తెలియదా అని ప్రశ్నించారు, ఆ ప్రభుత్వం రెన్యువల్ చేయకపోతే మా ప్రభుత్వం చేసి చూపిస్తామని కూటమి ప్రభుత్వం ఎందుకు చెప్పడం లేదని నిలదీశారు, ఎన్నికలకు ముందు ఒక మాట, గెలిచాక మరో మాట మాట్లాడటం అర్థరహితమని మండిపడ్డారు, వాలంటీర్ల కుటుంబాల వెనక అనేక కుటుంబాలు ఉన్నాయని గెలిచిన అహంకారాన్ని పక్కన పెట్టి తిరిగి వాలంటీర్లను వీధిలోకి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు, చేయించిన వారిని మానవత దృక్పథంతో మళ్లీ తిరిగి తీసుకోకపోతే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు, వాలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, ప్రసాద్, కొండబాబు మాట్లాడుతూ ఈనెల 26 27 28 తేదీలలో మండల కేంద్రాలలో జరిగే రిలే నిరాహార దీక్షలలో పాల్గొనలని వాలంటీర్ల న్యాయబద్ధమైన పోరాటాన్ని ప్రతి ఒక్కరూ మద్దతు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు, వాలంటీర్లు అంటే ఆ ప్రభుత్వంలో నియమించిన సేవకులమని, మేం వైఎస్ఆర్సిపి కార్యకర్తలు కాదని ఏ ప్రభుత్వమైనా అధికారంలో ఉన్న పార్టీ అయినాఉపయోగించుకోవచ్చు అనే విషయాన్ని అర్థం చేసుకోవాలనిఅన్నారు, అనంతరంమూడుమండలాల సబ్ డివిజన్ కన్వీనర్లుగా పరమేశ్వరరావు,రవి తదితరులుఎన్నికయ్యారు, వాలంటీర్లునాగరాజు,శిరీష,వెంకటేశ్వర్లు మరియు మూడు మండలాలకు వాలంటీర్లు పాల్గొన్నారు.

## జెడ్పి చైర్ పర్సన్ సహకారంతో ఘనంగా క్రిస్టమస్ వేడుకలు






**ముంచంగిపుట్టు, పెన్ పవర్, డిసెంబర్ 18.** ఉమ్మడి విశాఖ జిల్లా చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర సహకారంతో అల్లూరి జిల్లా, ముంచంగిపుట్టు మండల కేంద్రంలో మండల పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో క్రిస్టమస్ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అరకు శాసనసభ్యులు రేగం మత్స్యలింగం, మాజీ అరకు పార్లమెంట్ సభ్యురాలు గొడ్డేటి మాధవి, పాడేరు మాజీ శాసనసభ్యురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, మాజీ జిసిసి చైర్మన్ శోభ స్వాతి రాణి పాల్గొన్నారు. ఈ క్రిస్మస్ వేడుకకు అంతర్జాతీయ ముఖ్య ప్రసంగికులు ఏసు పాదం వాక్యోపదేశం చేస్తూ.. యేసు నడిపించిన సన్మార్గంలోనే ప్రజలు నడవాలని, శాంతి, సమాధానం కలిగి జీవించాలని అన్నారు. మనిషిని మార్చగల ఏకైక దేవుడు యేసు ప్రభుయేనని ఆయన అన్నారు. ఏసుప్రభు యొక్క జీవితం భూమి మీద ఉన్న మానవాళికి ఆదర్శప్రాయం కావాలని ఆయన అన్నారు. 40 ఏళ్ల క్రితం గిరిజన ప్రాంతంలో పర్యటించినప్పుడు గిరిజనుల స్థితిగతులు చూసి తను ఎంతగానో చలించానని దీంతో లవ్ కేర్ మినిస్ట్రీస్ ద్వారా గిరిజనులకు అనేక సేవా కార్యక్రమాలు సైతం చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అరకు శాసనసభ్యులు రేగం మత్స్య లింగం మాట్లాడుతూ.. దేవుని సేవకుల ద్వారా గిరిజన ప్రాంతం పరివర్తనం చెందిందని, గిరిజనుల ను త్రాగుడుకు,చెడు వ్యసనాలకు బానిసలైన ప్రజలకు మంచి మార్గంలో నడిపించుటకు మండల పాస్టర్ ఫెలోషిప్ ఎంతో కృషి చేస్తుందని కొనియాడారు. తన రాజకీయ జీవితంలో అంతర్జాతీయ ప్రసంగికులు ఏసుపాదం ఆర్థికంగా రాజకీయంగా తోడ్పాటును అందించారని ఆమె అన్నారు. ప్రజలను సన్మార్గంలో నడిపించాలని పాస్టర్ ఫెలోషిప్ ని కోరారు. అనంతరం క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న అతిథులను ఘనంగా సన్మానించి క్రిస్టమస్ కేక్ ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తమర్భ నర్సింగరావు, వైసిపి నాయకులు బత్తిరి రవిశంకర్ జగబంధు, వైసిపి మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు, మండలంలోని వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు మండల పాస్టర్ ఫెలోషిప్ సేవకులు మోహన్ రావు, సురేష్, బర్నబాస్, జాన్ మండలంలో గల వివిధ సంఘాల దైవజనులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## సెమ్స్ లో వైజాగ్ జనరల్ కార్గో బెర్త్





### సహకారంతో ఉచిత ఉపాధి శిక్షణ కార్యక్రమం మొదటి బ్యాచ్ కి నియామక పత్రాలు అందజేసి న విశాఖ సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, డిసెంబర్ 18 :** సెమ్స్ లో వైజాగ్ జనరల్ కార్గో బెర్త్ సహకారం తో ఉచిత ఉపాధి శిక్షణ కార్యక్రమం మొదటి బ్యాచ్ కి నియామక పత్రాలు అందజేత కార్య క్రమం,వైజాగ్ జనరల్ కార్గో బెర్త్ కార్పొరేట్ సామాజిక బాధ్యత లో భాగంగా షిప్పింగ్ మరి యు జలమార్గాల మంత్రిత్వ శాఖ స్థాపించిన సెంటర్ అఫ్ ఎక్సెన్స్ ఇన్ మారిటైం అండ్ షిపిబిల్డింగ్ (సెమ్స్) సహకారంతో పోర్ట్ పరిసర ప్రాంత మరియు జీ.వీ.ఎం.సీ పరిధిలోని 90 మంది నిరుద్యోగ యువతి యువకులకు ఉపాధి ఆధారిత నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహి స్తున్నామని, అందులో భాగంగా మొదటి బ్యాచ్లో శిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థులకు నియామక పత్రాలను దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశి కృష్ణ శ్రీనివాస్ చేతులమీదుగా అందచేయటం జరిగిందని సెమ్స్ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కే. సేతు మాధవన్ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వంశి కృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ చీఫ్ మినిస్టర్ ఆదేశానుసారం కూటమి ప్రభుత్వం ఏడాదికి 1,20,000 మంది నిరుద్యోగులకు నై పుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి ఉపాధి కల్పించటం లక్ష్యంగా పెట్టుకుందని దీనిలో భా గంగా సెమ్స్ లాంటి సంస్థల అవసరం ఎంతో ఉందని, విజయవంతంగా శిక్షణ కార్యక్రమం పూర్తి చేసుకున్న మహిళా అభ్యర్థులను అభినం దిస్తూ సభాముఖంగా చెప్పటం జరిగింది.

వీ.జీ.సీబీ. సంస్థ సి ఓ పవన్ కుమార్ మాట్లా డుతూ, మొదటి బ్యాచ్ లో 30 మంది మహిళా అభ్యర్థులకు ఇన్వెంటరీ కంట్రోలర్ కోర్సులో శిక్షణ ఇచ్చామని మరియు 30 మందితో ఎలక్ట్రీ షియన్ బ్యాచ్ బుధవారం నుండి ప్రారంభిస్తు న్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వీజీసీబీ సి.ఎస్.ఆర్ హెడ్ కుమారి శ్రీలక్ష్మి, కుమారి క్రీన విపుల్ మరియు సెమ్స్ నుండి సి ఓ కమాండర్ గోపి కృష్ణ శివ్వం, ఇన్ (రిటైర్డ్), ప్రాజెక్ట్ హెడ్ ప్రజీత్ కురుప్ తో పాటు వెస్ట్ జనసేన పార్టీ ఇన్చార్జి, స్టేట్ డైరెక్టర్ శ్రీమతి ప్రశాంతి , స్థానిక కార్పొరేటర్ సురేష్ పాల్గున్నారు.





## కాఫీ పళ్ళను దళారులకు విక్రయించవద్దు

- గొంది పాకల పంచాయతీలో
- కాఫీ తోటలు పరిశీలించిన ఐటీడీఏ పీవో
- కాఫీ పళ్ళకు రు.44లు చెల్లింపు
- చింతపల్లి మ్యాక్స్ సంస్థకు కాఫీ పళ్ళు విక్రయించాలని రైతులకు సూచన
- కాఫీ, మిరియాల సాగు లో వస్తున్న ఆదాయంపై ఆరా





**చింతపల్లి పెన్ పవర్ డిసెంబర్ 18:** చింతపల్లి మండలం గొందిపాకల పంచాయతీలో పర్యటించిన ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వి అభిషేక్,కాఫీ ఫలాలను దళారులు విక్రయించి మోసపోవద్దని రైతులకు సూచించారు. దళారులు తూకాల్లో మోసం చేస్తారని రైతులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. బుధవారం గొందిపాకలు పంచాయతీ గాది గొయ్యి గ్రామ రైతు కొండపల్లి వెంకటరావు కాఫీ తోటలను పిఓ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్తిగా పండిన కాఫీ పళ్ళు మాత్రమే సేకరించాలని చెప్పారు. నాణ్యమైన పళ్ళు సేకరించడం వల్ల మంచి ధరలు వస్తాయని చెప్పారు. గత ఏడాది కాఫీ తోటల్లో ఎంత ఆదాయం వచ్చిందని రైతును అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరం మ్యాక్స్ సంస్థకు సరఫరా చేసిన కాఫీకి ఎంత ధర చెల్లించారని రైతును అడిగి తెలుసుకున్నారు. ముందుగా రూ.43లు, అనంతరం మూడు రూపాయలు బోనస్ చెల్లించారని రైతు వివరించారు. ఈ ఏడాది కాఫీ పళ్ళకు కిలో కు రూ.44లు మ్యాక్స్ సంస్థ చెల్లిస్తుందని మ్యాక్స్ కు మాత్రమే కాఫీ పళ్ళను సరఫరా చేయాలని రైతులకు ప్రాజెక్ట్ అధికారి సూచించారు. గత సంవత్సరం కాఫీ మిరియాలు సాగులో వచ్చిన ఆదాయాన్ని అడిగి తెలుసుకున్నారు. మిరియాలు కిలోరూ. 500 నుండి600రూపాయలు విక్రయించామని రైతు చెప్పారు.

ఈ కార్యక్రమంలో ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారులు వి ఎస్ ప్రభాకర్ రావు, ఎం వెంకటేశ్వరరావు, ఏఈఓ అప్పలనాయుడు, కాఫీ ఫీల్డ్ కన్సల్టెంట్లు, లైజాన్ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీ నిధులతో మంజూరైన బోర్ పనులను ప్రారంభించిన సర్పంచ్ సుభద్ర



**గూడెం కొత్త వీధి, పెన్ పవర్, డిసెంబర్ 18:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం జీకే విధి పంచాయతీలోఎర్రవరం గ్రామంలో జడ్పీ నిధులతో మంజూరైన బోరు పనులను స్థానిక సర్పంచ్ కొర్ర సుభద్ర కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. బోరు నిర్మాణంతో గ్రామంలో మంచినీటి సమస్య తీరుతుందని గ్రామస్తులు వెల్లడించారు.ఈ కార్యక్రమానికి జీకే వీధి సర్పంచ్ కొర్ర సుభద్ర తో పాటు వార్డ్ సభ్యులు రాజేశ్వరి, వైసీపీ నాయకులు అంజి, కృపా గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మిత్రుని కుటుంబానికి ఆర్థిక సహాయం

- ఇటివల మరణించిన తోటి మిత్రుడు సుబ్రమణ్యం కుటుంబానికి పరామర్శ.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, డిసెంబర్ 18:**ఇటివల మరణించిన చిరకాల స్నేహితుడు సుబ్రమణ్యం కుటుంబానికి అండగా మేమున్నమంటూ పూర్వపు తమ తోటి విద్యార్థులు ముందుకు వచ్చి స్నేహం అనే మాటకు సరైన నిర్వచనాన్ని అందించారు. అల్లూరి జిల్లా, ముంచంగిపుట్టు మండలంలో దారెల పంచాయతీ, దారెల గ్రామానికి చెందిన చెండ సుబ్రహ్మణ్యం (35)ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. సుబ్రహ్మణ్యంతో కలిసి పాఠశాలలో విద్యను అభ్యసించిన పూర్వపు విద్యార్థులు తమ వంతుగా తమ సాటి మిత్రుని కుటుంబానికి అండగా నిలవాలని సంకల్పించి 6516 రూపాయలు నగదును సేకరించుకొని అందుబాటులో ఉన్న తోటి మిత్రులు ఎస్ శంకర్రావు, సిహెచ్ రుక్మందర్, పి ఆనందరావు లు గ్రామ పెద్దల చేతుల మీదుగా బుధవారం ఆ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు కుటుంబ సభ్యులు తల్లి మచ్చులమ్మ, అన్నయ్య రమేష్ లతో మాట్లాడారు. సుబ్రహ్మణ్యం మరణం చాలా బాధాకరమైన విషయమని, ఎంతో స్నేహ భావంతో అందరితో మెలిగేవాడని, ఎవరితో దురుసుగా ప్రవర్తించే వాడు కాదని విచారం వ్యక్తం చేశారు. 2000 విద్య సంవత్సరం నుండి 2005 విద్య సంవత్సరం వరకు 5 సంవత్సరాలు పెదబయలు ఏపీటీడబ్ల్యూఆర్ పాఠశాలలో సుబ్రహ్మణ్యంతో కలిసి 5 నుంచి 10 వ తరగతి వరకు విద్యను అభ్యసించమన్నారు. తమకు ఎల్ల వేళలా తమ వంతుగా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. సుబ్రహ్మణ్యం కుటుంబానికి ఆర్థిక సహాయం అందించేందుకు ముందుకు వచ్చిన పాఠశాల తరగతి మిత్రులకు, పులిరాజు, నాగరాజు, ఆనంద్,శంకర్ రుక్మాన్, సుమన్, లక్షన్,వైకుంఠరావు , గోపినాదం, తిరుపతి లు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎస్ ఆనందరావు, పి సుమన్, సిహెచ్ గోపాలం, పి సూరిబాబు, సిహెచ్ గోపాల్, తదితరులు ఉన్నారు.

# రాష్ట్ర యూనిటీగా ఎబీసిడి వర్గీకరణ అమల చేయాలి

- ఎమ్మార్పీఎస్ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ ఐడి బాబు





**ఎన్ఏడి, పెన్ పవర్, డిసెంబర్ 18 :** ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు ఉసూరిపాటి బ్రహ్మయ్య మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ ఐడి బాబు మాదిగ నేతృత్వంలో విశాఖ జిల్లా అధ్యక్షుడు పలసపల్లి ఆదినారాయణమాదిగ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు చిన్నం నాగరాజు ఆధ్వర్యంలో విశాఖ కలెక్టరేట్లో రాజీవ్ రంజాన్ మిశ్రా, ఎస్.సి.రిజర్వేషన్ వర్గీకరణ ఎక సభ్య కమీషన్ చైర్మన్, ఆంధ్రప్రదేశ్, వారిని కలిశారు. ఆంధ్రప్రదేశ్లో ఎస్. సి. వర్గీకరణ ఆవశ్యకత గురించి మరియు రిజర్వేషన్లు అమలలో గత 75 సంవత్సరాలగా మాదిగ మరియు రెల్లి 59 ఉపకులాలకు చెందిన వారికి జరుగుతున్న అన్యాయాన్ని క్లుప్తం గణాంకాలతో సహా వివరించారు. సుప్రీం కోర్ట్ జస్టిస్ చంద్ర చూడ్ నాయకత్వంలో రాష్ట్రాలకు అనుసంధానం చేస్తూ వర్గీకరణ అమలు చేయాలని, ఇచ్చిన తీర్పును అమలు చేయవలసిందిగా కమిషన్ కోరడమైనది. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలు యూనిట్గా కాకుండా రాష్ట్రాన్నిటిగా తీసుకొని ఏబిసిడి వర్గీకరణ చేయడం వలన మాదిగ మరియు 59 ఒప్పు కులాలకు న్యాయం జరుగుతుందని వివరించడం జరిగింది. ఇది భారత రాజ్యాంగం ప్రకారం సామాజిక న్యాయమని మాదిగ మరియు నాయ్యపరంగా రావలసినటు వంటి విద్యా ఉద్యోగ ఉపాధి అవకాశాన్ని నరికిపరచాలని, తద్వారా దోపిడీ గురవుతున్నటువంటి ఈ సామాజిక వర్గాన్ని న్యాయం చేయవలసిందిగా కోరడమైనది. ఏ దగ్గర సభ్యులు ఇచ్చిన తీర్పును జరిగింది. శ్రీ రాజీవ్ రంజాన్ మిశ్రా కమీషన్ ఎంతో సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర మహిళ కోఆర్డినేటర్ గొట్టిపాటి సుభాషిని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి వంగలపూడి గణేష్ ఎమ్మార్పీఎస్ అనకాపల్లి జిల్లా అధికార ప్రతినిధి కందేల నరసింహారావు అనిల్ అశోక్ కుమార్ తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు.

# ఎస్సీ వర్గీకరణకు సహకరించండి





- ఏక సభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంశన్ మిత్ర ను కోరిన
- మాల మహానాడు విశాఖ జిల్లా కమిటీ

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్నం డిసెంబర్ 18:**యస్సీ వర్గీకరణ జరగకుండా ఉండాలని, మరియు జీవీఎంసీ జోన్ 2.13 వ వార్డు, ముడసర్లోవ గ్రామంలో గత 45 సంవత్సరాలుగా నివాసం ఉండేవారమని పార్కు మరియు రోడ్డు విస్తరణలో భాగంగా ఇళ్లను కోల్పోయిన 36 మంది బాధితులకు ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అంశం మీద నియమించిన రాజీవ్ రంశన్ మిత్ర ను మర్యాదపూర్వకంగా కలిసిన విశాఖ జిల్లా మాల మహానాడు కమిటీ దద్దిమి కోటేశ్వరరావు.తురకపూడి బాలస్వామి.ఆనాడు పివి రావు ఆధ్వర్యంలో దళితలందరూ పోరాటం చేసి ఒక్క ఆంధ్రప్రదేశ్ లోనే ఎస్సి వర్గీకరణ జరగకూడదు అని 2004 లో సుప్రీంకోర్టు తీర్పును ఇచ్చిన సంగతి తెలిసినదే ఇప్పుడు మళ్ళీ రాజకీయ కుట్ర తో మళ్ళీ ఇప్పుడు రాజకీయ కుట్రతో మందకృష్ణ మాదిగ స్వార్ధ రాజకీయ ప్రయోజనాలు కారణంగా మళ్లీ ఏ బి సి డి వర్గీకరణ తెరపైకి తేవడం జరిగిందని దీని కారణంగా మాలలు భవిష్యత్తు లో నష్టపోతారని గుర్తించి దీనిపై కమిటీ సరైన తీర్మానం చేస్తారని,మాలలు మనో భావాలు అర్థం చేసుకొని మాయొక్క మనుగడను కాపాడాలని, స్వాతంత్ర అనంతరం దళితులకు భారత ప్రభుత్వం ఎన్నో ప్రత్యేక వసతులు, సౌకర్యాలు కల్పించింది. విద్యా, ఉద్యోగాలలో రిజర్వేషన్లు, అనేక పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందించే సౌలభ్యం ప్రభుత్వం కల్పించింది. అంటరానితనం, వర్ణవివక్ష వ్యతిరేక చట్టాలను రూపొందించింది.ఐతే ప్రసుత పరిస్థితులు అలా లేవని, డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ అందించిన ఫలాలు పూర్తిగా దళితులకు అందడం లేదని , ఆయన కన్న కలలు అందరికీ అందేలా కృషి చేయాలనీ, దళితుల పై జరిగే దౌర్జన్యాలు అరికట్టాలని దళిత వర్గాలకు జరిగే అన్యాయాలకు అడ్డుకట్ట వేయాలని తరాలు మారుతున్న మారని ఈ కుల వివక్ష పై మండిపడుతూ.. దళిత వర్గీకరణ మాకు వద్దు అని తెలియపరుస్తూ కమిషన్ చైర్మన్ కు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమం లో జాతీయ అధ్యక్షులు చీకటిపల్లి మంగరాజు,సిటీ అధ్యక్షులు తురకపూడి బాలస్వామి,కార్యదర్శి పర్రి వరదరాజు,సిటీ ఉపాధ్యక్షులు బుడపాటి సత్యనారాయణ, నెందురు సత్యనారాయణ, మెన్,తదితరులు పాల్గున్నారు,

# గిరిజన సంస్కృతి ప్రతిబింబించేలామ్యూజియం నిర్మాణం.





**మ్యూజియం నిర్మాణానికి కొత్త టెండర్లు పిలుపు**

**గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు సదా భార్గవి**

**చింతపల్లి పెన్ పవర్ డిసెంబర్ 18:** గిరిజనసంస్కృతిసాంప్రదాయాలు ప్రతిబింబించేలా స్వాతంత్ర సమరయోధుల మ్యూజియం నిర్మాణం జరగాలని గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు సదా భార్గవి పేర్కొన్నారు. స్వాతంత్ర సమరయోధుల మ్యూజియం మన్యానికి ఆభరణంగా నిలవాలని చెప్పారు.స్వాతంత్ర సమరయోధుల మ్యూజియం నిర్మాణం పనులకు కొత్తగా టెండర్లు పిలవాలని ఆదేశించారు. లంబసింగి స్వాతంత్ర సమరయోధుల మ్యూజియంనిర్మాణపనులను బుధవారం ఆమె పరిశీలించారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మ్యూజియం నిర్మాణంలో తీవ్రమైన జాప్యం జరుగుతుందని అసంతృప్తి వ్యక్తం చేశారు. కొత్త టెండర్లు పిలిచి పాత కాంట్రాక్టర్ ను తొలగించి కొత్త నిర్మాణ సంస్థలకు పనులు అప్పగించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. వచ్చే జనవరి 8వ తేదీ నాటికి టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. 16వ తేదీ నుండి పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. మ్యూజియం నిర్మాణం పనులు మూడు విభాగాలుగా విభజించి మూడు నిర్మాణ సంస్థలకు అప్పగించాలని పేర్కొన్నారు. పనులన్నీ ఏకకాలంలో పూర్తి కావాలని పేర్కొన్నారు. వచ్చే మార్చి నెలాఖరు నాటికి పనులన్నీ పూర్తి చేయాలని సూచించారు. మ్యూజియం అంతర్భాగంలో విద్యుత్ కాంతులు, విద్యుత్ దీపాల ఏర్పాట్లు, ఉద్యానవను పనులకు ఆయా రంగాలలో అనుభవం ఉన్న సంస్థలకు పనులు అప్పగించి సుందరీ కరణ చేయాలన్నారు. మ్యూజియం నిర్మాణం పనులను ఇంజనీరింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షించి పనులు వేగంగా పూర్తి చేయించాలని పేర్కొన్నారు. ఇంజనీరింగ్ అధికారులు మ్యూజియం నిర్మాణంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

ఈ కార్యక్రమంలో ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి ,అభిషేక్, ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారులు వి.ఎస్. ప్రభాకర్ రావు, ఎం .వెంకటేశ్వరరావు, టి ఆర్ ఎం ఈడి మందా రాణి,ఈఎన్ సి శ్రీనివాస్, ఈ ఈ జి. డేవిడ్, ఏ ఈ యాద కిషోర్, ట్రైకార్ అసిస్టెంట్ సీతారాం తదితరులు పాల్గొన్నారు.



# రూ.19.93లక్షల జీవీఎంసీ అభివృద్ధి నిధులతో శంకుస్థాపన

ముఖ్య అతిథిగా పాల్గొన్న కార్పొరేటర్ బొమ్మిడి రమణ





**ఎన్ఏడి, పెన్ పవర్, డిసెంబర్ 18 :** జీవీఎంసీ 90వ వార్డ్ లోని సుసర్ల కాలనీ శ్రీ పార్వతీ చంద్ర మౌళీశ్వర ఆలయం నుండి పాస్ట్రీ చెఫ్ వైపు గల ఆర్సిసి రీన్ఫోర్స్ సిమెంట్ కాంక్రీట్ డ్రైన్ల కొరకు రూ.19.93 లక్షల జీవీఎంసీ అభివృద్ధి నిధులతో జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబెర్, 90వ వార్డ్ కార్పొరేటర్ బొమ్మిడి రమణ శంకుస్థాపన చేశారు. ఆర్ సి సి డ్రైన్ ల పనులు ప్రారంభమవడంతో నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించవలసిందిగా కాంట్రాక్టర్ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీతారామరాజునగర్ అధ్యక్షులు శ్రీనివాస్ రాజు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

# జాప్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక....





- ప్రెస్ క్లబ్ అధ్యక్షుడుగా గొర్లి రాజు....
- ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడుగా జెట్టి శంకర్ .....

**నర్సీపట్నం పెన్ పవర్ ( డిశెంబర్ 18):**జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్ ) నర్సీపట్నం ప్రెస్ క్లబ్ వనభోజన కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఉత్తరవాహిని నదీ తీరాన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. నర్సీపట్నం డివిజన్లో అన్ని మండలాల నుంచి జర్నలిస్టులు హాజరయ్యారు. ఎన్నికల అధికారిగా జాప్ రాష్ట్ర కార్యదర్శి ఎలమంచిలి వేణు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షుడుగా లంక శివకుమార్, అధ్యక్షుడిగా గొర్లి రాజు, ప్రధాన కార్యదర్శిగా రుత్తల శ్రీనివాసరావు (మాకవరపాలెం), కోశాధికారిగా గొంతిన వరహాలుబాబు (గొలుగొండ), ఉపాధ్యక్షులుగా కోసూరి రమేష్ (మాకవరపాలెం), సహాయ కార్యదర్శిగా ఎల్.వి. రమణ, ఎలక్ట్రానిక్ మీడియా గౌరవ అధ్యక్షుడిగా జక్కు అప్పలస్వామినాయుడు, అధ్యక్షుడిగా జెట్టి శంకర్ (టీవి5) , ప్రధాన కార్యదర్శిగా పోలుపర్తి శ్రీనివాసరావు (నాతవరం %దీ=ఖ% న్యూస్),కోశాధికారిగా కడిమిశెట్టి తాతాజీ (ఎస్టీవి), ఉపాధ్యక్షుడిగా బీజా రామ్ కుమార్(99టివి), సహాయ కార్యదర్శిగా కుంచా జగదీష్ (మహా టీవి) మరియు కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన నర్సీపట్నం ప్రెస్ క్లబ్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా కార్యవర్గ సభ్యులను పూలదండలతో సత్కరించారు. భవిష్యత్తులో జాప్ యూనియన్ రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రెస్ క్లబ్ లో జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో జాప్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎలమంచిలి వేణు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోసూరి రామకృష్ణ, పూర్వపు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పులిగా మురళి, పూర్వపు ప్రెస్ క్లబ్ గౌరవాధ్యక్షులు మూర్తి అప్పలరాజు తదితరులు కీలకంగా వ్యవహరించారు.



# రక్షణ సేవా సంస్థ సేవలు అమోఘం - జడ్పీటిసి లలిత

**గోపాలపురం ,పెన్ పవర్, డిసెంబర్ 18:**గోపాలపురం మండలం రక్షణ సేవా సమితి సభ్యుల సామాజిక సేవలు అమోఘమని జెడ్పిటిసి సభ్యురాలు కాకులపాటి లలిత అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో గోపాలపురంలో జరిగిన క్రిస్మస్ వేడుకలకు జడ్పిటిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రైస్తవ బోధకులుగా మత విశ్వాసాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లడంతో పాటు ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటూ మానవత్వంతో పలు సేవా కార్యక్రమాలు సంఘం ద్వారా చేయడం అభినందనీయం అన్నారు. సంఘ అధ్యక్షుడు జి.ఎలీషా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బైబిల్ గ్రంధాన్ని అనుసరించి నడుచుకోవాలని అన్నారు. ప్రేమా, జాలీ ,దయ, మానవత్వం అనే గుణాలు ప్రతి క్రైస్తవుడికి నిరంతరం ఉండాలన్నారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన జడ్పిటిసి దంపతులు లలిత శ్రీనివాసులు సుమారు 100 మంది వృద్ధులకు ఏర్పాటుచేసిన నూతన వస్త్రాలను ఈ సందర్భంగా బహుకరించారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి టి ఎస్ రాజు, కోశాధికారి రాజ్పాల్, ముఖ్య సలహాదారులు దాసరి రామారావు, ఉపాధ్యక్షులు శ్యాంబాబు, రాజారత్నం, సహాయ కార్యదర్శి రత్నం రాజు, మనోహర్, దైవ సేవకులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా పోలీసు కార్యాలయంలో..






**నెలవారీ నేరసమీక్షా సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ**

**అనకాపల్లి, పెన్ పవర్, డిసెంబరు 18 :** జిల్లా పోలీసు కార్యాలయంలో నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఐపిఎస్ నిర్వహించారు. దర్యాప్తులో ఉన్న సాధారణ, తీవ్రమైన మరియు ముఖ్యమైన కేసులు, ప్రాపర్టీ కేసులు, పోక్సో యాక్ట్ కేసులు, 174 సి.ఆర్.పి.సి./194 బి. ఎన్. ఎస్. ఎస్. కేసులు, గంజాయి కేసులు మరియు మిస్సింగ్ కేసులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్షించి, ఆయా కేసుల్లో దర్యాప్తు పెండింగులో ఉండడానికి గల కారణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకొని, త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయుటకు పలు సూచనలు చేశారు. అనకాపల్లి, జిల్లా పోలీసు కార్యాలయంలో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. మహిళలు, చిన్నారుల సంబంధిత ఫిర్యాదులపై తక్షణమే స్పదించాలని, పోలీస్ శాఖపై నమ్మకం పెంపొందించేలా సేవలు అందించాలని తెలియజేశారు. మిస్సింగ్ కేసుల చేధన,రోడ్డు ప్రమాదాలు, సైబర్ మోసాలు, చోరీలు, మత్తు పదార్థాల నివారణపై దృష్టి పెట్టండి. పిజిఆర్ఎస్ పిటిషన్లను అధిక ప్రాధాన్యతతో బాధితులకు సత్వర న్యాయం జరిగేలా పరిష్కరించాలన్నారు. రౌడీ షీటర్ అందరి పైన, ప్రత్యేక నిఘా ఉంచి, తరచూ వారికి కౌన్సిలింగ్ ఇస్తూ నేర ప్రవృత్తికి దూరంగా ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

గ్రామ సందర్శనలు చేపట్టాలని పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు నేషనల్ హైవే, ఇతర రోడ్డు మార్గాల్లో విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూ, ఎన్ఫోర్స్మెంట్ కేసులు ఎక్కువ నమోదు చేయాలన్నారు. ప్రజలకు రోడ్డు భద్రతా నియమాల పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపాలి. ప్రధాన కూడళ్ళు, వ్యాపార సముదాయాల వద్ద తప్పక సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి. ఎన్ఫోర్స్మెంట్ వర్క్ పై ప్రత్యేక దృష్టి సారించాలి. విజబుల్ పోలీసింగ్, డ్రంక్%డ% డ్రైవ్, ఈవ్ టీజింగ్, బహిరంగ మద్యపానంపై దృష్టి పెడితే దాదాపు నేరాలు నియంత్రించవచ్చు. ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి ప్రాపర్టీ నేరాల్లో నిందితులను త్వరగా చేధించి, రికవరీ శాతాన్ని పెంచాలి. రాష్ట్ర ప్రభుత్వం గంజాయి నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించిందని ఆ కార్యాచరణ ప్రకారం జిల్లాని గంజాయి రహిత జిల్లాగా మార్చడానికి అందరూ కృషి చేయాలని సూచించారు. గంజాయి కేసులకు సంబంధించి ఫార్వర్డ్ లింక్ మరియు బ్యాక్ వార్డ్ లింకు కనుగొని ముద్దాయిలను అరెస్ట్ చేయాలని సూచించారు. పెండింగ్లో ఉన్న ఎన్ డి పి ఎస్ కేసులలో విచారణ వేగవంతం చేయడానికి ప్రత్యేక టీములను ఏర్పాటు చేశారు. సైబర్ క్రైమ్ నివారణకు చర్యలు తీసుకోవాలని మరియు పెండింగ్లో ఉన్న సైబర్ క్రైమ్ కేసుల విచారణను త్వరిత గతిన చేయాలని చెప్పారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి దర్యాప్తు అధికారులు నేరస్తులను గుర్తించి అరెస్టు చేయాలి. సైబర్ క్రైమ్ గురించి ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలియజేశారు. విచారణ ఇంకా పూర్తికాని కేసులలో విచారణను వేగవంతం చేయాలని, ఛార్జ్ షీట్ త్వరితగతిన వేసి కోర్టు అధికారులతో సమన్వయం చేసి త్వరితగతిన ట్రైల్స్ కి వచ్చేలా చేయాలని అధికారులకు ప్రత్యేకంగా సూచించారు. పోలీస్ సిబ్బంది సంక్షేమం దృష్ట్యా వారి సమస్యలను తెలుసుకుని అధికారులు ఎప్పటికప్పుడు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రతిభ కనబరిచిన 30 మంది అధికారులు మరియు సిబ్బందికి ప్రశంసా పత్రాలు, నగదు చెక్కులతో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం దేవ ప్రసాద్, ఎల్ మోహన్ రావు ,అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ శ్రీమతి ఎం శ్రావణి, పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ, నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ జి.ఆర్.ఆర్.మోహన్, ఎస్.బి డీఎస్పీ బి.అప్పారావు, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఈ శ్రీనువాసులు, ఏ.ఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఇనస్పెక్టర్ లు లక్ష్మణమూర్తి, బాలసూర్యా రావు ,రమేష్ , గఫూర్,టి లక్ష్మి . టి కళ్యాణి ఎస్సైలు ప్రసాద రావు , బి సురేష్ బాబు ,డి వెంకన్న మరియు జిల్లాలోని ఇతర సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.






# అంగరంగ వైభముగా స్వామివారి నిత్య కల్యాణం







**సింహాచలం, పెన్ పవర్, డిసెంబర్ 18 :** దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రముగా విరాజిల్లుతున్న సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామివారి నిత్య కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఆర్జిత సేవల్లో భాగంగా అర్చక స్వాములు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండ పంలో అధిష్టింపజేశారు. నిత్య కళ్యాణములో పాల్గొన్న భక్తుల, గోత్రనామాలతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్ర, బెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాల ప్రక్రియలను కమనీయంగా జరిపించారు. మంత్రపుష్పం, మంగళాశాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. అనంతరముస్వామివారి అంతరాలయ దర్శనం కల్పించారు.

# శ్రీ స్వామివారిని దర్శించుకున్న..



**కేంద్ర రక్షణశాఖ సహాయమంత్రి సంజయ్ సేథ్ దంపతులు**





**సింహాచలం, పెన్ పవర్, డిసెంబర్ 18 :** శ్రీ వరహాలక్ష్మి నరసింహస్వామివారి దేవస్థానం సింహాచలం, బుధవారం సాయంకాలం కేంద్ర రక్షణశాఖ సహాయ మంత్రి, సంజయ్ సేథ్ దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ కార్యనిర్వహణాధికారి వెంద్ర త్రినాధరావు ఆదేశాల మేరకు ఫోటోకాల్ పర్యవేక్షణ అధికారి విక్రమ్ సూర్యనారాయణ స్వాగతం పలికారు. ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి ఎన్ ఆనంద్ కుమార్, డిప్యూటీ కమిషనర్ రాధ, పర్యవేక్షణ అధికారి త్రిమూర్తులు, పిఆర్ఓ నాయుడు ధ్వజస్తంభం వద్ద ఆలయ ప్రధానార్చకులు శ్రీనివాస్ ఆచార్యులు, వేద పండితులు నాదస్వర వేదమంత్రాలతో పూర్ణకుంభ స్వాగతం పలికి, ముందుగా కప్పస్తం ఆలింగనము, తదుపరి స్వామివారి దర్శనము అనంతరము అమ్మవారి వద్ద పూజలు కావించి నాదస్వర వేదమంత్రాలతో వేద ఆశీర్వచనము అనంతరము డిప్యూటీ కమిషనర్ రాధా సింగం ఏ ఈ ఓ ఎన్ ఆనంద్ కుమార్ స్వామివారి ప్రసాదాలు చిత్రపటాన్ని బహుకరించారు వీరితో చిన్నగదిలి తాసిల్దార్ తదితరులు పాల్గొన్నారు .

# క్రికెట్ పోటీల్లో జిల్లా జట్టు విజయం సాధించాలి - సువర్ణ రాజు



**గోపాలపురం, పెన్ పవర్, డిసెంబర్ 18:**మంగళగిరిలో ఈనెల 20వ తేదీన జరిగే అండర్ 19 మహిళ క్రికెట్ పోటీల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జట్టు విజయకేతనం ఎగురవెయ్యాలని జనసేన పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇంచార్జ్ దొడ్డిగర్ల సువర్ణరాజు అన్నారు. దేవరపల్లిలో శిక్షణ పొందుతున్న ఈ మహిళా క్రికెట్ జట్టు సభ్యులను జనసేన పార్టీ నాయకులు బుధవారం కలిశారు. పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి విజయం సాధించి జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని క్రీడాకారులను కోరారు. వారికి మంచి జరగాలని ఆశీర్వదించారు. క్రీడాకారులకు కేఫ్ 96 తరపున ముందు ఏర్పాటు చేశారు. జనసేన నాయకులు పవన్ రాజ్ క్రీడాకారులకు పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన దేవరపల్లి మండల పార్టీ అధ్యక్షులు కాటన్ గణేష్, ఉపాధ్యక్షులు సప్పుటి శివ నాగ ప్రసాద్, బ్యాంక్ ప్రసాద్, ఆకుల వీర్రాజు, దాసరి జ్యువెలర్స్ శేషు, జెకె, రెహ్మద్ ఉల్లా, ఆకుల వీరబాబు, వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజు,ముని,మధు తదితరులు ఉన్నారు.

# నిర్వాసితుల గృహ స్ట్రక్చర్ వ్యాల్యూవేషన్ దగ్గరుండి పరిశీలించిన పిఓ అపూర్వ భరత్

- విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయుల కొరతను పరిష్కరిస్తానన్న పిఓ






**కూనవరం,పెన్ పవర్,డిసెంబర్ 18.**మండలంలోని విద్యావ్యవస్థలో ఉన్న సమస్యలు,పోలవరం నిర్వాసితుల ఇంటి స్ట్రక్చర్ వాల్యువేషన్ పై అనుమానాలను నివృతి చేయడం కోసం ఆకస్మికంగా చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ పర్యటించారు. మండలంలోని కాచవరం గ్రామంలో ఉన్న మండల ప్రజా పరిషత్ పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయుల కొరత గురించి పిల్లల తల్లిదండ్రులతో స్వయంగా మాట్లాడి తెలుసుకున్నారు.ఉపాధ్యాయుల సమస్యను పరిష్కరించడం జరుగుతుందని విద్యార్థుల తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు.పోలవరం ప్రాజెక్టు ముంపుకు మండల కేంద్రంలోని ఇళ్ల యొక్క స్ట్రక్చర్ వ్యాల్యూవేషన్ స్వయంగా పిఓ అపూర్వ భరత్ దగ్గరుండి పరిశీలించారు.ప్రజలతో మాట్లాడుతూ ఇళ్ల స్ట్రక్చర్ వ్యాల్యూవేషన్ లోపాలను మరల రీ సర్వే చేయించడం జరుగుతుందని,సర్వే కానీ వాళ్లకు త్వరలో ఇళ్ల సర్వే చేయించడం జరుగుతుందని అన్నారు.ఇళ్ల సర్వే తో పాటు చెట్లు మరియు ఇతర కట్టడాల యొక్క వ్యాల్యువేషన్ పని కూడా మొదలు పెడతారని తెలిపారు.కోతులగుట్ట లో ఉన్న కేజీబీవీ స్కూల్ పరిసరాలను,పరిశీలించి ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు.పిఓ భరత్ విద్యార్థులతో మమేకమై మీరు ఏదైతే సాధించాలని దృఢ నిశ్చయంతో ఉన్నారో దాన్ని లక్ష్యంగా చేసుకుని ముందుకు సాగాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏ ఎస్ డి సి అంబేద్కర్,డిఈపిఆర్ రవితేజ,ఎంఈఓ 2 లక్ష్మణరావు,పంచాయతీ సెక్రెటరీ పాల్గొన్నారు.

# ఈదరపల్లి చిన్న మంద చర్చి లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



**అమలాపురం రూరల్, పెన్ పవర్,డిసెంబర్ 18:**అమలాపురం ఈదరపల్లిలో చిన్న మందా పాస్టర్ యెహెూషువ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనంద రావు కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్వకొలను తాతాజీ, లింగోలు పండు, ప్రజాప్రతినిధులు పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. పాస్టర్ సలాది జెకర్యా, రెవరెండ్ భరత్ కుమార్ క్రిస్మస్ సందేశం అందించారు. సిస్టర్ కృపా మాధుర్య ,సాల్మన్ నూతన సాంగ్ ఆల్బమ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సుమారు మూడు వేల మంది దైవజనులు పాల్గొన్నారు.

## చింతపుల్ల లారీపై కేసు నమోదు



**జీలుగుమిల్లి ,పెన్ పవర్, డిసెంబర్ 18 :** అనుమతులు లేకుండా చింత పుల్ల లారీపై తరలిస్తుండగా అటవీ శాఖ ఉద్యోగి మరియు కార్పొరేషన్ కి చెందిన సిబ్బంది మంగళవారం రాత్రి లక్ష్మీపురం గ్రామ సమీపంలో ఆపడం జరిగింది .పుల్ల కాంట్రాక్టర్ తో బేరసారాలు చెయ్యగా ఫారెస్ట్ ఉన్నత అధికారులకు ఈ విషయం తెలియడంతో అదే రోజు రాత్రి జంగారెడ్డిగూడెం రేంజ్ కార్యాలయానికి పుల్ల లారీని తీసుకు వెళ్లడం జరిగింది. ఎన్టీఆర్ జిల్లా విసన్నపేట నుండి జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి గ్రామానికి ఈ లారీ వెళుతుంది. సబ్ డి ఎఫ్ ఓ వెంకటసుబ్బయ్య ని వివరణ కోరగా బుధవారం ఏపీ 16 యు 93 58 నెంబర్ గల లారీపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

## ఈదరపల్లి చిన్న మంద చర్చి లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



**అమలాపురం రూరల్, పెన్ పవర్,డిసెంబర్ 18:**అమలాపురం ఈదరపల్లిలో చిన్న మందా పాస్టర్ యెహోషువ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగింది. ముఖ్యఅతిథిగా అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనంద రావు కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కల్వకొలను తాతాజీ, లింగోల్ పండు, ప్రజాప్రతినిధులు పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. పాస్టర్ సలాది జెకర్యా, రెవరెండ్ భరత్ కుమార్ క్రిస్మస్ సందేశం అందించారు. సిస్టర్ కృపా మాధుర్య ,సాల్మన్ నూతన సాంగ్ ఆల్బమ్ రిలీజ్ చేసారు. ఈ కార్యక్రమంలో సుమారు మూడు వేల మంది ప్రజలు అనేక మంది దైవజనులు పాల్గొన్నారు. అనంతరం అందరికీ విందు ఏర్పాటు చేశారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ.



**మండపేట.పెన్ పవర్. డిసెంబర్ 18:**ఇటీవల ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకుని ఆర్థిక సహాయం కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి ధరఖాస్తు చేసుకున్న ఆరుగురి కి రూ.3,21,278/-లు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరు అయ్యాయి. ఈ చెక్కులను బుధవారం మండపేట టిడిపి కార్యాలయంలో రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు , మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవర ప్రకాష్ లు బాధిత కుటుంబాలకు అందజేశారు. వద్లమూరు గ్రామానికి చెందిన గజ్జరపు మంగాయమ్మ కు రూ.35,166/-లు, ఏడిద గ్రామానికి చెందిన నామాల మీనాక్షి కి రూ.37,378/-లు, చింతాకుల వెంకటరమణ కు రూ.65,225/-లు, మాచర గ్రామానికి చెందిన బడుగు పాప కు రూ.77,909/- లు, పాలతోడు గ్రామానికి చెందిన టేకిమూడి సత్యనారాయణ కు రూ.55,600/-లు, మండపేట పట్టణానికి చెందిన గొడితి వీర్రాజు కు రూ.50,000/-లు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరు అయ్యాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ వేగుళ్ళ జోగేశ్వరరావు కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుడాల జయబాబు, చుండ్రు వెంకట్రావు, పిల్లా తాతాలు, గుణ్ణం సాయిబాబ, బొక్కా రామకృష్ణ, పెనుమత్స వెంకటవర్మ రాజు, గొడవర్తి సత్యనారాయణ, గుడిసే సూర్యప్రకాశరావు, తదితర్లు పాల్గొన్నారు.

## విప్లవ నాయకుడు వినోద్ మిశ్రా కార్మిక లోకానికి చేసిన సేవలు ఎనలేనివి: కార్యదర్శి కొసిరెడ్డి .



**ఏలేశ్వరం, పెన్ పవర్, డిసెంబర్ 18:** విప్లవ నాయకుడు వినోద్ మిశ్రా కార్మిక లోకానికి చేసిన సేవలు ఎనలేనివని సిపిఐ ఎంఎల్ వినోద్ మిశ్రా పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొసిరెడ్డి గణేశ్వరరావు అన్నారు. వినోద్ మిశ్రా 26వ వర్ధంతి సందర్భంగా స్థానిక బాలాజీ చౌక్ సెంటర్లో సిపిఐఎంఎల్ వినోద్ మిశ్రా ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి కొసిరెడ్డి గణేశ్వరరావు ఆధ్వర్యంలో సంస్మరణ సభ బుధవారం నిర్వహించారు. తొలుత వినోద్ మిశ్రా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం వినోద్ మిశ్రా పార్టీ శ్రేణులు ర్యాలీగా బయలుదేరి వినోద్ మిశ్రా కాలనీలో ఆయన విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కోసిరెడ్డి గణేశ్వరావు మాట్లాడుతూ సిపిఐఎంఎల్ పార్టీ వ్యవస్థాపకుడు వినోద్ మిశ్రా భౌతికంగా మన మధ్య లేకపోయినా పేద ప్రజల హృదయాల్లో జరస్థాయిగా నిలిచిపోయారన్నారు. బడుగు బలహీన వర్గాల తాడిత పీడిత ప్రజల కోసం విప్లవ బాట పట్టారన్నారు. ఆయన పోరాటాలు ఎవరు మరవ లేమని, సిపిఐ ఎంఎల్ ఉద్యమంలో ప్రధాన నిప్పుల సూర్యుడని వారి ఆశీర్వమే పేదలకు మనోబలం అన్నారు.ఈ కార్యక్రమంలో నాగులపల్లి అర్జునుడు,కందుల క్రాంతి కుమార్,చందక ప్రసాద్, సొముల కుశల,గునాపు సాయి,వంశీ, గుమ్మడి రాజేష్, మాడెం బాబురావు, పందిరి సుబ్బారావు,వడ్డాది గంగా, కాకర అర్జున్,రాజారావు , పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలి-ఎంపీడీవో రామకృష్ణ





**గంగవరం, పెన్ పవర్, డిసెంబర్ 18:**గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రణాళిక లు సిద్ధం చేయాలని ఎంపీడీవో పీజీ రామకృష్ణ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిర పాలన గ్రామాల అభివృద్ధి పై రెండు రోజుల శిక్షణ తరగతులు ముగింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఎంపీపీ కృష్ణారెడ్డి ,జడ్పిటిసి బేబీ రత్నం తదితరులు మాట్లాడుతూ సామాజిక న్యాయం పేదరిక నిర్మూలన స్వయం సమృద్ధితో మౌలిక సదుపాయాల మహిళా స్నేహ పూర్వ క గ్రామాలు తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీనివాసరావు ,వైస్ ఎంపీపీ రామ తులసి ,ఉపాధి హామీ పథకం ఏపీవో ప్రకాష్, వెలుగు ఎపిఎం షణ్ముఖేశ్వరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఏలేశ్వరం పట్టణ బిజెపి బూత్ కమిటీ అధ్యక్షుల నియామకం.







**ఏలేశ్వరం, పెన్ పవర్, డిసెంబర్ 18:** ఏలేశ్వరం పట్టణ బిజెపి బూత్ కమిటీ అధ్యక్షుల నియామక ప్రక్రియ బుధవారం చేపట్టారు. ప్రత్తిపాడు నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ నాయకుడు పైల సుభాష్ చంద్రబోస్ గారి సారధ్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 21వ బూత్ అధ్యక్షుడిగా గంట శివ - అప్పనపాలెం , 22వ బూత్ అధ్యక్షుడిగా కర్రోతు నీల కంతేశ్వరరావు,14వ బూత్ అధ్యక్షుడిగా కర్రోతు జానకి రామయ్య,19వ బూత్ అధ్యక్షుడిగా గెద్ద రామకృష్ణలను నియమించారు. ఈ కార్యక్రమంలో రిటనింగ్ ఆఫీసర్ (ఆర్ ఓ) గా కాకినాడ జిల్లా భారతీయ జనతా పార్టీ ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు బూత్ అధ్యక్షులకు ఆర్డర్ జారీ చేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో చింతల పాండవులు, పైల ప్రసాద్, కర్రోతు నీల కంతేశ్వరరావు , నండ పార్ధ సారథి , బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైసీపీ ని వీడిన చెల్లూరు పంచాయితీ వార్డు మెంబర్లు.



**మండపేట. పెన్ పవర్.డిసెంబర్ 18:**రాయవరం మండలం చెల్లూరు గ్రామపంచాయితీ 4వ వార్డు పంచాయితీ సభ్యులు లంకలపల్లి సూర్యకుమారి శ్రీనివాస్, 7వ వార్డు మెంబరు దొండపాటి మేరికమల లక్ష్మణరావు, 10వ వార్డు మెంబరు బొక్కా సత్యనారాయణ, 15వ వార్డు మెంబరు కుమారి కురుపూడి లీలాదేవి లు వైసీపీకి రాజీనామా చేశారు . చెల్లూరు టీడీపీ గ్రామశాఖ అధ్యక్షులు చుండ్రు రాజు ఆధ్వర్యంలో బుధవారం మండపేట తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో శాసన సభ్యులు వేగుళ్ళ జోగేశ్వరరావు సమక్షంలో తెలుగుదేశంపార్టీలోకి చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే వేగుళ్ళ టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు. అనంతరం చెల్లూరు గ్రామానికి చెందిన కురుపూడి రాజు కు జ్యోతిష్య శిరోమణి అవార్డు వచ్చిన సంధర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ళ ఆయన్ను దుశ్శాలువాతో సత్కరించి, అవార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవు శ్రీను, మోరంపూడి రాజ్ కుమార్, కొప్పిశెట్టి సత్యనారాయణ (డ్రైవర్ శ్రీను), కురుపూడి నాగరాజు, దార్ల రమేష్, కాదా శ్రీను, బవిరిశెట్టి అప్పారావు, పసల విద్యాధర్, కొమ్ము సత్తిబాబు, తదితర్లు పాల్గొన్నారు.

## గుర్తేడు రెవెన్యూ సదస్సుకు పల్లాల



**వై రామవరం, పెన్ పవర్,డిసెంబర్ 18 :** మండలంలోని గుర్తెడులో బుధవారం జరిగిన గ్రామ రెవెన్యూ సదస్సుకు మండల టిడిపి అధ్యక్షుడు పల్లాల వెంకటరమణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరైనట్లు తెలిపారు.

ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి పల్లాల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగే గ్రామ రెవెన్యూ సదస్సులను ఉపయోగించుకొని గిరిజన రైతులు అపరిస్కృతంగా ఉన్న భూ సమస్యలను పరిష్కరించుకోవచ్చు అని అన్నారు. వారసత్వంగా ఉన్న భూములను మ్యూ టేషన్ ద్వారా పంపకాలు చేసుకోవచ్చు అని అన్నారు. గత ప్రభుత్వం ఆధ్వర్యంలో పెట్టిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను కూటమి ప్రభుత్వం రద్దు చేసిందని తెలిపారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రమణారెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో మండల డిప్యూటీ తాహసిల్దార్ కే.సుధాకరరావు, గుర్తేడు సర్పంచ్ జి.దుష్యంతుడు, విఆర్ఓ భాను ప్రకాష్, రైతులు పాల్గొన్నారని తెలిపారు.

## మానవత్వం చాటుతున్న మానవతా సభ్యులు



**గోపాలపురం,పెన్ పవర్, డిసెంబర్ 18:**మండల మానవతా స్వచ్ఛంద సేవ సంస్థ సహాయ సహకారాల పరంపర కొనసాగుతూనే ఉంది. మండల వ్యాప్తంగా వివిధ సమస్యల భారిన పడిన బాధితులకు మేము ఉన్నాం అంటూ భరోసా కల్పిస్తూ సంస్థ తరపున ప్రతినిత్యం ఎవరికో ఒకరికి ఏదో ఒక రూపంలో సహాయం అందిస్తూనే ఉన్నారు. సహాయ కార్యక్రమంలో భాగంగా పెద్దాపురం గ్రామానికి చెందిన ఎస్.లక్ష్మి అనే మహిళ కాళ్లకు శస్త్ర చికిత్స చేయించుకొని ఇంటి వద్ద ఉంటున్నారు. విషయం తెలుసుకున్న సంస్థ సభ్యులు ఆమె మందుల ఖర్చు నిమిత్తం 3000 రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించారు. అలాగే తొక్కిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన కే. బోధమ్మ అనే బాధితురాలకు నాలుగు వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ మండల శాఖ చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు, కోశాధికారి గెడా జోగింద్ర ప్రసాద్, కొయ్య నాగరాజు, తదితరులు ఉన్నారు.

## జనసేన పార్టీ అధికార ప్రతినిధిగా గడ్డమణుగు రవికుమార్



**జీలుగుమిల్లి ,పెన్ పవర్, డిసెంబర్ 18 :**పోలవరం నియోజకవర్గంలో జనసేన పార్టీ బలపడటానికి అహర్నిశలు శ్రమించిన ఏలూరు జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్ ని పోలవరం నియోజకవర్గం జనసేన పార్టీ అధికార ప్రతినిధిగా నియమించినట్లు పోలవరం ఎమ్మెల్యే సిరి బాలరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు .పార్టీ కోసం ఆయన పడిన కష్టాన్ని చూసి నియోజకవర్గ అధికార ప్రతి నిధిగా నియమించడం జరిగిందని తెలిపారు. జనసేన పార్టీలో పనిచేసిన ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. గడ్డ మణుగు రవికుమార్ మాట్లాడుతూ పోలవరం నియోజకవర్గం జనసేన పార్టీ అధికార ప్రతినిధిగా నియమించినందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి, జిల్లా ఇన్చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ కి, పోలవరం ఎమ్మెల్యే సిరి బాలరాజు కి అభినందనలు తెలిపారు. నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని తెలిపారు. అధికార ప్రతినిధిగా నియమించడంతో నియోజకవర్గంలోని జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు అభినందనలు తెలిపారు.

# మైదాన ప్రాంత గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- ఐ టి డి ఏ ప్రాజెక్ట్ అధికారి సింహాచలం



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, డిసెంబర్ 18:** మైదాన ప్రాంతంలోని, సబ్ ప్లాన్ ఏరియాలో ఉన్న గిరిజనులు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం అన్నారు. బుధవారం స్థానిక ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి చాంబర్లో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ తో, సహాయక గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో, వెలుగు ఎపిడితో, డిపిఎంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని గిరిజనులు అభివృద్ధి చెందే విధంగా వందన్ వికాస కేంద్రాల ద్వారా అభివృద్ధి చేయుటకు ప్రాజెక్ట్ అధికారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని మైదాన ప్రాంతంలో గిరిజనులు, సబ్ ప్లాన్ ఏరియా లో ఉన్నటువంటి గిరిజనులను ఆర్థికంగా అభివృద్ధి చేసే విధంగా మైదాన ప్రాంతంలో ఉన్న అన్ని గిరిజనుల తెగలకు సంబంధించిన ఆధార్ కార్డులతో సహా జాబితా తయారుచేసి సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మైదాన ప్రాంతంలో ఉన్నటువంటి గిరిజనులు ప్రస్తుతం ఏఏ పనులు చేసుకుంటున్నది ఆరా తీశారు. మైదాన ప్రాంతంలో ఉన్నటువంటి గిరిజనులు వందన్ వికాస కేంద్రాల ద్వారా మినీ పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే విధంగా ప్రోత్సహించడం జరుగుతుందని ఆయన అన్నారు, మైదాన ప్రాంతంలో ఉన్నటువంటి సబ్ ప్లాన్ గిరిజనులు జీడి పిక్కల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయుటకు తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎంతమంది ఎరుకల, ఎంతమంది చెంచులు, ఎంతమంది యానాద కులాలకు సంబంధించిన గిరిజనులు ఉన్నది మండలాల వారీగా ప్రాజెక్ట్ అధికారి ఆరా తీశారు. మైదాన ప్రాంతంలో ఉన్నటువంటి గిరిజనులకు ఐటీడీఏ ద్వారా అభివృద్ధి చేసే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు. వందన్ వికాస కేంద్రాల ద్వారా 300 మందిని ఒక గ్రూపుగా ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.మైదాన ప్రాంతంలోని గిరిజనులు అభివృద్ధి చెందే విధంగా వెలుగు డిపిఎం పరమేశ్వరరావును నోడల్ అధికారిగా నియమించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతి, వెలుగు ఏపీ డి దేగలయ్య, సహాయక గిరిజన సంక్షేమ శాఖ అధికారులు రామ తులసి, కృష్ణమోహన్, నాగజ్యోతి, డిపిఎం అపర్ణ, వెలుగు యాంకర్ పర్సన్ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల నివారణ పై అవగాహన సదస్సు



**జగ్గంపేట, పెన్ పవర్, డిసెంబర్ 18 :** జగ్గంపేట దేవి ఫిషరీష్ యూనిట్ లో బుధవారం సైబర్ నేరాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు జగ్గంపేట సిఐ వై ఆర్ కె శ్రీనివాస్, జగ్గంపేట ఎస్సై టి.రఘునాథరావు, గండేపల్లి ఎస్సై యువి శివనాగబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ సైబర్ నేరాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. మహిళా రక్షక్ పై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై తీసుకోవలసిన జాగ్రత్తలను వీడియోలు రూపంలో ప్రదర్శించారు. ఒరియా మహిళలు అభద్రతా భావానికి లోను కావాల్సిన అవసరం లేదని వారికి పోలీసులు రక్షణగా ఉన్నామని స్పష్టం చేశారు. ఎవరైనా వేధింపులకు గురి చేస్తే 100, 9440796529 ఫోన్ నెంబర్లకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవి ఫిషరీస్ జనరల్ మేనేజర్ కిరణ్ కుమార్ రెడ్డి, ఆకాశ్, సురేష్, షర్మిళ, సిబ్బంది పాల్గొన్నారు.

## తలసేమియా వ్యాధి గ్రస్తుల కోసం రక్తదానం



**కుక్కునూరు,పెన్ పవర్, డిసెంబర్ 18 :**లారీ డ్రైవర్స్ అసోషియేషన్ వార్షికోత్సవం సందర్భంగా తలసేమియా వ్యాధి గ్రస్తుల కోసం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం విజయవంతం అయ్యిందని సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ అన్నారు. బుధవారం నాడు లారీ యూనియన్ వార్షికోత్సవం సందర్భంగా కుక్కునూరు సిఐటియు యూనియన్ కార్యాలయం వద్ద మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.ఈ శిబిరం లో మొత్తం 40 మంది రక్తదానం చేశారని సీఐటియు కార్యదర్శి యర్ణం సాయికిరణ్ తెలిపారు.అన్ని దానాల్లో కళ్ళ రక్తదానం గొప్పదని అటువంటి కార్యక్రమం చేయడం చాల గొప్ప విషయం అని అన్నారు.మారేడుబాకా పంచాయితీ విఆర్వో గా పని చేస్తున్న సాయి 17వ సారి రక్తదానం చేయటం పట్ల సాయి నీవు గ్రేట్ అయ్యా..అంటూ పలువురు అతన్ని అభినందించారు.ఈ శిబిరంలో టీడీపీ మండల అధ్యక్షుడు ములిశెట్టి నాగు తలసేమియా పిల్లలకు భరోసా కోసం రూ. 5000 లను ఆర్థిక సహకారం చేశారు.ఈ కార్యక్రమంలో లారీ యూనియన్ కార్యదర్శి వలిపాషా,టీడీపీ మండల అధ్యక్షులు ములిశెట్టి నాగు,కుక్కునూరు మేజర్ పంచాయితీ సర్పంచ్ రావు మీన,సీపీఎం మండల కార్యదర్శి బియ్యన శ్రీను, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యర్రంశెట్టి నాగేంద్రరావు,టీడీపీ సీనియర్ నాయకులు కోటగిరి సత్యనారాయణ,లారీ యూనియన్ నాయకులు గంజి రాంబాబు,ఓగిరాల నాగరాజు,కట్టబోయిన మల్లేష్, వైసీపీ నాయకులు మల్లెల చంటినాయుడు,రాము,టీడీపీ నాయకులు అంగిరేకుల బాలాజీ,సిఐటియు నాయకులు పోచారపు వెంకటేశ్వర్లు,తిరోజుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## జలశక్తి పనులను పరిశీలించిన సర్పంచ్



**ముమ్మిడివరం, పెన్ పవర్ ,డిసెంబర్ 18:**స్థానిక మండలం చెయ్యేరు గున్నేపల్లి లో సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు జలశక్తి ద్వారా జరుగుతున్న భూగర్భ జలాల పనులను సర్పంచ్ గొలకోటి దొరబాబు పరిశీలించారు. ఈ సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు జలశక్తి వారు బోరు వేయడం వలన నీటి వనరులు ఎంత శాతం వున్నాయో తెలుసు కోవచ్చు అన్నారు.దీని వలన గ్రామంలో మంచి నీరు సమస్య తీరుతుందన్నారు . ఈ కార్యక్రమంలో యాళ్ల ఉదయ్, గొలకోటి తాతాజీ,సకిలే వెంకటేశ్వరరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వి.శేఖర్ మరియు జియోగ్రాఫికల్ ఇంజనీర్ జె.సామ్యూల్ పాల్గొన్నారు

## పులియ పెట్టిన బెల్లం ఊట ధ్వంసం



**కుక్కునూరు,పెన్ పవర్,డిసెంబర్ 18:** మండలంలోని సీతారామ నగరం గ్రామ శివారులో కిన్నెరసాని నది ఒడ్డున గుట్టు చప్పుడు కాకుండా నాటుసారా తయారీ చేస్తున్న స్థావరాలపై కుక్కునూరు సిఐ రమేష్ బాబు తన సిబ్బందితో దాడి చేసి సుమారు 1000 లీటర్ల పులియ పెట్టిన బెల్లం ఊటను ధ్వంసం చేశామని,10 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నామని సిఐ రమేష్ బాబు తెలిపారు.కుక్కునూరు, వెలేరుపాడు ఏజెన్సీ ప్రాంతాలలో ప్రజల యొక్క ఆరోగ్యానికి హాని కలిగించే నాటు సారా తయారు చేసినా, అమ్మకాలు జరిపినా వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కుకునూరు సిఐ రమేష్ బాబు హెచ్చరించారు.

## ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్,కు ఘనంగా సన్మానం





- నూతన వధూవరులను ఆశీర్వదించిన జమాల్ ఖాన్

**వి.ఆర్.పురం పెన్.పవర్.డిసెంబర్.18.** మండలంలోని వడ్డిగూడెం గ్రామంలో బుధవారం భవాని మాల ధార భక్తులు చింతూరు ఆయుర్వేద వైద్యులు జె.కె.సి.టీ.ట్రస్ట్ చైర్మన్ జమాల్ ఖాన్ ముఖ్యఅతిథిగా ఆహ్వానించి పూల మాలలు వేసి సన్మానించి అభిమానాన్ని చాటుకున్నారు.అనంతరం నూతన వధూవరులైన బొడ్డు రవికుమార్ పూజిత నవ దంపతులను జమాల్,ఖాన్ ఆశీర్వదించి,కానుకగా ఐదువేల రూపాయలను అందజేశారు. వికలాంగుల సంఘం అధ్యక్షులు పెట్టా హరిబాబు శాలువా తో జమాల్ ఖాన్,ను సన్మానించారు.ఈ సందర్భంగా మాజీ జడ్.పి.టి.సి.ముత్యాల రామారావు మాట్లాడుతూ భవాని భక్తుల ఆహ్వానం మేరకు జమాల్ ఖాన్ తమ గ్రామానికి వచ్చి భక్తులను కలిసి చిరు కానుకను స్వీకరించినందుకు సంతోషం వ్యక్తం చేశారు.అనంతరం జమాల్ ఖాన్ మాట్లాడుతూ కుల మతాలకు భిన్నంగా అందరి దైవం ఒకటేనని అందరూ కలిసి మెలిసి సోదర భావంతో మెలగాలని కుల మతాలు వేరైనా అందరిలో ఆదైవం దాగి ఉందన్నారు.మత సామరస్యంతో మనుషులు కలిసినప్పుడే సుఖ సంతోషాలు వెల్లువిరుస్తాయన్నారు.యువత చెడు అలవాట్ల లకు దూరంగా ఉండాలని మత్తు పదార్థాలు విడనాడి మంచి ఆరోగ్య వంతులుగా ఉండాలని,మాలాధారణ సమయంలో ఎంత నిష్టతో ఉన్నారో మాల తీసిన తర్వాత కూడా అదే మంచి క్రమ శిక్షణతో ఉండాలని,భక్తులను కోరారు.ఈ కార్యక్రమంలో సరఫ్,రాజు అలీ,ముత్యాల శంకర్,మల్లికార్జునరావు,సవలం రాజు,ముత్యాల శ్రీరామ్, భవాని భక్తుల గురుస్వామి ముత్యాల శంకర్,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు అధికారులు ప్రజా ప్రతినిధులు సమన్వయంతో ప్రణాళికలు చేయాలి




-ట్రైనింగ్ సెంటర్ అబ్జర్వర్ ఎం. చక్రపాణి

**ఏలూరు డిసెంబర్ 18 పెన్ పవర్ :** గ్రామపంచాయతీ అభివృద్ధి లక్ష్యాలు సాధనకు అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంగా ప్రణాళికలు చేయాలని సామర్లకోట ట్రైనింగ్ సెంటర్ అబ్జర్వర్ ఎం. చక్రపాణి సూచించారు. భీమడోలు మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక సుస్థిర లక్ష్యాలు, గ్రామాల అభివృద్ధిపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాలు బుధవారం ముగిసాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సమర్థవంతమైన సుస్థిరమైన పాలన అభివృద్ధి కోసం అవగాహన సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. స్థానిక ప్రాధాన్యతను గుర్తించి ప్రజల భాగస్వామ్యాన్ని నిర్ధారించాలని, పేదరిక నిర్మూలన, ఆరోగ్యం, విద్య, లింగ సమానత్వం, పర్యావరణ సుస్థిరత వంటి లక్ష్యాలపై సిబ్బందికి, ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మండలంలోని గ్రామ పంచాయతీల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి సిహెచ్ పద్మావతి దేవి, కోర్స్ డైరెక్టర్, అసిస్టెంట్ కోర్స్ డైరెక్టర్ ఏ సుందరి, పిఓటిలు బి సూర్యచంద్రరావు, పంచాయతీరాజ్ ఏఈ పి సుబ్రహ్మణ్యం, ఆర్డబ్ల్యూఎస్ ఏ ఇ కే కిషోర్, ఎం పి హెచ్ ఓ రత్న కుమారి, ఏపీఎం లు, తదితరులు పాల్గొన్నారు

## ఆర్.టి.సి కార్మికుల పరిష్కరిస్తా

### -విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు



**ఏలూరు డిసెంబర్ 18 పెన్ పవర్** :ఆర్.టి.సి కార్మికుల సమస్యలు పరిష్కరిస్తానని విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు అన్నారు. బుధవారం ఎన్ఎంయు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.
విజయవాడ లోని జోనల్ ఛాంబర్ నందు జోనల్ చైర్మన్ శ్రీ రెడ్డి అప్పల నాయుడును మర్యాదపూర్వకంగా కలిసిఎన్ఎంయు,జై భీమ్ సంఘాల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.తొలుత జోనల్ చైర్మన్ రెడ్డి అప్పల నాయుడుని భారీ గజమాలలతో ఘనంగా సత్కరించారు.అనంతరం విజయవాడలోని అంబేద్కర్ భవన్లో నూతనంగా ఏర్పడిన జోనల్ కమిటీ ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్ పోర్ట్ డిపార్ట్మెంట్ జై భీమ్ అసోసియేషన్ ని రాష్ట్ర కార్యవర్గం జోనల్ చైర్మన్ తో పరిచయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ కమిటీకి అధ్యక్షులుగా కొత్తపల్లి బాబురావు (కండక్టర్ ఏలూరు డిపో), కార్యదర్శిగా నక్కా రామారావు (కండక్టర్ అమలాపురం డిపో), ట్రెజరర్ సి.హెచ్.రామారావు కండక్టర్ రాజమండ్రి డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎస్.కె.ఎన్. మీరా తిరువూరు డిపో ఏకపక్షంగా ఎన్నికయ్యారు.వీరికి జోనల్ చైర్మన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆర్టీసీ కార్మికుల సమస్యలపై జోనల్ చైర్మన్ కీ మెమోరండం ఇవ్వడం జరిగినది.వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కారం అయ్యేలా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు.జోనల్ చైర్మన్ నీ కలిసిన వారిలో %చీ=% జిల్లా కృష్ణాజిల్లా, ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా, తూర్పుగోదావరి జిల్లా, కాకినాడ, కోనసీమ జిల్లాల నాయకులు ఉన్నారు.ఈ కార్యక్రమంలో జై భీమ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ప్రత్తిపాటి కిరణ్ బుజ్జి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. వి.ఎస్ఎస్ నారాయణ, రాష్ట్ర ప్రచార కార్యదర్శి, ఎం జయ రాజు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు
బి నాగరాజు నాయక్ ,
ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి
టి వి జి రెడ్డి, ఎన్ఎంయు జోనల్ సెక్రటరీ అడపా వెంకట రామారావు, ప్రెసిడెంట్ డి ఎం ఆర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయం ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన




**గంగవరం ,పెన్ పవర్, డిసెంబర్ 18:** ఈ నెల 11 న విశాఖపట్నం లో జివిఎంసి మీటింగ్ లో జీవీఎంసీ కౌన్సిల్ మెంబెర్ అయిన కార్పొరేటర్ కాకి గోవిందా రెడ్డి గ్రామ వార్డ్ సచివాలయం ఎంప్లాయిస్ మీద చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ బుధవారం మండలంలోని సచివాలయం ఉద్యోగులు గంగవరం మండల పరిషత్ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. కాకి గోవిందా రెడ్డి గా భేషరతుగా క్షమాపణ చెప్పాలని అనుచిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అల్లూరి జిల్లా గ్రామ సచివాలయం ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ పిలుపుమేరకు గంగవరం మండల గ్రామ సచివాలయం ఉద్యోగుల అధ్యక్షుడు చవలం బాలు దొర , వైస్ ప్రెసిడెంట్ మడకం దొరబాబు, జనరల్ సెక్రటరీ కారం శివ గణేష్ ఆధ్వర్యం లో గంగవరం మండల సచివాలయం ఉద్యోగులు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన పలువురు సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

# జనవరి నుంచి పెరగనున్న రిజిస్ట్రేషన్ చార్జీలు




**విజయవాడ, డిసెంబర్ 18, పెన్ పవర్:** మూలిగే నక్క మీద తాటికాయలా అసలే అంతంత మాత్రంగా ఉంటోన్న ఏపీ రియల్ ఎస్టేట్ లావాదేవీలపై మరో భారం పడనుంది. 1నుంచి కొత్త రిజిస్ట్రేషన్ విలువలను అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధం అవుతోంది. వైసీపీ హయంలో 2022లో రిజిస్ట్రేషన్ విలువలను భారీగా పెంచేశారు. మార్కెట్ విలువకు, బహిరంగ మార్కెట్ ధరలకు పెద్దగా వ్యత్యాసం లేనంతగా ఈ ధరలు చేరుకున్నాయి.దీంతో గత రెండున్నరేళ్లుగా రియల్ ఎస్టేట్ లావాదేవీలు తగ్గిపోయాయి.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆదాయాన్ని ఆర్జించే శాఖల విషయంలో గత ప్రభుత్వ బాటలోనే సాగుతోంది. రిజిస్ట్రేషన్ విలువల సవరణ కోసం రాష్ట్రంలోని అన్ని జిల్లా శాఖల నుంచి ప్రతిపాదనలు సేకరిస్తున్నారు. రిజిస్ట్రేషన్ విలువ పెంచాలని శాఖాపరమైన సమావేశాల్లో ప్రకటించారు. ఈ మేరకు జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తాజా నిర్ణయంతో ఈ ఏడాది డిసెంబర్లోగా రిజిస్ట్రేషన్లు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. ప్రభుత్వ నిర్ణయంతో జనవరి 1వ తేదీ నుంచి ఏపీలో కొత్త రిజిస్ట్రేషన్ విలువలు అమ ల్లోకి రాబోతున్నాయి.ఈ దఫా పట్టణాలు, గ్రామాల్లో ఒకేసారి కొత్త విలువలు అమల్లోకి తీసుకు రావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆయా ప్రాంతాల అభివృద్ధి, ఇతర అంశాల ప్రాతిపదికగా ప్రసుత్తం ఉన్న దానిపై 10% నుంచి 15% వరకు విలువలు పెరిగే అవకాశం ఉంది.సాధారణంగా ప్రభుత్వ లెక్కల్లో ఉండే భూమి విలువకు బహిరంగ మార్కెట్లో ఉండే విలువకు వ్యత్యాసం ఉంటుంది. ఈ విధానంలో భూమి కొనుగోలు చేసే వారికి తక్కువ ధరకు నివాస భూమి లభించడంతో పాటు అమ్మే వారికి లాభసాటిగా ఉండేది. ఈ విధానంలో ఆదాయాన్ని కోల్పోతున్నామని గుర్తించిన ప్రభుత్వం రిజిస్ట్రేషన్ విలువలను పెంచుకుంటూ పోతోంది. రాష్ట్ర విభజన తర్వాత 2014 నుంచి బహిరంగ మార్కెట్ విలువలతో సంబంధం లేకుండా రిజిస్ట్రేషన్ విలువను ప్రభుత్వాలు పెంచుకుంటూ వచ్చాయి. దీని వల్ల రిజిస్ట్రేషన్ల సంఖ్య మాటెలా ఉన్నా ప్రభుత్వానికి మాత్రం భారీగా ఆదాయం సమకూరింది.అపార్ట్మెంట్లకైతే భూమి విలువతో పాటు చదరపు అడుగుల్లో నిర్మాణ విలువను కూడా లెక్కిస్తారు. ఈ విధానంలో ఫ్లాట్ల ధరలకు కూడా రెక్కలు వచ్చాయి. అన్డివైడెడ్ షేర్లో కొనుగోలు దారుడికి లభించే వాటాతో పాటు నిర్మాణం జరిగిన భూమికి కూడా రిజిస్ట్రేషన్ ఫీజును చెల్లించాలి. ఉదాహరణకు విజయవాడలో 2వేల చదరపు అడుగుల ఫ్లాట్కు ప్రభుత్వ లెక్కల్లో రూ.75లక్షల నుంచి కోటి రుపాయల ఖరీదు చేస్తే అందులో దాదాపు రూ.6 నుంచి రూ.10 లక్షల స్టాంప్ డ్యూటీ చెల్లించాల్సి ఉంటుంది. బహిరంగ మార్కెట్లో సదరు ఫ్లాట్ విలువ కోటి నుంచి కోటిన్నర వరకు ఉండొచ్చు.మౌలిక సదుపాయాలు, అభివృద్ధితో సంబంధం లేకుండా ఎడాపెడా ధరలను ఖరారు చేసే విధానాలు రాష్ట్ర విభజన తర్వాత ప్రభుత్వాలు అనుసరిస్తున్నాయి. దీని వల్ల ఏపీలో రియల్ ఎస్టేట్ మార్కెట్లు డీలా పడుతున్నాయి. జిల్లాల వారీగా జాయింట్ కలెక్టర్ పర్యవేక్షణలో భూముల ధరల్ని ఖరారు చేసేలా మార్గదర్శకాలు జారీ చేశారు.విలువల సవరణ ప్రతిపాదనలకు జిల్లా కమిటీల ఆమోదం తెలిపిన తర్వాత ఈ నెల 20న సబ్-రిజి స్ట్రార్ కార్యాలయాల నోటీసు బోర్డుల్లో కొత్త ధరల ప్రజలకు అందుబాటులో ఉంచుతారు. ఈ నెల 24వ వరకు అభ్యంతరాలు/సలహాలు, సూచనలు స్వీకరిస్తారు. అభ్యంతరాల

పరిశీలన ఈ నెల 27వ తేదీ వరకు జరుగుతుంది.2025 జనవరి 1 నుంచి కొత్త రిజిస్ట్రేషన్ విలువలు అమలు చేసేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని జిల్లా రిజిస్ట్రార్లను ఆదేశిస్తూ రాష్ట్ర రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ ఐజీ శేషగిరిబాబు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ మార్గదర్శకా లకు అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను ఆదేశించారు. తాజా నిర్ణయంతో ప్రస్తుత ధరలపై 10 నుంచి 15శాతం వరకు ధరలు పెరుగుతాయని అంచనా వేస్తున్నారు.

# స్టెల్లా షిప్ లో 1320 టన్నుల పీజీఎస్ బియ్యం



**కాకినాడ, డిసెంబర్ 18, పెన్ పవర్:** కాకినాడ పోర్టులోని స్టెల్లా నౌకలో 1320 టన్నుల పీడీఎస్ బియ్యం ఉన్నట్లు నిర్ధారించామని కలెక్టర్ షాన్ మోహన్ తెలిపారు. పోర్టులో ఇంకా 12 వేల టన్నుల బియ్యం లోడ్ చేయాల్సిన ఉందన్నారు. వీటిలో పీడీఎస్ బియ్యం లేవని నిర్ధారించాకే లోడింగ్కు అనుమతిస్తామన్నారు.కాకినాడ పోర్టు నుంచి రేషన్ బియ్యం అక్రమ రవాణా వ్యవహారంపై కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ కీలక ప్రకటన చేశారు. స్టెల్లా నౌకలో 1320 టన్నుల పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించామన్నారు. గత 29న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కాకినాడ పోర్టును పరిశీలించారు. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, అధికారులతో పీడీఎస్ బియ్యం ఉన్న స్టెల్లా నౌక పరిశీలించారు. ఈ వ్యవహారం సంచలనం అవ్వడంతో రేషన్ బియ్యం అక్రమ రవాణాపై రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. దీంతో అధికారులు రంగంలోకి దిగారు.కాకినాడ పోర్టు రేషన్ బియ్యం అక్రమ రవాణాపై కలెక్టర్ షాన్ మోహన్ మంగళవారం మీడియాతో మాట్లాడారు. గత నెలలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్టెల్లా నౌకను పరిశీలించిన అనంతరం 5 విభాగాల అధికారులు బృందం ఏర్పాటు చేశామన్నారు. ఈ బృందం 12 గంటల పాటు స్టెల్లా షిప్లోని 5 కంపార్ట్మెంట్లలో తనిఖీలు నిర్వహించింది. మొత్తం 12శాంపిల్స్ సేకరించారు. ఈ షిప్లో దాదాపు 4 వేల టన్నుల బియ్యం రవాణా అవుతున్నాయన్నారు.

వీటిలో 1,320 టన్నుల పీడీఎస్ బియ్యం ఉన్నట్టు నిర్ధరించామన్నారు. సత్యం బాలాజీ రైస్ ఇండస్ట్రీస్ బియ్యం ఎగుమతి చేస్తున్నట్టు విచారణలో తేలిందన్నారు. వాళ్లు ఎక్కడి నుంచి బియ్యం తీసుకొచ్చారు, ఎక్కడ నిల్వ చేశారు అనే దానిపై సమగ్ర దర్యాప్తు జరుగుతోందన్నారు.కాకినాడ పోర్టులోని స్టెల్లా నౌకలో 1,320 టన్నుల రేషన్ బియ్యాన్ని అన్లోడ్ చేయించి సీజ్ చేస్తామని కలెక్టర్ షాన్ మోహన్ ప్రకటించారు. పోర్టులో ఇంకా 12 వేల టన్నుల బియ్యం లోడ్ చేయాల్సిన ఉందన్నారు. వీటిలో పీడీఎస్ బియ్యం లేవని నిర్ధారించాకే లోడింగ్కు అనుమతిస్తామన్నారు. కాకినాడ యాంకరేజ్ పోర్టు, డీప్ సీ వాటర్ పోర్టులో కూడా మరో చెక్పోస్టు ఏర్పాటు చేశామన్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా నిఘా పెట్టామన్నారు. ఒక్క గ్రాము పీడీఎస్ బియ్యం కూడా దేశం దాటకుండా పటిష్ఠ చర్యలు తీసుకుంటామన్నారు. స్టెల్లా షిప్ను ఎప్పుడు విడుదల చేయాలనే దానిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు తీవ్రంగా పయత్నాలు చేస్తున్న జిల్లా యంత్రాంగం.. క్రమంగా అక్రమార్కులపై కఠినంగా వ్యవహరిస్తోంది. అందులో భాగంగా తొలుత స్టెల్లా నౌకలోని బియ్యం పైనే దృష్టి సారించింది. ఇక్కడ అధికారుల తనిఖీలు, వెల్లడైన అంశాలపై.. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్, జేసీ రాహుల్ మీనా, ఎస్పీ ఎస్పీ విక్రంత్ పాటిల్ మీడియాకు వివరాలు అందజేశారు.ప్రజలకు చెందాల్సిన పీడీఎస్ బియ్యాన్ని విదేశాలకు ఎగుమతి చేస్తూ కోట్లు ఆర్జిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేక బృందం ఏర్పాటు చేయగా.. అనుమానాస్పద ప్రాంతాల్లో నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నారు. డిప్యూటీ సీఎం తనిఖీల సమయంలో స్టెల్లా నౌకలో 640 టన్నుల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. దాంతో.. పూర్తిగా నౌకను పరిశీలించి, తనిఖీలు నిర్వహించేందుకు ఐదు ప్రభుత్వ శాఖలకు చెందిన బృందాలు స్టెల్లా షిప్ లో 12 గంటల పాటు తనిఖీలు నిర్వహించాయి. అందులో.. 4,000 టన్నుల బియ్యాన్ని గుర్తించగా.. వాటి నుంచి శాంపిల్స్ సేకరించి ప్రభుత్వ ల్యాబ్ లకు పంపించారు. అందులో ముందుగా గుర్తించిన 640 టన్నుల రేషన్ బియ్యంతో పాటు అదనంగా మరో 680 టన్నుల రేషన్ బియ్యాన్ని గుర్తించినట్లు కలెక్టర్ వెల్లడించారు.నిజాయితీగా రైస్ బిజినెస్ చేసే వారికి ప్రభుత్వం నుంచి మద్దతు ఉంటుందన్నారు. వ్యాపారులు, కూలీలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ షాన్ మోహన్ తెలిపారు.నవంబర్ 27న కాకినాడ పోర్టులో స్టెల్లా షిప్లో 640 టన్నుల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. కాకినాడ జిల్లా కలెక్టర్ సగిలి షాన్ మోహన్ పోర్టులోకి వెళ్లి పరిశీలించారు. ఆయన అధికారికంగానే 640 టన్నుల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ప్రకటించారు. ఈ విషయం తెలుసుకున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నవంబర్ 29న కాకినాడ వచ్చారు. ఆయనతో పాటు సివిల్ సప్లై మంత్రి నాదెండ్ల మనోహర్ను కూడా తీసుకొచ్చారు. సౌత్ ఆఫ్రికాకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్న స్టెల్లా ఎల్ పనమా షిప్ను సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు.

# మళ్లీ పాత బాబు...

**గుంటూరు, డిసెంబర్ 18, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాను చెప్పినట్లే చేస్తున్నారు. 1995 నాటి ముఖ్యమంత్రిని చూస్తారన్నారు. అదే ఇప్పుడు చేసి చూపిస్తున్నారు. ఆకస్మిక తనిఖీలంటూ లేవు కానీ, నిరంతరం సమీక్షలు,కాన్ఫరెన్స్ లతో కాలక్షేపం చేస్తూ తాను అనుకున్న పనులను మాత్రమే ముందుకు తీసుకెళుతున్నారు. గతంలో మాదిరిగానే ముఖ్యమంత్రి కార్యాలయానిదే ఇప్పుడు మళ్లీ పైచేయి అయింది. గత వైసీపీ ప్రభుత్వంలో సీఎంవో వల్లనే అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అనేక రకాలైన విమర్శలను ఎదుర్కొనాల్సి వచ్చింది. ఎవరినీ కలవకుండా సీఎంవో పిలిస్తేనే వెళ్లేందుకు అనుమతివ్వడం, నియోజకవర్గాల రాజకీయాల్లోనూ సీఎంవో జోక్యం చేసుకోవడంతోనే అక్కడ నేతల మధ్యవిభేదాలు ఎక్కువయ్యాయి. మళ్లీ ఇప్పుడు కూడా చంద్రబాబు అదే సీన్ ను రిపీట్ చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు పూర్తిగా టర్న్ అవుతారు. అధికారంలో లేనప్పుడు కార్యకర్తలే తన బలం అంటూ ప్రశంసిస్తారు. జగన్ కూడా అంతే. అధికారంలో ఉన్నప్పుడు కనపడని క్యాడర్ దానిని కోల్పోయిన వెంటనే గుర్తుకువస్తారు. చంద్రబాబు కూడా అలాగే ఆలోచిస్తుంటారు. సహజంగా ముఖ్యమంత్రి అయిన తర్వాత పాలనను గాడిలో పెట్టడానికి ఎక్కువ సమయం కేటాయించడంలో తప్పు లేదు. కానీ అదే సమయంలో పార్టీని, కార్యకర్తల భవిష్యత్ ను కూడా అంతే దృష్టిలో పెట్టుకుని చేయాలన్నది ఇద్దరూ మర్చిపోయే అంశం. అందుకే ఇప్పుడు తెలుగు తమ్ముళ్లలో కూడా ఒకింత అసహనం ఆరు నెలల్లోనే బయలుదేరిందంటున్నారు.నిజానికి చంద్రబాబు నాయుడు ప్రతి శనివారం పార్టీ కేంద్ర కార్యాలయానికి వెళుతుండటం కొంత పార్టీ కార్యకర్తల్లో జోష్ నింపుతున్నప్పటికీ వారికి అవసరమైన విషయాలను మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నిజానికి పార్టీ పట్ల, పాలన పట్ల ప్రజలు ఏమనుకుంటున్నారన్నది వాస్తవాలు తెలియాలంటే కార్యకర్తలే ముఖ్యం. వారి నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటే ఏదైనా కరెక్ట్ విషయాలు తెలుస్తాయి. మద్యం కావచ్చు. ఉచిత ఇసుక విధానం కావచ్చు. సూపర్ సిక్స్ హామీల అమలు కావచ్చు. వాటిపై ప్రజలు ఏమనుకుంటున్నారో నిజంగా తెలియాలంటే కార్యకర్తల నుంచే తీసుకోవాలి. నేతలు అస్సలు నోరు విప్పరు. అధికారులు పెదవి విప్పరు. కానీ చంద్రబాబు మాత్రం ఇప్పుడు మళ్లీ మరోసారి ప్రజా స్పందనపై అధికారులపై ఆధారపడుతున్నట్లే కనిపిస్తుంది. ప్రధానంగా జిల్లా యంత్రాంగం నుంచి ఆయన ఫీడ్ బ్యాక్ తీసుకోవడంతో తప్పుడు సమాచారం అందే అవకాశం ఉందని నేతలే చెబుతున్నారు. ముఖ్యంగా కలెక్టర్ల పై ఆధారపడి ఆయన సమాచారాన్ని సేకరిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో జరుగుతున్న వాస్తవ విషయాలను మాత్రం పరిగణనలోకి తీసుకోవడం లేదు. దీంతో చంద్రబాబు నాయుడు తాను చెప్పినట్లు 1995లో సీఈవో మాదిరిగానే వ్యవహరిస్తున్నారని, మూడు దశాబ్దాలయినా అందులో ఎలాంటి మార్పు రావడం లేదని పార్టీ నేతలే అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి చంద్రబాబు ఈ విషయం ఆలోచించుకుని గ్రౌండ్ లెవెల్ రియాలిటీని తెలుసుకునేందుకు వేరే మార్గాలను ఎంచుకోవాలని పలువురు సూచిస్తున్నారు.

# నిలదీస్తున్న తమ్ముళ్లు...

**విజయవాడ, డిసెంబర్ 18, పెన్ పవర్:** తెలుగుదేశం పార్టీ ఇప్పుడు గతంలో మాదిరిగా లేదు. అవసరమైతే ప్రభుత్వనిర్ణయాలను, పార్టీ తీసుకునే ఏ విషయాన్నైనా కార్యకర్తలు ఇట్టే నిలదీస్తున్నారు. నేతలను వదిలిపెట్టకుండా సోషల్ మీడియాలో వెంటాడుతున్నారు. వేటాడుతున్నారు. దీంతో పార్టీ అధినేత నుంచి ముఖ్యమైన నేతలు ఇప్పుడు క్యాడర్ ను తొలుత సంతృప్తి పర్చిన తర్వాతనే ఏ నిర్ణయమైనా తీసుకోవాల్సి వస్తుంది. గతంలో టీడీపీలో ఎప్పుడూ ఈ పరిస్థితి లేదు. 1995 నుంచి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్ననాటి నుంచి అధికారంలో ఉన్నప్పుడు క్యాడర్ పెద్దగా ఆయన నిర్ణయాలపై ఎటువంటి అభ్యంతరాలను వ్యక్తం చేయలేదు. ఆయన తీసుకునే నిర్ణయమే ఫైనల్ గా మారింది. కాలం మారింది. తరం మారింది. నేతలను నిలదీసే రోజులొచ్చేశాయి. గత ఐదేళ్ల కాలంలో వైసీపీ పాలనతో తాము అనుభవించిన విషయాన్ని వారు గుర్తు చేసుకుని మరీ నేతలను, అధినాయకత్వాన్ని ట్రోల్ చేస్తున్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి ఆరు నెలలయినా వైసీపీ నేతలపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని సూటిగా ప్రశ్నిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునే నిలదీస్తున్నారు. రెడ్ బుక్ ఏమయిందంటూ ప్రశ్నలు సంధిస్తున్నారు. ఎన్నికలకు ముందు చెప్పిన మాటలు ఏమయ్యాయని సూటి ప్రశ్నలు వేస్తున్నారు. దీంతో స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. అనేక సభల్లోనూ ఆయన పదే పదే చెప్పుకోవాల్సి వచ్చింది. తాను ఏదైనాచట్టపరంగానే చర్యలు తీసుకుంటానని, తప్పు చేసిన వారిని వదిలిపెట్టనంటూ ఆయన హెచ్చరికలు జారీ చేశారు. తర్వాత ఏలూరు నియోజకవర్గం నేత, మాజీ మంత్రి ఆళ్ల నానిని టీడీపీలో చేర్చుకోవడంపై కూడా తీవ్ర స్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేసింది క్యాడర్. నియోజకవర్గంలో నేతల నుంచి కార్యకర్తల వరకూ ఆళ్లనాని తమను ఎలా ఇబ్బంది పెట్టింది వారు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. దీంతో చంద్రబాబు ఆళ్ల నానికి కండువా కప్పాల్సిన సమయంలో చేరికను హోల్డ్ లో పెట్టారు. ఆళ్ల నానిని పార్టీలో చేర్చుకుంటే కార్యకర్తల నుంచి తీవ్ర స్థాయిలో వ్యతిరేకత వ్యక్తమవుతుండటంతో నాని చేరిక వాయిదా పడిందా? లేక డోర్లు పూర్తిగా క్లోజ్ అయ్యాయా? అన్నది తెలియకున్నా క్యాడర్ వత్తిడితోనే చంద్రబాబుతో పాటు పార్టీ అగ్రనాయకత్వం తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాల్సి వచ్చింది.తాజాగా నూజివీడులో జరిగిన ఘటన కూడా ఇదే అద్దం పడుతుంది. చంద్రబాబు నాయుడు ఇంటి మీద దాడికి ప్రయత్నించిన మాజీ మంత్రి జోగి రమేష్ తో టీడీపీ నేతలు కలసి గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనడం వివాదంగా మారింది. వెంటనే టీడీపీ సోషల్ మీడియాలో గౌతు శిరీషను, మంత్రి పార్ధసారథిని ట్రోల్ చేశారు. దీంతో నారా లోకేష్ వారిద్దరి నుంచి వివరణ కోరారు. ఇద్దరూ అధినాయకత్వంతో పాటు పార్టీ కార్యకర్తలకు కూడా వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. మరోసారి ఇలాంటి తప్పు జరగదంటూ గౌతు శిరీష, మంత్రి పార్థసారధి కార్యకర్తలను వేడుకోవాల్సి వచ్చింది. దీంతో పార్టీ అధినాయకత్వంతో పాటు నేతలకు కూడా ఇప్పుడు ఏ నిర్ణయం తీసుకోవాలన్నాక్యాడర్ అనుమతి తప్పనిసరిఅయింది. గతంలో మాదిరిగా రాజకీయాలు చేస్తామంటే కుదరదని తమ్ముళ్లు తెగేసిచెబుతున్నారు. అందుకే నేతల నిర్ణయాలను ఒళ్లు దగ్గరపెట్టుకుని చేసుకోవాల్సిందే.

# ఏపీలో రేషన్ వార్...

**విజయవాడ, డిసెంబర్ 18, పెన్ పవర్:** మాజీ మంత్రి పేర్ని నాని కుటుంబం మెడకు రేషన్ బియ్యం వివాదం చుట్టుకుంది. మచిలీపట్నం మండలం పొట్లపాలెంలో నాని సతీమణి పేరుతో ఉన్న గోడౌన్లో బియ్యం మిస్సింగ్ వ్యవహారాన్ని ప్రభుత్వం సీరియస్గా తీసుకుంది. పేర్ని నాని కుటుంబానికి చెందిన గోడౌన్లో 187 టన్నుల రేషన్ బియ్యం మాయమయ్యాయి. అయితే, తమ గౌడౌన్లో మాయమైన బియ్యం ధర ఎంతో చెప్తామని కృష్ణాజిల్లా జేసీకి లేఖ రాయడం సంచలనంగా మారింది.డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలతో గత నెల 28, 29 30 తేదీల్లో పౌర సరఫరాల శాఖ అధికారులు ఎంఎల్ఎస్ పాయింట్లలో తనిఖీలు చేపట్టగా 187 టన్నుల తేడా ఉన్నట్లుగా గుర్తించారు. కోటి డెబ్బై లక్షల రూపాయలు చెల్లించాలంటూ నోటీసులు పంపారు . దీంతో మాజీ మంత్రి పేర్ని నాని కోటి రూపాయల డీడీలు తీయించి ఈ నెల 14న జేసీ కార్యాలయంలో అందజేశారు. మరో 70 లక్షల రూపాయలను సోమవారం చెల్లించారు. మొత్తంగా రెండు విడతల్లో కలిపి రూ.1.7 కోట్ల డీడీలను అధికారులకు అందజేశారు.ఈ వ్యవహారంలో గోడౌన్ ఓనర్ గా ఉన్న జయసుధ పై క్రిమినల్ కేసు నమోదు చేశారు పోలీసులు దీంతో పేర్ని సతీమణి జయసుధ, తనయుడు కృష్ణమూర్తి అజ్ఞాతంలోకి వెళ్లారు. మచిలీపట్నం జిల్లా కోర్టులో జయసుధ బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీని విచారణను ధర్మాసనం తిరిగి 19కు వాయిదా వేసింది.రెండు రోజులు తర్వాత పేర్నినాని అజ్ఞాతం వీడారు. తన ఇంటికి చేరుకోవడంతో వైసీపీ నేతలు ఆయనను పరామర్శించారు . బియ్యం లెక్కల్లో తేడాలు ఎందుకు వచ్చాయో తనకు తెలియదన్నారు పేర్ని నాని.. తాము తప్పు చేయలేదు కాబట్టే బియ్యం మాయంపై లేఖరాశామని పేర్నినాని చెప్పారు.మరోవైపు పేర్ని జయసుధ పేరుతో రేషన్ నిల్వలు ఉన్న గోడౌన్ ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బియ్యాన్ని మార్కెటింగ్ గోడౌన్లకు తరలించారు. తర్వాత లెక్కలు చూసి తేడాలుంటే కేసులు పెడతామన్నారు అధికారులు.పేర్నినాని కేసులో కక్ష సాధింపులేమీ లేదన్నారు మంత్రి నాదెండ్ల మనోహర్.. 4వేలకు పైగా బ్యాగులు మిస్ అయినట్టు గుర్తించామన్నారు. దర్యాప్తు తర్వాత చట్టప్రకారం పేర్ని నాని కుటుంబంపై చర్యలుంటాయన్నారు.

మరోవైపు తమ నేతలను కూటమి ప్రభుత్వం టార్గెట్ చేసిందంటోంది వైసీపీ. కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే వేధింపులకు పాల్పడుతుందని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు.

# సామాన్యులకు ఎంట్రీ...

## 103 ఎకరాల్లో అసెంబ్లీ భవనం

**విజయవాడ, డిసెంబర్ 18, పెన్ పవర్:** ఏపీ ప్రభుత్వం దూకుడుగా ఉంది. కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. పాలనను పరుగులెత్తిస్తోంది. సంక్షేమ పథకాల అమలుతో పాటు అభివృద్ధి పనులపై దృష్టి పెట్టింది. అదే సమయంలో అమరావతి రాజధానితో పాటు పోలవరం ప్రాజెక్టుపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. అమరావతి రాజధాని నిర్మాణ పనులను ప్రారంభించాలని చూస్తోంది. ఇప్పటికే కేంద్రం కూడా ఎంతో ప్రాధాన్యం ఇస్తోంది. కేంద్ర బడ్జెట్లో ఏకంగా 15 వేల కోట్ల రూపాయల సాయాన్ని ప్రకటించింది. ఇందుకు సంబంధించి ప్రపంచ బ్యాంకు నుంచి నిధులు మంజూరు చేయనుంది. జనవరి నుంచి పనులు ప్రారంభించాలని భావిస్తోంది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతిలో జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభమయ్యాయి. నిపుణుల సూచనతో నిర్మాణ పనులు ప్రారంభించవచ్చని.. గతంలో ఎక్కడైతే నిలిచిపోయాయో.. అక్కడ నుంచి ప్రారంభించేందుకు నిపుణులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో ప్రభుత్వం సైతం రెట్టింపు ఉత్సాహంతో పనులు ప్రారంభించేందుకు సిద్ధపడుతోంది.గత అనుభవాల దృష్ట్యా వీలైనంత త్వరగా అమరావతి రాజధాని నిర్మాణ పనులు ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే అమరావతిలో చేపట్టాల్సిన అనేక పనులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రూ. 24276 కోట్ల పనులకు సీఆర్డీఏ ఆమోదం తెలిపింది. ఇప్పటివరకు అమరావతిలో రూ.45,249 కోట్లకు సిఆర్డిఏ ఆమోదం లభించినట్లు మంత్రి నారాయణ తెలిపారు. అయితే అమరావతికి అనుసంధానంగా కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారులతో పాటు రైల్వే లైన్ల నిర్మాణ ప్రాజెక్టులను మంజూరు చేసింది.ఒకవైపు రాజధాని నిర్మాణాలు, ఇంకోవైపు వివిధ సంస్థలకు కేటాయించిన భూముల్లో నిర్మాణాలు ప్రారంభించే వీలుగా ఆయా యాజమాన్యాలతో ఏపీ ప్రభుత్వం చర్చలు జరిపింది. ఒక్కో సంస్థ ముందుకు వచ్చి తమ కార్యకలాపాలను ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తోంది.ఏపీ అసెంబ్లీ భవనాన్ని భారీగా నిర్మించాలన్నది కూటమి ప్రభుత్వ లక్ష్యంగా తెలుస్తోంది. మొత్తం 103 ఎకరాల్లో అసెంబ్లీ భవనాన్ని నిర్మించాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకుగాను రూ.768 కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. నగరం మొత్తం కనిపించేలా అసెంబ్లీపై టవర్ ఏర్పాటు చేయనున్నారు. అసెంబ్లీ సమావేశాల రోజుల్లో మినహా.. మిగతా రోజుల్లో అసెంబ్లీ టవర్ చూసేందుకు సందర్శకులను అనుమతించనున్నారు. ఈ విషయాన్ని మంత్రి నారాయణ వెల్లడించారు. అలాగే నాలుగు జోన్లలో రోడ్ల టెండర్లకు రూ.9,699 కోట్లు, ట్రంక్ రోడ్లకు రూ.7794 కోట్లు ఖర్చు చేసేందుకు సిఆర్డిఏ ఆమోదం లభించినట్లు మంత్రి వివరించారు. మొత్తానికి అయితే ఏపీ అసెంబ్లీ దేశంలోనే ఆదర్శంగా, ఆకర్షణీయంగా నిలవనుందన్నమాట.

# అశ్విన్ షాకింగ్ రిటైర్మెంట్.. ఆ విషయాన్ని ముందుగానే గ్రహించాడా





**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా వెటరన్ ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తన రిటైర్మెంట్ నిర్ణయంతో బిగ్ షాక్ ఇచ్చాడు. ఫామ్ లో ఉన్న ఈ ఆఫ్ స్పిన్నర్ సడన్ గా ఎందుకు అంతర్జాతీయ క్రికెట్ కు రిటైర్మెంట్ ప్రకటించాడనే విషయం సస్పెన్స్ గానే ఉంది. బ్రిస్బేన్‌లో బుధవారం( డిసెంబర్ 18) బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా మూడో టెస్ట్ ముగిసిన తర్వాత అశ్విన్ తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత పక్కనే ఉన్న కోహ్లీని హత్తుకొని ఎమోషనల్ అయ్యాడు. క్రికెట్ లో అశ్విన్ కు చాలా తెలివైనవాడని పేరుంది. అతన్ని క్రికెట్ లో సైంటిస్ట్ తో పోలుస్తారు. ఫామ్ లో ఉన్న అశ్విన్ గుడ్ బై చెప్పడానికి కారణం లేకపోలేదు. ప్రస్తుతం భారత క్రికెట్ యంగ్ ప్లేయర్లపై దృష్టి పెడుతుంది. సీనియర్లను పక్కన పెట్టే ఆలోచనలో ఉంది. పుజారా, రహానే దేశవాళీ క్రికెట్ లో పరుగుల వరద పారిస్తున్న వారిని సెలక్టర్లు పట్టించుకోవడం లేదు. యువ ఆటగాళ్లను ముందుకు తీసుకెళ్లాలనే ఉద్దేశ్యంతో సీనియర్లకు చెక్ పెడుతున్నారు. ఫామ్ లేమితో ఇబ్బంది పడుతున్న రోహిత్, కోహ్లీకి బీసీసీఐ షాక్ ఇచ్చినా ఆశ్చర్యం లేదు. ఈ విషయాన్ని అశ్విన్ ముందుగానే గ్రహించినట్లు ఉన్నాడు. తనను జట్టులో నుంచి సెలక్టర్లు తీసివేయకుండా ముందుగానే తప్పుకోవడం బెటర్ అని భావించి ఉన్నాడు. ప్రస్తుతం అశ్విన్ టెస్ట్ క్రికెట్ మాత్రమే ఆడుతున్నాడు. ఒకవేళ విదేశీ పర్యటన అయితే అతనికి జట్టులో స్థానం దక్కడం లేదు. స్వదేశంలో రెగ్యులర్ గా ఆడుతున్నా కుల్దీప్ యాదవ్, సుందర్, జడేజా, అక్షర్ పటేల్ లాంటి స్పిన్నర్లు అశ్విన్ కు గట్టి పోటీ ఇస్తున్నారు. ఒకవేళ అశ్విన్ ఏదైనా సిరీస్ లో విఫలమైతే అతన్ని టెస్ట్ జట్టులో వేటు తప్పదు. అశ్విన్ ఇప్పటివరకు భారత్ తరపున 106 టెస్టుల్లో 200 ఇన్నింగ్స్ ల్లో బౌలింగ్ చేశాడు. 537 వికెట్లు తీసి భారత్ తరపున టెస్టుల్లో అత్యధిక వికెట్లు తీసిన రెండో ఆటగాడిగా నిలిచాడు. బ్యాటింగ్ లోనూ మెరిసి 3503 పరుగులు చేశాడు. ఇందులో ఆరు సెంచరీలు ఉన్నాయి. 116 వన్డేల్లో 156 వికెట్లు.. 65 టీ20ల్లో 72 వికెట్లు పడగొట్టాడు. అంతర్జాతీయ క్రికెట్ కు రిటైర్మెంట్ ప్రకటించినా ఐపీఎల్ లో అశ్విన్ ఆడతాడు. అతను 2025 ఐపీఎల్ లో చెన్నై సూపర్ కింగ్స్ తరపున ఆడనున్నాడు.

# ఆకాష్ దీప్‌పై కమ్మిన్స్ రివెంజ్.. ఫోర్, సిక్సర్‌తో ఇచ్చిపడేశాడు





**హైదరాబాద్ పెన్ పవర్:** బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ ఆస్ట్రేలియా, భారత జట్ల మధ్య రసవత్తరంగా జరుగుతుంది. ఇరు జట్లు మాత్రమే కాదు ఆటగాళ్ల మధ్య వార్ కొనసాగుతుంది. బ్రిస్బేన్ వేదికగా గబ్బా వేదికగా ముగిసిన టెస్టులో డ్రా గా ముగిసింది. ఈ మ్యాచ్ లో ఇద్దరి ఆటగాళ్ల మధ్య పోరు ఆసక్తికరంగా అనిపించింది. ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమ్మిన్స్, టీమిండియా ఫాస్ట్ బౌలర్ ఆకాష్ దీప్ ల మధ్య బ్యాటింగ్ వార్ నడిచింది. భారత్ బ్యాటింగ్ చేస్తున్నప్పుడు ఆకాష్ దీప్ చివర్లో అద్భుత ఇన్నింగ్స్ తో భారత్ ను ఫాలో ఆన్ గండం నుంచి తప్పించాడు.

ఫాలో ఆన్ తప్పించుకోవాలంటే భారత్ మరో నాలుగు పరుగులు చేయాల్సిన దశలో కమ్మిన్స్ బౌలింగ్ లో ఆకాష్ దీప్ థర్డ్ మ్యాన్ దిశగా ఫోర్ కొట్టాడు. ఈ బౌండరీతో భారత్ ఊపిరి పీల్చుకుంది. ఆ తర్వాత లాంగాన్ దిశగా భారీ సిక్సర్ కొట్టాడు. దీంతో భారత ఆటగాళ్లు డ్రెస్సింగ్ రూమ్ లో సెలెబ్రేషన్స్ ఓ రేంజ్ లో జరిగాయి. ఐదో రోజు ఆటలో భాగంగా ఇన్నింగ్స్ 16 ఓవర్లో ఆకాష్ దీప్ బౌలింగ్ లో కమ్మిన్స్ వరుసగా ఫోర్, సిక్సర్ కొట్టి తన ప్రతీకారం తీర్చుకున్నాడు. ఈ మ్యాచ్ విషయానికి వస్తే బ్రిస్బేన్ వేదికగా గబ్బాలో ముగిసిన ఈ టెస్టులో ఐదో రోజు వర్షం రావడంతో అంపైర్లు మ్యాచ్ ను డ్రా గా ప్రకటిస్తున్నట్టు తెలిపారు. 275 పరుగుల లక్ష్యంతో చివరి రోజు బ్యాటింగ్ కు దిగిన భారత్ కేవలం 2.1 ఓవర్లు మాత్రమే ఆడింది. ఈ దశలో వర్షం రావడంతో అంపైర్లు టీ విరామం ఇచ్చారు. టీ బ్రేక్ తర్వాత వర్షం తగ్గకపోవడంతో ఇరు జట్లు డ్రా కు అంగీకరించారు. మ్యాచ్ డ్రా కావడంతో ప్రస్తుతం భారత్, ఆస్ట్రేలియా జట్లు ఐదు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ లో 1-1 తో సమంగా నిలిచాయి.

# చారిత్రాత్మక విజయం.. వెస్టిండీస్ గడ్డపై సిరీస్ గెలిచిన బంగ్లాదేశ్





**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ఫార్మాట్ లో వెస్టిండీస్ పై సిరీస్ పై గెలవడం అంత సామాన్యమైన విషయం కాదు. సొంతగడ్డపై ఆ జట్టు మరింత పటిష్టంగా కనిపిస్తుంది. పవర్ హిట్టర్లు ఉన్న విండీస్ జట్టును ఆపాలంటే బౌలర్లకు శక్తికి మించిన పని. అయితే బలహీనమైన బంగ్లాదేశ్ వెస్టిండీస్ గడ్డపై ఏకంగా టీ20 సిరీస్ ను గెలిచింది. తక్కువ స్కోర్ కొట్టినప్పటికీ క్రమశిక్షణగా ఆడుతూ తొలి రెండు మ్యాచ్ ల్లో విజయం సాధించింది. మూడు మ్యాచ్ ల టీ20 సిరీస్ ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0 తేడాతో కైవసం చేసుకుంది. బుధవారం (డిసెంబర్ 18) కింగ్ స్టన్ వేదికగా జరిగిన రెండో టీ20లో వెస్టిండీస్ పై 27 పరుగులతో విజయాన్ని అందుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 129 పరుగులు మాత్రమే చేయగలిగింది. విండీస్ బౌలర్లు విజృంభించడంతో ఒక దశలో బంగ్లాదేశ్ 72 పరుగులకే 6 వికెట్లను కోల్పోయింది. ఈ దశలో షామీమ్ హుస్సేన్ 17 బంతుల్లోనే 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 35 పరుగులు చేసి బంగ్లాకు ఓ మోస్తరు స్కోర్ అందించాడు.

130 పరుగుల స్వల్ప లక్ష్య ఛేదనలో వెస్టిండీస్ పూర్తిగా తడబడింది. స్టార్ ఆటగాళ్లు ఉన్నప్పటికీ క్రమం తప్పకుండా వికెట్లను కోల్పోయింది. 42 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. అకేల్ హొసేన్(31),రోస్టన్ చేజ్(32) పోరాడినా విండీస్ కు విజయాన్ని అందించలేకపోయారు. బంగ్లాదేశ్ బౌలర్లలో తస్కిన్ అహ్మద్ మూడు వికెట్లతో వెస్టిండీస్ పరాజయానికి కారణమయ్యాడు. మెహదీ హసన్, సాకిబ్, రిషద్ హుస్సేన్ తలో రెండు వికెట్లు పడగొట్టారు. షామీమ్ హుస్సేన్ కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.



జాన్వీ కపూర్ గ్లామరస్ త్రోబ్యాక్ స్నాప్‌లు

# అతిగా ప్లాన్ చేస్తే అంతేగా.. మలైకా నిరాశ!

మలైకా అరోరా- అర్జున్ కపూర్ జంట బ్రేకప్ గురించి తెలిసిందే. అర్జున్ ఈ విషయాన్ని అధికారికంగా ధృవీకరించాడు. ఆ తరవాత మలైకా జీవితంలోని నిర్వేదాన్ని ఏదో ఒక సందేశం ద్వారా బాహ్య ప్రపంచానికి ఆవిష్కరిస్తోంది. వీలున్న ప్రతిసారీ నిర్లిప్తంగా నిగూఢంగా ఏదో ఒక పోస్ట్ పెడుతూ సోషల్ మీడియాల్లో అలజడి సృష్టిస్తోంది.అర్జున్ కపూర్ అతను ఒంటరిగా ఉన్నాడని ధృవీకరించినప్పటి నుండి, మలైకా అరోరా తన నిగూఢమైన ఇన్‌స్టా పోస్ట్‌లతో చర్చగా మారుతోంది. మలైకా నేరుగా ప్రస్తావించకపోయినా తన పోస్ట్‌లు పుష్కలంగా సంచలనం సృష్టించాయి. జీవితాన్ని ఎలా నడిపించాలో చెబుతూ..అద్భుతమైన కోట్‌తో కూడిన తాజా ఇన్‌స్టా పోస్ట్ ఇప్పుడు వైరల్ అవుతోంది. మలైకా తాజాగా ఒక కోట్‌ను షేర్ చేసింది, %--%అతిగా ప్లాన్ చేయవద్దు. మీరు ఏం ప్లాన్ చేసుకున్నా కానీ.. జీవితం దాని స్వంత ప్రణాళికలను కలిగి ఉంటుంది. ఎల్లప్పుడూ గుర్తుంచుకోండి. మీ జీవితంలోని కొన్ని అందమైన క్షణాలు వాస్తవానికి ప్రణాళిక లేనివి%--% అని చాలా అందమైన విషయాన్ని అంతే హృద్యంగా చెప్పుకొచ్చింది.మలైకా వ్యక్తిగత కల్లోలాలను ఎదుర్కొంటూ కొన్ని నెలల పాటు సవాళ్లను ఎదుర్కొంది. దాదాపు ఆరేళ్ల తర్వాత అర్జున్ కపూర్‌తో విడిపోయిన తర్వాత ఇటీవల తన తండ్రిని కోల్పోయింది. ఈ కష్టాలు ఎన్ని ఉన్నా మలైకా సానుకూలతతో ముందుకు వెళ్లాలని నిశ్చయించుకుంది. మలైకా అరోరా - అర్జున్ కపూర్ 2018లో డేటింగ్ ప్రారంభించారు, అర్బాజ్ ఖాన్ నుండి విడాకులు తీసుకున్న అనంతరం అర్జున్ తో మలైకా ప్రేమాయణం నిరంతరం హెడ్ లైన్స్ లోకొచ్చింది.

## వరుణ్ తేజ్.. లైన్ లో మరో ఫ్లాప్ డైరెక్టర్?





హన్సిక తన ప్రత్యేకమైన స్టైల్‌తో అదరగొట్టింది

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com